www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



అసెంబ్లీ సమావేశాలకు గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నేటి నుంచే అసెంబ్లీ

ఉ.11 గంటలకు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం

అనంతరం బీఏసీ.. ఎన్ని రోజులు సభ నిర్వహించాలో నిర్ణయం

సభకు వచ్చి సీటులో కూర్చుంటేనే హాజరు

ఇక అసెంబ్లీలో ఏఐ ఆధారిత అటెండెన్స్ 13

గైర్హాజరవుతూనే వేతనాలు తీసుకుంటున్న వైసీపీ సభ్యులు

కొత్త విధానంతో దానికి చెక్ పెట్టే యోచన

బుధవారం | 11-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 336

శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: నవమి ఉ.9.59 తదుపరి దశమి, నక్షత్రం: అనూరాధ ఉ.10.53 తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: సా.5.08-6.55, దుర్ముహూర్తం: మ.12.06-12.52, అమృతఘడియలు: తె.3.52-5.39, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.47, సూర్యాస్తమయం: 6.11 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అమిత్ షాకు వేంకటేశ్వరుని ప్రతిమను అందజేస్తున్న చంద్రబాబు

వైజాగ్-విజయవాడ హైస్పీడ్ రైలు

కారిడార్ ఇవ్వండి

హైదరాబాద్-శ్రీశైలం-మార్కాపురం మధ్య కొత్త రైల్వేలైన్ మంజూరు చేయండి

ఏప్రిల్ 1 నుంచి వైజాగ్ రైల్వే జోన్ కార్యకలాపాల ప్రారంభానికి గెజిట్ ఇవ్వండి

బెజవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినల్స్

ఇటార్సీ-విజయవాడ మధ్య సరకు రవాణా కారిడార్.. రైల్వే మంత్రికి వినతులు



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన సీఎం చంద్రబాబు

అమరావతికి చట్టబద్ధత!

చంద్రబాబుకు అమిత్ షా హామీ

పార్లమెంటులో గందరగోళంతో అనేక బిల్లులు ఆగిపోయాయి

మలివిడత సమావేశాల్లో రాజధాని బిల్లు పెడతామన్న కేంద్ర హోం మంత్రి

ఢిల్లీలో కేంద్ర మంత్రులతో సీఎం భేటీ

తొలుత జలశక్తి మంత్రితో సమావేశం

పోలవరం రెండో దశ నిధులకు అభ్యర్థన

నల్లమలసాగర్‌కు అనుమతులివ్వాలని వినతి

ఢిల్లీలో చంద్రబాబు సుడిగాలి పర్యటన

ఏపీకి కేంద్రం అండ.. బాబు డైనమిక్ విజనరీ లీడర్: చౌహాన్.. కృషిభవన్‌లో ఉభయుల భేటీ

కేంద్ర బడ్జెట్‌లో మరిన్ని నిధులివ్వండి

నిర్మలా సీతారామన్‌కు సీఎం అభ్యర్థన

విశాఖ మెట్రోకు ఖట్టర్ సానుకూల స్పందన

మఖానా సాగుకు ప్రోత్సాహకాలివ్వండి

వ్యవసాయ మంత్రి చౌహాన్‌కు వినతి

స్టీల్‌ప్లాంట్‌పై కుమారస్వామితో భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధానిగా అమరావతికి సాధ్యమైనంత త్వరలో చట్టబద్ధత కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముఖ్యమంత్రి చంద్రబాబుకు హామీ ఇచ్చారు. పార్లమెంటులో గందరగోళ పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో అనేక బిల్లులు ఆగిపోయాయని.. మలివిడత బడ్జెట్ సమావేశాల్లో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును ప్రవేశపెడతామని ఆయన చెప్పినట్లు సమాచారం. మంగళవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 వరకు సీఎం ఢిల్లీలో సుడిగాలి పర్యటన చేశారు. వరుసగా

మిగతా 13వ పేజీలో...

పోలవరం రెండో దశకు 32 వేల కోట్లివ్వండి

స్టాప్‌వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా ఎత్తివేయండి

కుడి, ఎడమ కాలువల సామర్థ్యం పెంపు వ్యయాన్ని రీయింబర్స్ చేయండి

జలశక్తి మంత్రికి చంద్రబాబు అభ్యర్థన

ఆల్మట్టి ఎత్తు పెంపు చర్యలపై అభ్యంతరం



13

నేడు క్యాబినెట్ సమావేశం

ఎడా పెడా దోచేశారు

పేదల ఇళ్ల నిర్మాణంలో అంతులేని దోపిడీ

వైసీపీ హయాంలో వేల కోట్ల అవినీతి

విజిలెన్స్ ప్రాథమిక నివేదికలో బట్టబయలు

అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కు

ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టర్లకు ముందుగానే నిధులు

ఆప్షన్-3 ఇంటికి 90 వేల వరకు అడ్వాన్స్

డబ్బు తీసుకుని పనులు చేయని కాంట్రాక్టర్లు

కమీషన్లు తీసుకుని మిన్నకున్న అధికారులు

అధికారులకు కార్పొరేషన్ షోకాజ్ నోటీసులు

కాంట్రాక్టర్ల నుంచి రికవరీ చేయకపోతే జీతాల నుంచి వసూలు చేస్తామని హెచ్చరిక

పనులు చేయని కాంట్రాక్టర్లపై కేసులకు ఆదేశం



గృహ నిర్మాణ శాఖలో విజిలెన్స్ నివేదిక ప్రకంపనలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మరో భారీ అవినీతి బయటపడింది. పేదల ఇళ్ల నిర్మాణంలోనూ వేల కోట్లు కొట్టేసిన విషయం వెలుగుచూసింది. ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణంలో అడ్వాన్స్ పేరుతో కాంట్రాక్టర్లు ముందస్తుగా డబ్బు తీసుకున్నారు. కమీషన్ల కక్కుర్తితో అధికారులు వారికి సహకరించారు. ఇద్దరూ కుమ్మక్కై భారీగా దోచేసి చివరికి ఇళ్లు నిర్మించకుండానే వదిలేశారు. ఈ వ్యవహారాన్నంతటినీ క్షుణ్ణంగా పరిశీలించి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నివేదిక రాష్ట్ర గృహనిర్మాణ శాఖలో ప్రకంపనలు పుట్టిస్తోంది. అడ్డగోలుగా సాగిన ఈ దోపిడీ వ్యవహారంపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తదితరులు ఫిర్యాదులు చేయడంతో కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ కాంట్రాక్టర్లు, హౌసింగ్ అధికారులు కలిసి సాగించిన

మిగతా 14వ పేజీలో...



నిన్నా, నాన్నను మృతదేహాన్ని బైక్‌పై తరలిస్తున్న కుటుంబ సభ్యులు 14

తండ్రి మృతదేహాన్ని బైక్‌పై కూర్చోబెట్టి..

బాధను దిగమింగుతూ 11 కి.మీ ప్రయాణం

ఆటోకు డబ్బుల్లేక నిరుపేద యువకుడి దైన్యం

బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలో దారుణం

'హెచ్-1బీ వీసా' రద్దుకు బిల్లు!



అమెరికన్ల ఉద్యోగాలను లాక్కుంటున్నారు

విదేశీ నిపుణులకు ప్రాధాన్యమివ్వడం అమెరికా ప్రయోజనాలకు విరుద్ధం

హెచ్-1బీ వీసాల జారీకి స్వస్తి పలకాలి

ప్రతినిధుల సభలో బిల్లు పెట్టిన రిపబ్లికన్ సభ్యుడు.. భారతీయ ఐటీ నిపుణులకు షాక్

చట్టంగా మారితే.. 'అమెరికా ఆశలు' గల్లంతే! 2

జగన్ అక్రమాస్తుల కేసులో

'వాన్‌పిక్'కు సుప్రీంలో చుక్కెదురు

సీబీఐ కేసులు కొట్టివేతకు నిరాకరణ

హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం 3



ప్రమాదానికి కారణమైన వైరు, శ్రీనివాసరావు

ప్రాణం తీసిన కేబుల్

రోడ్డుకు అడ్డంగా వేలాడిన వైరు మెడకు తగిలి..

బైక్ నుంచి కిందపడి ప్రధానోపాధ్యాయుడు మృతి

బాపట్ల జిల్లాలో దుర్ఘటన 14

అమెరికా పప్పులు ఉడుకుతున్నాయ్!

అగ్రరాజ్యం పప్పుధాన్యాలపై భారత్‌లో 'జీరో' ట్యాక్స్!

అన్ని రకాల పారిశ్రామిక ఉత్పత్తులపైనా..

కొన్నింటిపై మాత్రం సుంకాలు తగ్గింపు

గూగుల్, అమెజాన్ తదితర ఐటీ కంపెనీలపై విధిస్తున్న డిజిటల్ సర్వీసెస్ పన్ను రద్దు

వాణిజ్య ఒప్పందంపై వైట్‌హౌస్ 'ఫ్యాక్ట్ షీట్'



వాషింగ్టన్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: వాణిజ్య ఒప్పందంలో భాగంగా భారత్ సుంకాలు తగ్గించే అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల జాబితాలో కొన్ని రకాల పప్పులు కూడా ఉన్నట్టు వెల్లడైంది. వాణిజ్య ఒప్పందంపై తాజాగా అమెరికా విడుదల చేసిన 'వాస్తవాల పత్రం (ఫ్యాక్ట్ షీట్)'లో ఈ విషయం పేర్కొంది. ఈ నెల 6న విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఈ పప్పు ధాన్యాల అంశం లేకపోవడం గమనార్హం. వాణిజ్య ఒప్పందానికి సంబంధించి అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్ హౌస్ 'అమెరికా-భారత్ చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం' పేరిట ఫ్యాక్ట్ షీట్ విడుదల చేసింది. "అమెరికాకు చెందిన దాదాపు అన్ని రకాల పారిశ్రామిక ఉత్పత్తులపైనా భారత్ సుంకాలను తొలగిస్తుంది. కొన్నింటిపై సుంకాలను తగ్గిస్తుంది. డిస్టిలరీల్లో వినియోగానంతరం మిగిలే ధాన్యాల పిప్పి (డీడీజీ), ఎర్ర జొన్నలు, బాదం, జీడిపప్పు వంటి ట్రీనట్స్ కొన్ని రకాల పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, ఆల్కహాల్‌తోపాటు కొన్ని రకాల పప్పులు, ఇతర ఉత్పత్తులపైనా సుంకాలను సున్నాకు తగ్గిస్తుంది" అని అందులో

మిగతా 2వ పేజీలో...



'33 ఏళ్లకు తప్పనిసరి రిటైర్మెంట్'కు నో

ఈ సర్వీస్ నిబంధన పట్ల ఏపీ విముఖత

నిజానికి, 1980 నుంచే ఈ నిబంధన

తొలిసారి 2023లో ముసాయిదా తయారుచేసిన వైసీపీ ప్రభుత్వం

ఎన్నికలు దగ్గర పడడంతో అప్పట్లో నిలిపివేత

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అన్ని అర్హతల ప్రకారం 33 ఏళ్ల సర్వీసు పూర్తయిన ప్రభుత్వ ఉద్యోగులకు తప్పనిసరి రిటైర్మెంట్ ఇచ్చే నిబంధనను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా లేదు. అయితే, కేంద్ర ప్రభుత్వ నిబంధనల్లో అది ఉంది. దీనిపై వైసీపీ హయాంలో అప్పటి రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ 2023లో ముసాయిదాను సిద్ధం చేశారు. ఇందులోభాగంగా అన్ని రాష్ట్రాల పెన్షన్

మిగతా 14వ పేజీలో...

డీప్‌ఫేక్, నిషేధిత ఏఐ కంటెంట్‌ను 3 గంటల్లో

తొలగించాల్సిందే

ఐటీ రూల్స్ చట్టానికి సవరణలు, నోటిఫికేషన్

36 గంటల గడువును 3 గంటలకు తగ్గించిన కేంద్రం

పిల్లలపై దౌర్జన్యం, మహిళలపై వేధింపులు, తప్పుడు సమాచారం తదితర అంశాలకు వర్తింపు

ఏఐ కంటెంట్‌పై హెచ్చరిక తప్పనిసరి

సాధారణ ఎడిటింగ్, విద్య, డిజైన్ సంబంధిత అంశాలకు మినహాయింపు

ఈ నెల 20వ తేదీ నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఏఐతో సృష్టించిన కృత్రిమ వీడియోలు, ఆడియోలు, డీప్‌ఫేక్ వంటి కంటెంట్‌పై కేంద్రప్రభుత్వం కొరడా ఝుళిపించింది. నిషేధిత జాబితాలో ఉన్న ఏఐ కంటెంట్‌ను తొలగించాలని కోర్టులు లేదా సంబంధిత అధికారులు నోటీసులు ఇచ్చిన మూడు గంటల్లోగా వాటిని తొలగించాలని యూట్యూబ్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను నిర్దేశించింది. ఇప్పటి వరకూ ఉన్న

మిగతా 2వ పేజీలో...



11

ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా

బాలాజీ మేడమల్లి

రాష్ట్రపతి ఆమోదం.. కేంద్రం నోటిఫికేషన్

శ్రీవారి నైవేద్య దినుసులూ

నాసిరకమే!

వైసీపీ హయాంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల పేరుతో వినియోగం 14



కూటమి ప్రభుత్వం వచ్చాక పరీక్షలు

ఆయా పదార్థాల్లో మలినాలు ఉన్నాయని నివేదికలో నిర్ధారణ

ట్యాంకర్ల నుంచి లంచాలు

తిరుచానూరు మార్కెట్ కమిటీ ఉద్యోగిపై వేటు

వైసీపీ హయాంలో ఆర్నెల్లలో 3.68 లక్షలు వసూలు

చెక్‌పోస్టు లేకుండానే చిరుద్యోగి లంచాల దందా

వైష్ణవి డెయిరీ లావాదేవీలపై లోతైన విచారణ



11

రూ. 1,198 కోట్ల ఫీజు బకాయిలు విడుదల

2024-25 విద్యా సంవత్సరానికి చెల్లింపు

బడ్జెట్ రిలీజ్ ఆర్డర్లపై ఉత్తర్వులు జారీ

నేడు ప్రైవేటు వర్సిటీలకు ప్రత్యేక జీవో?

తండ్రి ద్రోహాన్ని కప్పేసి..

తన నిర్లక్ష్యానికి ముసుగేసి..!

ఆల్మట్టి డ్యాం ఎత్తుపై జగన్ పత్రిక బురద

బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట ఏనాడూ సమర్థ వాదనలు వినిపించని వైఎస్

సుప్రీంలోనూ న్యాయపోరాటం చేయని వైనం

2019లో జగన్ వచ్చాక అంతులేని అలక్ష్యం

తన పాపాన్ని చంద్రబాబుకు చుట్టే కుయుక్తులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచేందుకు కర్ణాటక ప్రభుత్వం పచ్చజెండా ఊపిందని.. ఇక ఆంధ్రప్రదేశ్ ఎడారిగా మారుతుందంటూ జగన్ రోత పత్రిక రాసిన కథనంపై రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలో ఉండగా ఈ డ్యాం ఎత్తు పెంపును అడ్డుకోవడానికి ఒక్క ప్రయత్నమూ చేయలేదన్న వాస్తవాన్ని, ఆయన సీఎంగా ఉండగా తీవ్ర నిర్లక్ష్యం వహించిన నిజాన్ని కప్పిపుచ్చి.. ఆ పాపాన్ని సీఎం చంద్రబాబుకు

మిగతా 12వ పేజీలో...



ఆల్మట్టిపై ఇన్ని అబద్ధాలా?

ఎత్తు పెంపును వ్యతిరేకిస్తూ టీడీపీ ప్రభుత్వాల పోరు

కేంద్రానికి ఎన్టీఆర్, చంద్రబాబు లేఖాస్త్రాలు

ఇందుకు చారిత్రక ఆధారాలున్నాయ్ 12

ప్రజలను రెచ్చగొట్టేందుకు జగన్ బొంకులు

మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం

యాక్..ఛీ.. విషపు రాతలు

'ఆంధ్రజ్యోతి'కి స్థలంపై అవే తప్పుడు వాదనలు

జీవీఎంసీలో ఒక్కరు వ్యతిరేకిస్తే తిరస్కరించినట్లుగా అచ్చోసిన అబద్ధాలు 12

67వ అంశంగా ఆమోదించినా ప్రేలాపనలు

2024 నవంబరు 29న హైకోర్టు తీర్పు

తీర్పు వచ్చిన 9 నెలలకు కౌన్సిల్‌లో తీర్మానం

ఇందులో అధికార బలప్రదర్శన ఎక్కడిది?

నిజాలు దాచి జగన్ పత్రిక పిచ్చిరాతలు

అవినీతి సూచీలో 91వ స్థానంలో భారత్

» నిరుడు 38 స్కోరుతో 96వ స్థానం.. ఈసారి మెరుగు

» 2025 సూచీ విడుదలచేసిన ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' తాజాగా విడుదల చేసిన అవినీతిమయ దేశాల జాబితాలో.. 2025 సంవత్సరానికిగాను భారత్ 91వ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇచ్చే సంస్కృతి, ప్రభుత్వ నిధుల మళ్లింపు, బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతం (నెపోటిజం), అవినీతిని ప్రశ్నించేవారికి, జర్నలిస్టులకు ఎంతవరకూ రక్షణ ఉంది అనే అంశాల ఆధారంగా దేశాలకు 0 (అత్యధిక అవినీతి) నుంచి 100 (అసలు అవినీతి లేని పరిస్థితి) దాకా స్కోరు ఇవ్వడం ద్వారా ఈ జాబితా రూపొందిస్తారు. ఇందులో భారత్ 39 స్కోరుతో.. మాల్దీవులు, మొరాకో, ట్యునీషియాతో సమానంగా 91వ స్థానంలో నిలిచింది. కిందటి ఏడాది స్కోరు (38)తో పోలిస్తే 2025లో భారత్ స్కోరు ఒక్క పాయింట్ మేర మెరుగుపడింది. ప్రపంచవ్యాప్తంగా అవినీతి సమస్య నానాటికీ పెరిగిపోతోందని.. అవినీతికి సంబంధించి ప్రపంచ దేశాల సగటు స్కోరు దశాబ్దకాలంలోనే అతి తక్కువగా 42కు పడిపోవడం, మూడింట రెండొంతుల దేశాల స్కోరు 50లోపే ఉండడం ఆందోళన కలిగిస్తోందని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ తన నివేదికలో పేర్కొంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో.. నానాటికీ పెరుగుతున్న అవినీతిపట్ల ప్రజలు ఆగ్రహంతో ఉన్నట్టు.. పలు దేశాల్లో యువత ఈ అవినీతికి వ్యతిరేకంగా నిరసనలకు దిగుతున్నట్టు తెలిపింది. ఈ జాబితాలో 89 స్కోరుతో డెన్మార్క్ అతి తక్కువ అవినీతి ఉన్న దేశంగా అగ్రస్థానంలో నిలవగా.. ఫిన్‌లాండ్ (88), సింగపూర్(84),న్యూజిలాండ్(81),నార్వే(81)స్వీడన్(80), స్విట్జర్లాండ్(80), లగ్జెంబర్గ్(78), నెదర్లాండ్స్(78) జర్మనీ(77) టాప్‌టెన్‌లో ఉన్నాయి.

ఆంత్రోపిక్ ఏఐ సేఫ్టీ చీఫ్ మృణాంక్ రాజీనామా

» ప్రపంచం ప్రమాదంలో ఉందంటూ 'ఎక్స్'లో పోస్ట్

» వివేకం లేని సామర్థ్యం ప్రమాదకరమేనని స్పష్టీకరణ



న్యూయార్క్, ఫిబ్రవరి 10: ప్రముఖ కృత్రిమ మేధ స్టార్టప్ 'ఆంత్రోపిక్'లో ఏఐ సేఫ్టీ విభాగాధిపతిగా పనిచేస్తున్న ప్రవాస భారతీయుడు మృణాంక్ శర్మ ఇటీవలే తన పదవికి రాజీనామా చేశారు! ఈ సందర్భంగా ఆయన.. రిల్కే, విలియం స్టాఫోర్డ్ వంటి ప్రముఖ కవుల కవితలను ఉటంకిస్తూ.. "ప్రపంచం ప్రమాదంలో ఉంది" అంటూ 'ఎక్స్' వేదికగా ఆయన నిగూఢంగా పెట్టిన పోస్టు సిలికాన్‌వ్యాలీలో హాట్ టాపిక్‌గా మారింది. "నేను ఆంత్రోపిక్ నుంచి తప్పుకొంటున్నాను. గత మూడేళ్లుగా ఈ బృందంతో కలిసి పనిచేయడం నాకు దక్కిన గౌరవం. నాటి నుంచి ఇప్పటివరకూ ఏఐ రంగంలో జరిగిన మార్పులు నమ్మశక్యం కానివి. మనం నిర్మిస్తున్న ఏఐ మోడళ్ల సామర్థ్యం రోజురోజుకూ అద్భుతంగా పెరుగుతోంది. కానీ, మన సమాజానికి ఉండాల్సిన వివేకం మాత్రం అదే స్థాయిలో పెరగట్లేదు. వివేకం లేని సామర్థ్యం ఎప్పుడూ ప్రమాదకరమే. కేవలం ఏఐ వల్లనో, జీవాయుధాల వల్లనో మాత్రమే కాకుండా ప్రస్తుతం ఒకదాంతో ఒకటి ముడిపడి ఉన్న అనేక సంక్షోభాల వల్ల ప్రపంచం ప్రమాదంలో ఉంది" అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. సంస్థలో తమపై పెరుగుతున్న ఒత్తిడి కారణంగా అత్యంత ముఖ్యమైన విలువలను పక్కన పెట్టాల్సి వస్తోందని ఆయన ఆవేదన వెలిబుచ్చారు.

అనిల్ అంబానీ దంపతులకు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: హవాలా లావాదేవీల నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద వాంగ్మూలం ఇవ్వాలని రిలయన్స్ అనిల్ ధీరూబాయి అంబానీ గ్రూపు (అడాగ్) ఛైర్మన్ అనిల్ అంబానీ దంపతులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. తొలుత సోమవారం వాంగ్మూలం ఇవ్వాల్సిన అనిల్ అంబానీ భార్య టీనా అంబానీ గైర్హాజరయ్యారు. తాజాగా ఈ నెల 17న వాంగ్మూలం ఇచ్చేందుకు రావాలని ఆమెకు ఈడీ సమన్లు జారీ చేసింది. ఆ మరునాడు, ఈ నెల 18న అనిల్ అంబానీ వాంగ్మూలాన్ని ఈడీ నమోదు చేయనున్నది. ఈడీ జారీ చేసిన సమన్లపై అడాగ్ గ్రూప్ స్పందన తెలియాల్సి ఉంది. న్యూయార్క్‌లోని మ్యాన్‌హట్టన్‌లో విలాసవంతమైన ఇల్లు కొనుగోలు చేసిన విషయమై టీనా అంబానీని ఈడీ విచారణకు పిలిచినట్లు తెలుస్తోంది.

మరింత కచ్చితంగా సునామీల జాడ

బెంగళూరు, ఫిబ్రవరి 10: సముద్రంలో భూకంపం వస్తే దాని ప్రభావం ఎంత? సునామీ వచ్చే పరిస్థితులు ఉన్నాయా?.. సముద్రగర్భంలో ఇంకేదైనా పరిస్థితుల వల్ల సునామీలు ముంచెత్తుతాయా? లాంటి వివరాలను మరింత కచ్చితంగా తెలుసుకోవడానికి, హెచ్చరికల వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి మన దేశం సిద్ధమైంది. దీనికోసం అధునాతన వ్యవస్థను నెలకొల్పాలని నిర్ణయించింది. అండమాన్, నికోబార్ దీవుల్లో ప్రాంతీయ సేవా కేంద్రం(ఆర్ఎస్‌సీ)ని ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తోంది. "భూకంపాల ద్వారా వచ్చే సునామీలను మాత్రమే ప్రస్తుతం ఉన్న వ్యవస్థ గుర్తిస్తుంది. భూకంపాలు లేకుండానే వచ్చే సునామీలను గుర్తించే సామర్థ్యమున్న అధునాతన వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి" అని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ అండ్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్) డైరెక్టర్ బాలకృష్ణన్ నాయర్ చెప్పారు. ప్రస్తుతం ఉన్న వ్యవస్థ ఆధునికీకరణలో భాగంగా రూ. 300 కోట్లతో అండమాన్, నికోబార్ దీవుల్లో ఆధునిక ప్రాజెక్టు అమలు చేయాలని తలపెట్టారు. రెండు టెక్టానిక్ ప్లేట్ల మధ్య 270 కి.మీ మేర సబ్‌సీ కేబుల్‌ను ఏర్పాటు చేస్తారు. దీనివల్ల భూకంపాల నుంచే కాకుండా, సముద్ర గర్భంలో వచ్చే మార్పులను కూడా గుర్తించవచ్చు.

విపక్ష నేతల్లారా..ఇదేనా శాంతియుత నిరసన?



ప్రధాని మోదీ సీటుకు అడ్డంగా నిలబడి విపక్షాలకు చెందిన మహిళా ఎంపీల నిరసన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో ఈ నెల 4న ప్రధాని మోదీ మాట్లాడాల్సి ఉండగా.. ఆయన సభకు రాక ముందే విపక్ష మహిళా ఎంపీలు ఆయన కుర్చీని చుట్టుముట్టడంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మంగళవారం రెండు వీడియోలను విడుదల చేశారు. తాము శాంతియుతంగా నిరసన తెలిపామని, మోదీపై చెయ్యెత్తే ఉద్దేశం తమకు లేదంటూ వారు సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసిన సంగతి తెలిసిందే. వారి శాంతియుత నిరసన ఇదేనంటూ రిజిజు ఆ వీడియోలను 'ఎక్స్'లో పోస్టుచేశారు. బ్యానర్ పట్టుకుని ఆ మహిళా ఎంపీలు ప్రధాని కుర్చీ చుట్టూ చేరడం.. కేంద్ర మంత్రులు గిరిరాజ్‌సింగ్, మరికొందరు ఎంపీలు వారిని వెనక్కి వెళ్లాలని కోరడం వాటిలో కనబడుతోంది. 'తమ ఎంపీల దిగజారుడు ప్రవర్తనకు కాంగ్రెస్ ఎంతగానో గర్వపడుతోంది. మా ఎంపీలందరినీ గనుక మేం అడ్డుకుని ఉండకపోతే.. ప్రధాని కుర్చీని చుట్టుముట్టిన విపక్ష ఎంపీలను ఎదుర్కొనేందుకు మా మహిళా ఎంపీలను అనుమతించి ఉంటే.. సభలో చాలా దారుణ దృశ్యానికి దారితీసేది. పార్లమెంటు హుందాతనాన్ని కాపాడాలని.. దుందుడుకుగా వ్యవహరిస్తున్న విపక్ష ఎంపీలతో భౌతిక ఘర్షణకు బీజేపీ ఎంపీలు దిగరాదని మా నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలున్నాయి' అని రిజిజు పేర్కొన్నారు.

రాహుల్‌తో భేటీ జరిగినా వివరాలు చెప్పలేను

» ఢిల్లీ వెళుతూ డీకే శివకుమార్ వ్యాఖ్యలు

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో తాను సమావేశమైనా, అక్కడ చర్చించే వివరాలను బయటకు చెప్పలేనని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ఢిల్లీ వెళ్లే ముందు మంగళవారం బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో రహస్యంగా ఎటువంటి చర్చలు జరపలేదన్నారు. కాగా, ఢిల్లీలో పలువురితో భేటీ కావాల్సి ఉన్నందున వెళుతున్నానని డీకే శివకుమార్ ముందుగానే తనకు సమాచారం ఇచ్చినట్లు సీఎం సిద్దరామయ్య తెలిపారు.

అమెరికా పప్పులు ఉడుకుతున్నాయ్!

(మొదటిపేజీ తరువాయి)



పేర్కొంది. వాణిజ్య ఒప్పందం సంయుక్త ప్రకటనలో పప్పుల అంశం లేకున్నా... దిగుమతి సుంకాలు తగ్గించే అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తుల జాబితాలో పప్పు ధాన్యాలు కూడా ఉంటాయని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ శనివారమే సంకేతాలు ఇచ్చారు. యూపీయే ప్రభుత్వ హయాం నుంచీ బాదాం, పిస్తా, వాల్‌నట్స్, పప్పు ధాన్యాలు వంటి మనకు అవసరమైన ఉత్పత్తులపై దిగుమతి సుంకాల మినహాయింపు కొనసాగుతోందని పేర్కొన్నారు. నిజానికి భారత్ ఇటీవల పప్పు ధాన్యాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం పెరిగింది. 2024-25లో మొత్తం రూ.50 వేల కోట్ల (5.5 బిలియన్ డాలర్ల) పప్పులను దిగుమతి చేసుకోగా.. అందులో అమెరికా నుంచి వచ్చినవి రూ.812 కోట్లు (89.7 మిలియన్ డాలర్లు) మాత్రమే. భారత్ ఎక్కువగా కెనడా, ఆస్ట్రేలియా నుంచి పప్పు ధాన్యాలను దిగుమతి చేసుకుంటుంది.

డిజిటల్ సర్వీస్ ట్యాక్స్ తొలగింపు హామీ..

వాణిజ్య ఒప్పందంలో భాగంగా భారత్ డిజిటల్ సర్వీస్ ట్యాక్స్‌ను తొలగిస్తుందని వైట్‌హౌజ్ ఫ్యాక్ట్ షీట్‌లో పేర్కొంది. డిజిటల్ వాణిజ్యానికి అవరోధంగా ఉన్న అంశాలపై చర్చించి.. ఈ అంశంపై ద్వైపాక్షిక నిబంధనల రూపకల్పనకు భారత్ అంగీకరించిందని పేర్కొంది. ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిషన్స్‌ను కస్టమ్స్ సుంకాల నుంచి పూర్తిగా మినహాయించే నిబంధనలు కూడా అందులో ఉంటాయని వెల్లడించింది. గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి కంపెనీలు అమెరికా కేంద్రంగానే పనిచేస్తూ.. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ సర్వీసులు అందిస్తుంటాయి. ఆన్‌లైన్‌లో ప్రకటనల ద్వారా అన్ని దేశాల నుంచి భారీగా ఆదాయం పొందుతుంటాయి. కానీ ఆయా దేశాలకు ఆ ఆదాయంపై పన్ను చెల్లించవు. భారత్, యూకే వంటి దేశాల్లో మాత్రం డిజిటల్ సర్వీస్ పన్ను అమల్లో ఉంది. మన దేశం ఆన్‌లైన్ ప్రకటనల ఆదాయంపై 2శాతం పన్ను విధిస్తోంది. దాన్ని తొలగించాలని గూగుల్, అమెజాన్, మెటా వంటి దిగ్గజ సంస్థలు భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పుడు అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఈ పన్నును తొలగిస్తామని భారత్ హామీ ఇచ్చిందని వైట్‌హౌజ్ ఫ్యాక్ట్ షీట్‌లో పేర్కొన్నారు.

టారిఫ్‌లు సున్నా చేస్తే అమెరికా గెలిచేది..

టీ20 క్రికెట్ ప్రపంచకప్‌లో భాగంగా అమెరికా (యూఎస్ఏ)తో జరిగిన మ్యాచ్‌లో భారత్ విజయం సాధించిన అంశాన్ని ప్రస్తావిస్తూ కేంద్ర వాణిజ్య మంత్రి గోయల్ సరదా వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై సుంకాలను అమెరికా సున్నాకు తగ్గించి ఉంటే. టీ20 మ్యాచ్‌లో అమెరికా గెలిచి ఉండేదన్నారు. అమెరికా ఈ మ్యాచ్‌లో అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించిందని అభినందించారు.

'హెచ్-1బీ వీసా' రద్దుకు బిల్లు!

» ప్రతినిధుల సభలో బిల్లు ప్రవేశపెట్టిన రిపబ్లికన్ సభ్యుడు గ్రెగ్ స్టూబ్

వాషింగ్టన్, ఫిబ్రవరి 10: భారతీయ ఐటీ నిపుణులకు చేదువార్త. అమెరికాలో నివసిస్తూ ఉద్యోగాలు చేస్తున్న వేలాది మంది భారతీయ ఐటీ ఉద్యోగులకు షాకిచ్చేలా అక్కడి చట్టసభలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హెచ్-1బీ వీసా కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ ఫ్లోరిడాకు చెందిన రిపబ్లికన్ సభ్యుడు గ్రెగ్ స్టూబ్ ప్రతినిధుల సభలో బిల్లును ప్రవేశపెట్టారు. అమెరికా పౌరుల సంక్షేమం కంటే విదేశీ ఉద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వడం దేశ ప్రయోజనాలకు విరుద్ధమని గ్రెగ్ స్టూబ్ వాదిస్తున్నారు. కార్పొరేట్ సంస్థలు తక్కువ వేతనాలకే విదేశీయులను తెచ్చుకుంటూ అమెరికా యువతకు దక్కాల్సిన ఉద్యోగాలను హరిస్తున్నాయని ఆరోపించారు. ఉద్యోగాల్లో అమెరికన్లకే తొలి అవకాశం కల్పించాలని, అందుకే ఈ బిల్లును ప్రతిపాదిస్తున్నానని చెప్పారు. ఈ బిల్లు చట్టంగా మారితే మాత్రం అమెరికాలో స్థిరపడాలనుకునే లక్షలాది మంది భారత టెకీల ఆశలపై నీళ్లు చల్లినట్లే. హెచ్-1బీ వీసా పొందుతున్న వారిలో 80శాతానికి పైగా భారతీయులు, చైనీయులే ఉంటున్నారు. ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే వలసదారులపై ఉక్కుపాదం మోపుతన్న సంగతి తెలిసిందే. కొత్త హెచ్-1బీ వీసాలపై లక్ష డాలర్ల రుసుమును విధించింది. పైగా లాటరీ విధానానికి బదులు ఎక్కువ జీతం ఇచ్చే ఉద్యోగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

లోకం తీరు



కేవలం హెచ్‌బీఏ1సీ పరీక్షపైనే ఆధారపడొద్దు!

» మధుమేహం గుర్తింపు, చికిత్సపై పరిశోధకుల హెచ్చరిక



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: దక్షిణాసియాలో ప్రత్యేకించి భారతదేశంలో మధుమేహం గుర్తింపు, చికిత్స కోసం కేవలం హెచ్‌బీఏ1సీ(గ్లైకేటెడ్ హిమోగ్లోబిన్) పరీక్షపైనే ఆధారపడటం తగదని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. రక్తహీనత, రక్తం హెచ్చుతగ్గులు ఉన్న సందర్భంలో హెచ్‌బీఏ1సీ పరీక్షపై మాత్రమే ఆధారపడితే వ్యాధి నిర్ధారణ, పర్యవేక్షణ క్లిష్టతరమవుతుందన్నారు. ది లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్‌ఈస్ట్ ఆసియా జర్నల్‌లో ఈ మేరకు ఒక ఆర్టికల్ ప్రచురితమైంది. కచ్చితమైన నిర్ధారణ కోసం సంబంధిత హెమటాలజిక్ అంచనాలతోపాటు ఓరల్ గ్లూకోజ్ టోలరెన్స్ పరీక్ష, రక్తంలో గ్లూకోజ్ స్థాయిల స్వీయ పర్యవేక్షణ, నిరంతరంగా గ్లూకోజ్ పర్యవేక్షణ చేపట్టాలని ఆ ఆర్టికల్‌లో సూచించారు. పరిశోధకుల బృందంలో ఫోర్టిస్-సీడీఓసీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ డయాబెటిస్, మెటబాలిక్ డిసీజెస్ అండ్ ఎండోక్రినాలజీ-న్యూఢిల్లీకి చెందిన నిపుణులు కూడా ఉన్నారు. ప్రత్యేకించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పరిమితస్థాయిలో వనరులున్న కేంద్రాలలో రోగ నిర్ధారణలో కచ్చితత్వం, తగిన చికిత్స కోసం మల్టీపారామెట్రిక్ అప్రోచ్ అవసరమని ఈ బృందం స్పష్టం చేసింది. రక్తంలో గత రెండు-మూడు నెలల సగటు చక్కెర స్థాయిని కొలిచేందుకు హెచ్‌బీఏ1సీ పరీక్ష చేస్తున్నారు.

డీప్‌ఫేక్, నిషేధిత ఏఐ కంటెంట్..
3 గంటల్లో తొలగించాల్సిందే!

(మొదటిపేజీ తరువాయి)

గడువు 36 గంటలు కాగా.. దానిని ఏకంగా 3 గంటలకు తగ్గించటం గమనార్హం. ఈ మేరకు 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నిబంధనావళి) రూల్స్ 2021' చట్టానికి సవరణలు చేస్తూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 20వ తేదీ నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. చట్టవ్యతిరేక, మోసపూరిత, లైంగిక వేధింపులు, పిల్లలపై దౌర్జన్యాలు, పేలుడు పదార్థాలు, తప్పుడు పత్రాలకు సంబంధించిన ఏఐ కంటెంట్‌ను ఈ చట్టప్రకారం నిషేధించారు. ఈ తరహా కంటెంట్‌ను ప్రారంభంలోనే నివారించేలా ప్లాట్‌ఫాంలు ఆటోమేటెడ్ టూల్స్‌ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని తాజా సవరణల్లో కేంద్రం స్పష్టం చేసింది. కాగా, నిజమైనదిగా అనిపించేలా ఏఐతో తయారు చేసే నకిలీ ఆడియో, వీడియో, ఆడియో-వీడియో కంటెంట్‌కు నిబంధనలు వర్తించనున్నాయి. ఏదైనా కంటెంట్‌లో సాధారణ ఎడిటింగ్ ప్రక్రియకు, మెరుగులు దిద్దటానికి ఏఐని వాడటం, విద్యా సంబంధమైన, డిజైన్లకు సంబంధించిన అంశాల్లో ఏఐని వాడటానికి మినహాయింపు ఉంటుంది. ఐటీ చట్టం కింద చట్టవ్యతిరేక చర్యలుగా పరిగణిస్తున్న వాటిల్లో ఇక మీదట ఏఐ కంటెంట్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఏఐ కంటెంట్‌ను వినిపిస్తున్నప్పుడు, ప్రదర్శిస్తున్నప్పుడు అది ఏఐ కంటెంట్ అని సోషల్ మీడియా వేదికలు యూజర్లకు స్పష్టంగా వెల్లడించాల్సి ఉంటుంది. ఈ హెచ్చరిక.. వీడియో అయితే తెర మీద ఏ సైజులో ఉండాలి? ఆడియో అయితే ఎంత వ్యవధిపాటు ఉండాలి? అన్న నిబంధనలు 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నిబంధనావళి) రూల్స్, 2021' చట్టంలో కేంద్రం గతంలో పొందుపరిచింది కానీ.. తాజాగా తీసుకొచ్చిన సవరణల్లో వీటిని తొలగించింది. హెచ్చరిక మాత్రం ఉండాలని సవరించింది. కొత్త నిబంధనలను ఉల్లంఘిస్తే ప్రభుత్వం విధించే జరిమానాలపై ప్రతీ 3నెలలకోసారి ప్లాట్‌ఫాంలు తమ యూజర్లను హెచ్చరించాల్సి ఉంటుంది.

'పిల్లల అదృశ్యం'పై సుప్రీం సీరియస్

దీని వెనుక జాతీయ నెట్‌వర్క్ ఏదైనా పని చేస్తోందా?

» ఒకే పద్ధతిలో సాగుతున్నాయా, వేర్వేరు ఘటనలా?

» రాష్ట్రాల నుంచి గణాంకాలను తెప్పించుకోండి

» కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: దేశవ్యాప్తంగా నమోదవుతున్న పిల్లల అదృశ్యం ఘటనల వెనుక జాతీయస్థాయి నెట్‌వర్క్ ఏదైనా పని చేస్తున్నదేమోననే అనుమానాన్ని సుప్రీంకోర్టు వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని నిర్ధారించుకోవాల్సిందిగా కేంద్రాన్ని కోరింది. ఒకే పద్ధతిలో ఇవన్నీ జరుగుతున్నాయా లేక వేర్వేరు ఘటనలా అనేది పరిశీలించాలని సూచించింది. దీనికి సంబంధించి రాష్ట్రాల వద్ద ఉన్న గణాంకాలను తెప్పించుకుని పరిశీలించాలని కోరింది. 'గురియా స్వయమ్ సేవీ సంస్థ' అనే ఎన్జీవో సంస్థ దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణను మంగళవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం కొనసాగించింది. కేంద్రం తరపున అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాతీ వాదనలు వినిపించారు. పిల్లల అదృశ్యం, దానిపై నమోదైన కేసుల వివరాలను కొన్ని రాష్ట్రాలు తమతో పంచుకుంటుండగా, ఎక్కువ రాష్ట్రాలు మాత్రం సహకరించడం లేదన్నారు. పూర్తి గణాంకాలు చేతిలో లేకుండా ఏ విషయమూ నిర్ధారించలేమని తెలిపారు. దీనిపై బెంచ్ జోక్యం చేసుకుంటూ.. ఈ ఘటనల వెనుక జాతీయ నెట్‌వర్క్ లేక రాష్ట్రాల పరిధిలో ఏదైనా ప్రత్యేక గ్రూపు ఉన్నదా అనేది తెలుసుకోవాలని అనుకుంటున్నామని స్పష్టం చేసింది. అదృశ్యం చెర నుంచి బయటపడిన పిల్లలను ఆరాతీసి కొన్ని వివరాలు తెలుసుకోవచ్చునని సూచించింది. ఈ విషయంలో కేంద్రానికి సహకరించని రాష్ట్రాలను ఉపేక్షించబోమని, అవసరమైతే కఠిన ఆదేశాలు జారీ చేస్తామని బెంచ్ హెచ్చరించింది. సీనియర్ న్యాయవాది అపర్ణ భట్ స్పందిస్తూ.. దీనిపై ఇప్పటికే రాష్ట్రాలను కేంద్రం అప్రమత్తం చేసిందని, స్పష్టమైన నిర్దేశాలను జారీచేసిందని తెలిపారు. కాగా, గత ఏడాది డిసెంబరు 9న జరిగిన విచారణ సందర్భంగా, కేంద్రానికి సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. దేశవ్యాప్తంగా పిల్లల అదృశ్యాలకు సంబంధించిన ఆరేళ్ల గణాంకాలను తనకు అందించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరింది.



ఆర్టీఐ పదవులు రిటైర్మెంట్ తర్వాత ఇచ్చేవి కావు


» 2 నెలల్లో ఖాళీలను భర్తీ చేయండి

» అన్ని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలులో నిర్లక్ష్యం, దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషన్లలో పెండింగ్ కేసులు పేరుకుపోవడం, పోస్టులు ఖాళీగా ఉండడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సమాచార హక్కు పౌరుల ప్రాథమిక హక్కు అని, దానిని కాపాడటంలో కమిషనర్ల నియామకం అత్యంత కీలకమని పేర్కొంది. సమాచార కమిషన్లలో పదవులను కేవలం 'రిటైర్మెంట్ తర్వాత ఇచ్చే పదవులు'గా చూడవద్దని, పనిభారానికి అనుగుణంగా సిబ్బంది సంఖ్య ఉండాలని హితవు పలికింది. దేశవ్యాప్తంగా సమాచార కమిషన్లలో నియామక ప్రక్రియను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించింది. సమాచార కమిషనర్ల నియామకంలో జాప్యంపై ఆర్టీఐ కార్యకర్త అంజలి భరద్వాజ్ 2019 సెప్టెంబరు 11న సుప్రీంకోర్టులో మిస్‌లీనియస్ అప్లికేషన్ (ఎంఏ) దాఖలు చేశారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, కేరళ, గుజరాత్, ఒడిసా, కర్ణాటక రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను ప్రతివాదులుగా చేర్చారు. ఆ పిటిషన్ మంగళవారం సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'లక్షలాది కేసులు పెండింగ్‌లో ఉండటం ఆందోళనకరం. ఒక సంస్థ పని చేయకుండాపోతే ప్రజలు అప్పీళ్లు దాఖలు చేయడం మానేస్తారు. ఇది ఆర్టీఐ చట్టం ప్రధాన ఉద్దేశాన్నే దెబ్బతీసే ప్రమాదముంద'ని వ్యాఖ్యానించింది. కేవలం ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, ఆ ప్రక్రియ పారదర్శకంగా, చట్టబద్ధంగా ఉండాలని కేంద్రంతో పాటు రాష్ట్రాలకు సూచించింది. తెలంగాణలో ఒక పోస్టు మాత్రమే ఖాళీ ఉందని గత ఏడాది డిసెంబరు 1న రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిందని పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది గుర్తు చేశారు. ఆ పోస్టును భర్తీ చేశారా, లేదా? అనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి సమాచారం అందజేయలేదని తెలిపారు. మహారాష్ట్రలో సుమారు 80 వేల ఆర్టీఐ అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయి.

నరవణే పుస్తకంపై.. పెంగ్విన్ పొంతన లేని వివరణలు!

» ప్రీ ఆర్డర్, పబ్లిష్డ్ పుస్తకం ఒకటి కాదని వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 : మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం. నరవణే పుస్తకం 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'పై వివాదం కొనసాగుతూనే ఉంది. ఈ అంశంపై ఆ పుస్తక ప్రచురణకర్త 'పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా' 24 గంటల్లో రెండోసారి వివరణ ఇచ్చింది. ఆ పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదని పేర్కొంది. తాజాగా ఇచ్చిన ప్రకటనలో.. విడుదల కాబోతున్న పుస్తకం(ఎనౌన్స్‌డ్ బుక్), ప్రి ఆర్డర్‌కు అందుబాటులో ఉన్న పుస్తకం, పబ్లిష్డ్ పుస్తకం ఒకటి కాదని పేర్కొంది. మార్కెట్లో అన్నిచోట్ల కొనుగోలుకి అందుబాటులోకి వచ్చినప్పుడే పబ్లిష్డ్‌గా పరిగణించాలని తన సోషల్ మీడియా హ్యాండిల్‌లో పేర్కొంది. కాగా నరవణే పుస్తకం ప్రచురితం కాకుండానే సర్క్యులేట్ అవుతోందని సోషల్ మీడియాలో వస్తోన్న ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ప్రచురణ సంస్థ పెంగ్విన్ ఈమేరకు వివరణ ఇచ్చింది. ప్రచురితం కాని(అన్‌పబ్లిష్డ్) పుస్తకం రాహుల్‌గాంధీ వద్ద ఉందని వార్తలు వచ్చిన తర్వాత ఈ ఎఫ్ఐఆర్ నమోదు కావడం గమనార్హం. ఈ పుస్తకానికి రక్షణ శాఖ అనుమతి అవసరం. అయితే అనుమతి ఇవ్వలేదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పార్లమెంటు సముదాయంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ గత వారం ఆ పుస్తకాన్ని ప్రదర్శించినప్పటి నుంచి దీనిపై వివాదం మొదలైంది. కాగా మాజీ ఆర్మీ చీఫ్ నరవణే తన పుస్తక ప్రచురణ సంస్థ పెంగ్విన్ ఈ వివాదంపై ఇచ్చిన ప్రకటనను సమర్థించారు. "ఇదే ఆ పుస్తకం స్థితి" అని ఎక్స్‌లో మంగళవారం పేర్కొన్నారు. పెంగ్విన్ ప్రకటనను దాంతో షేర్ చేశారు.

బంగ్లా ఎన్నికల్లో.. మైనారిటీల వైపు ఎవరు?

» రేపే పోలింగ్.. బీఎన్‌పీ, జమాతే ఇస్లామీ మధ్యే పోటీ



హిందువులపై దాడులు ఆపాలని బంగ్లాదేశ్‌లో నిరసన(ఫైల్)

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: కల్లోల బంగ్లాదేశ్‌లో పార్లమెంటు ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. దేశవ్యాప్తంగా మొత్తం 300 స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. పోలింగ్ ముగిసిన వెంటనే లెక్కింపు మొదలుపెట్టి.. శుక్రవారంనాటికి ఫలితాలు ప్రకటిస్తారు. మహ్మద్ యూనస్ సారథ్యంలో నడుస్తున్న ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం స్థానంలో.. ఏ పార్టీని అధికారంలోకి తేవాలో బంగ్లాదేశ్ ప్రజలు ఈ ఎన్నికల్లో నిర్ణయించనున్నారు. బంగ్లాదేశ్‌లో 8% హిందువులు ఉండగా, గడిచిన 2-3 నెలలుగా హిందువులపై దాడులు పెరిగాయి. ఈ తరుణంలో.. బంగ్లా ఎన్నికల సరళిని భారత ప్రభుత్వం, ఇక్కడి నేతలు, రాజకీయ పరిశీలకులు నిశితంగా పరిశీలిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీగా ఉన్న హిందువుల పట్ల ఏ పార్టీ వైఖరి ఎలా ఉందో, ఏ పార్టీ తమ మ్యానిఫెస్టోలో ఈ రెండు అంశాలపై ఏం చెప్పిందో చూస్తున్నారు. మనదేశంలోలాగానే బంగ్లాదేశ్‌లో కూడా లెక్కకు మిక్కిలిగా పార్టీలున్నప్పటికీ.. 2024 దాకా షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ, ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) ప్రధాన పార్టీలుగా ఉండేవి. వీటిలో అవామీలీగ్ పార్టీతోనే గత 15 ఏళ్లుగా భారత్ సత్సంబంధాలు కలిగి ఉంది. అయితే, 2024లో బంగ్లాలో చెలరేగిన విద్యార్థి ఉద్యమం కారణంగా షేక్‌హసీనా పారిపోయి భారత్‌లో తలదాచుకుంటున్నారు. దీంతో ఆ పార్టీ స్థానాన్ని జమాతే ఇస్లామీ భర్తీ చేసింది. దీంతో ప్రస్తుతం బీఎన్‌పీ, జమాత్ పార్టీల మధ్య ఎన్నికల పోరు హోరాహోరీగా సాగుతోంది. ఈ రెండింటిలోనూ.. జమాతే ఇస్లామీ పార్టీతో పోలిస్తే ఖలీదాజియా కుమారుడు తారీఖ్‌రెహమాన్ నేతృత్వంలోని బీఎన్‌పీనే కాస్త ఉదారవాద, ప్రజాస్వామిక ప్రత్యామ్నాయంగా మన ప్రభుత్వం పరిగణిస్తోంది. "మేం గెలిస్తే బంగ్లాదేశ్ ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోదు. ఇతర దేశాలు మా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడాన్ని అంగీకరించదు" అని ఆయన ఒక సభలో పేర్కొన్నారు. అలాగే.. "మేం అధికారంలోకి వస్తే.. ఢిల్లీ కాదు, పిండీ (రావల్పిండి) కాదు.. మాకు బంగ్లాదేశే అన్నింటికన్నా ముందు" అని తారీఖ్ రెహమాన్ పదేపదే చెబుతున్నారు. అంటే.. యూనస్ మార్గానికి భిన్నంగా, ఇరు దేశాలకూ సమానదూరం పాటించే విధానం. మరోవైపు.. జమాతే ఇస్లామీ పార్టీ తన మ్యానిఫెస్టోలో ఢిల్లీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించి, భారత్‌తో స్నేహ, సహకార సంబంధాలు కలిగి ఉంటామని ప్రకటించింది. అయితే, జమాతే పాకిస్తానీ గూఢచార సంస్థ ఐఎస్ఐ పనుపున పనిచేసే సంస్థ అనే ఆరోపణలు ఆ పార్టీపై ఉన్నాయి. 1971యుద్ధంలో పాకిస్థాన్‌కు బహిరంగ మద్దతు పలికిన ఆ పార్టీ.. హసీనా హయాంలో నిషేధాన్ని కూడా ఎదుర్కొంది. అందుకే ఆ పార్టీపై బంగ్లాదేశ్ హిందువులకు పెద్దగా నమ్మకం లేదు.

బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యాపారి దారుణహత్య

ఢాకా, ఫిబ్రవరి 10: బంగ్లాదేశ్‌లో గురువారం సార్వత్రిక ఎన్నికలు జరగనున్న వేళ.. మరో హిందూ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. మిమెన్‌సింగ్ జిల్లాలో సుసేన్ చంద్ర సర్కార్(62) అనే బియ్యం వ్యాపారిని గుర్తు తెలియని దుండగులు కిరాతకంగా నరికి చంపారు. సోమవారం రాత్రి సుసేన్ తన దుకాణంలో ఉండగా, లోపలికి చొరబడిన దుండగులు పదునైన ఆయుధంతో దాడి చేశారు. అనంతరం లక్షలాది రూపాయల నగదు దోచుకుని దుకాణం షట్టర్‌ను మూసివేసి అక్కడి నుంచి పరారయ్యారు. బంగ్లాదేశ్‌లో గత డిసెంబర్‌లోనే దాదాపు 51మతపరమైన హింసాత్మక ఘటనలు జరిగాయి.

అసోం ఓటరు జాబితా నుంచి 2.4 లక్షల పేర్ల తొలగింపు

గువాహటి, ఫిబ్రవరి 10: అసోం అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ రాష్ట్ర ఓటరు జాబితాలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 126 నియోజకవర్గాలకు సంబంధించి 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఆర్)' ప్రక్రియను పూర్తి చేసిన కేంద్ర ఎన్నికల సంఘం, మంగళవారం తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. ఈ కొత్త జాబితా ప్రకారం, రాష్ట్రం మొత్తం మీద 2,43,485 మంది ఓటర్ల పేర్లను తొలగించారు. పోయిన డిసెంబరులో విడుదల చేసిన ముసాయిదా జాబితాలో ఓటర్ల సంఖ్య 2,52,01,624 ఉండగా, తాజా జాబితాలో అది 2,49,58,139కి తగ్గింది.

బెంగాల్‌లో సర్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ (సర్) గడువును రెండు వారాలు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం నిర్ణయించింది. ఓటర్లు సమర్పించిన పత్రాలను పరిశీలించి, క్లయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి ఈ నెల 21 వరకూ గడువు పొడిగించింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు తుది ఓటర్ల జాబితాను ఈ నెల 14కు బదులు 28న ప్రచురించనున్నది.


హంస వాహనంపై విహరిస్తున్న ఆది దంపతులు

హంస వాహనంపై ఆదిదంపతుల విహారం

▸ శ్రీశైలంలో మూడోరోజు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇల కైలాసంగా విరాజిల్లుతున్న శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం తరపున ఈఓ శ్రీను నాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ క్షేత్రపురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. ఈ వాహనసేవలో భక్తులు వేలాదిగా తరలిరావడంతో క్షేత్ర ప్రాంతాలన్నీ కిక్కిరిశాయి. శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి మయూర వాహన సేవ, గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఉదయం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం, సాయంకాలం తిరుమల తిరుపతి దేవస్థానం తరపున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

టీటీడీ ట్రస్టులకు రూ.1.40 కోట్ల విరాళం


టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడికి రూ.కోటి డీడీ అందజేస్తున్న శ్రీహర్షసాయి చౌదరి

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ట్రస్టులకు మంగళవారం రూ.1.40 కోట్లు విరాళంగా అందాయి. హైదరాబాద్‌కు చెందిన గుత్తా శ్రీహర్షసాయి చౌదరి ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.కోటి విరాళాన్ని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన స్మార్ట్ సాఫ్ట్‌వేర్ అండ్ మోహన్ ఇండస్ట్రీస్ ఎండీ యలమంచిలి మదన్మోహనరావు రూ.30 లక్షలు విరాళం అందజేసి అన్నప్రసాదం ట్రస్టుతో పాటు ఇతర ట్రస్టులకు వినియోగించాలని కోరారు. టీటీడీ బోర్డు సభ్యుడు సదాశివరావు ఆయన వెంట ఉన్నారు. గుంటూరుకు చెందిన ఎన్.సుధారాణి అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10,01,116 విరాళం డీడీని టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

14, 15 తేదీల్లో నాస్తిక మేళా

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరి నిడమర్రు రోడ్డులోని చార్వాకాశ్రమంలో ఈ నెల 14, 15 తేదీల్లో 34వ జాతీయ నాస్తిక మేళా జరుగుతుందని నాస్తిక సమాజం నేత కె.స్టాలిన్ తెలిపారు. నాస్తిక మేళాకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. రెండు రోజులపాటు జరిగే ఈ మేళాలో భౌతికవాదానికి సంబంధించిన ఉపన్యాసాలు, వివిధ కళా రూపాలు ఉంటాయని, ప్రగతిశీల వాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని స్టాలిన్ కోరారు.

గుణదల లూర్దుమాత దర్శనానికి

పోటెత్తిన భక్తులు


భక్తులతో కిక్కిరిసిన మేరీమాత పుణ్యక్షేత్రం. (ఇన్‌సెట్) వేదిక వద్ద దివ్యసత్ప్రసాదంతో గురువులు

గుణదల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని గుణదల లూర్దుమాత 102వ మహోత్సవాలకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. దీంతో రెండో రోజు గుణదల కొండ మార్గాలన్నీ జనసంద్రంగా మారాయి. కొండ మధ్యలో గుహవద్ద భక్తులు బారులుతీరి అమ్మను దర్శించుకుంటున్నారు. తమ కోర్కెలు నెరవేరాలని గుణదల మాతను వేడుకొంటున్నారు. "ప్రభువు దాసురాలైన మరియతల్లి ప్రియ భక్తులమైన మనమందరం ఆమెను గౌరవిస్తూ తన కుమారుడైన యేసు ప్రభువును అనుసరించాలి" అని నెల్లూరు కతోలిక పీఠం సమవారస పీఠాధిపతి (బిషప్) ప్రధాన యాజకులు పిల్లి ఆంథోని దాస్ పిలుపునిచ్చారు. విజయవాడలోని గుణదల లూర్ధుమాత 102వ మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై భక్తజనులకు దివ్య సందేశమిచ్చారు. బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు మాట్లాడుతూ.. గుణదల లూర్దుమాత పట్ల సంపూర్ణ విశ్వాసం ఉండబట్టే గత శతాబ్ద కాలంపైగా భక్తులు పుణ్యక్షేత్రానికి తరలి వస్తున్నారని వివరించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పూజాపీఠంపై గురువులు సమష్టి దివ్యపూజాబలి సమర్పించారు. పూజ అనంతరం కతోలిక భక్తులకు పీఠాధిపతులు పవిత్ర దివ్యసత్ప్రసాదం అందజేశారు. గుణదల లూర్దుమాత తిరునాళ్లకు వచ్చే భక్తుల సంఖ్య పెరగటంతో రద్దీలో పిల్లలు తప్పిపోకుండా చైల్డ్ ట్రాకింగ్ టాగ్‌లు ఏర్పాటు చేసినట్టు సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ తెలిపారు.

జగన్ అక్రమాస్తుల కేసులో

'వాన్‌పిక్'కు సుప్రీంలో చుక్కెదురు

సీబీఐ కేసుల కొట్టివేతకు నిరాకరణ

▸ హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల వ్యవహారంలో వాన్‌పిక్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. సీబీఐ కేసులను కొట్టివేయడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. వాన్‌పిక్ ప్రాజెక్టులపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి రికార్డులను పరిశీలించిన తర్వాత కేసుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, సీబీఐ మోపిన అభియోగాలపై విచారణను కింది కోర్టులో ఎదుర్కొని తేల్చుకోవాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వాన్‌పిక్ గతేడాది అక్టోబరు 28న సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలో జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. వాన్‌పిక్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యవహారంలో సమగ్ర విచారణ జరపాలని గతంలోనే హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించిందని, అయితే, తమ వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. సీబీఐ మోపిన అభియోగాలపై దిగువ కోర్టులోనే తేల్చుకోవాలని చెప్పిందని, అసలు నేరం ఏమిటో?, ఏ సెక్షన్ల కింద విచారిస్తున్నారో కూడా పేర్కొనలేదని చెప్పారు. కనీసం నేరమేమిటో చెప్పకుండా విచారణను ఎదుర్కోవాల్సిందేనని చెప్పడం సరికాదన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. హైకోర్టు ఉత్తర్వుల్లో కలుగజేసుకోలేమని తేల్చి చెప్పింది. హైకోర్టులోనే సమగ్ర వాదనలు వినిపించాలని గతంలో సుప్రీంకోర్టుకు వచ్చినప్పుడే సూచించామని గుర్తు చేసింది. 'హైకోర్టు ఇరుపక్షాల వాదనల తర్వాతే ఉత్తర్వులు ఇచ్చింది కదా! ప్రస్తుతానికి ఈ విషయంలో జోక్యం చేసుకోలేం' అంటూ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

కేసు పూర్వాపరాలు ఇవీ...

2008లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని తీర మండలాల్లో వాడరేవు-నిజాంపట్నం పారిశ్రామిక కారిడార్(వాన్‌పిక్) ప్రాజెక్టు కోసం 22 వేల ఎకరాలను సేకరించారు. అందులో అసైన్డ్, ప్రభుత్వ, పట్టా భూములు ఉన్నాయి. ఆ ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని సీబీఐ కేసులు నమోదు చేయడంతో ప్రాజెక్టు నిలిచిపోయింది. భూముల కేటాయింపునకు ప్రతిఫలంగా నాటి సీఎం కుమారుడు వైఎస్ జగన్‌కు చెందిన కంపెనీల్లో నిమ్మగడ్డ ప్రసాద్ రూ.854 కోట్ల పెట్టుబడులు పెట్టారని, ఇది క్విడ్ ప్రోకో కిందకు వస్తుందని సీబీఐ అభియోగపత్రంలో పేర్కొంది. సీబీఐ కేసులను కొట్టివేయాలంటూ వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ 2021లో తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయగా కేసులను కొట్టివేస్తూ 2022 జూలైలో వాన్‌పిక్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఆ తీర్పును సీబీఐ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. కాగ్నిజెన్స్‌కు సరైన కారణాలు పేర్కనలేదన్న కారణంతో కేసును కొట్టివేయడం సరికాదని సుప్రీంకోర్టు పేర్కొంది. కేసు పూర్వాపరాలపై మరోసారి సమగ్రంగా విచారించి తీర్పు ఇవ్వాలంటూ తిరిగి హైకోర్టుకు పంపింది. రికార్డులను పరిశీలించిన తర్వాత కేసుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, సీబీఐ మోపిన అభియోగాలపై విచారణను కింది కోర్టులో ఎదుర్కొని తేల్చుకోవాలని పేర్కొంటూ హైకోర్టు 2025 ఆగస్టు 26న తీర్పు వెలువరించింది. ఆ తీర్పుపై వాన్‌పిక్ మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించగా జోక్యం చేసుకోలేమంటూ తాజాగా పిటిషన్‌ను తోసిపుచ్చింది.

బీసీ హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధిలో రాజీలేదు

మెరుగైన బోధనతో నూరు శాతం ఫలితాలు సాధించాలి

బీసీ సంక్షేమ శాఖ అధికారుల సమీక్షలో మంత్రి సవిత నిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. గుంటూరులో మంగళవారం పది (గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, పల్నాడు, ఉభయ గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, మార్కాపురం) జిల్లాల బీసీ సంక్షేమ శాఖ అధికారులు, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 110 కోట్లు ఉన్న డైట్ బకాయిలు చెల్లించామని, గతంలో ఎన్నడూ లేని విధంగా డైట్ బిల్లు క్లియర్ చేస్తున్నామని, విద్యార్థుల సంక్షేమం అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హాస్టళ్లలో మరమ్మతులు, ఆర్వోప్లాంట్ల నిర్మాణం, వంట సామాగ్రి, ఇతర మౌలిక వసతుల కోసం రూ.75 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు వివరించారు. స్వచ్ఛభారత్ కింద రాష్ట్రంలో ఉన్న బీసీ హాస్టల్స్‌లో 970 వాష్ రూమ్స్ నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల హాస్టల్స్ నూతన భవనాల కోసం రూ.500 కోట్లు ప్రభుత్వం కేటాయించినట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో అధికారులు సిబ్బంది బాధ్యతతో పనిచేసి మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని బీసీ హాస్టల్స్, గురుకులాల్లో పదో తరగతి, ఇంటర్‌లో నూరు శాతం ఫలితాలు సాధించేలా సమష్టి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత ఎన్టీఆర్ జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్లు, అధికారులపై తీవ్ర స్థాయిలో అగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ పనిచేసే అధికారులు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రాజధాని పరిధిలో ఉన్న ఈ జిల్లాలలో అధికారుల పనితీరు అధ్వాన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్రంలో బీసీ సంక్షేమశాఖ అధికారులు లంచాలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. లక్షలకు లక్షలు జీతాలు తీసుకుంటూ ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారని, ఇటువంటి చర్యలు మరలా పునరావృతం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు.

ఆ ఇద్దరు చిన్నారులకు అండగా పవన్‌కల్యాణ్

▸ సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన చిన్నారుల వినతి

▸ తక్షణమే స్పందించిన ఉపముఖ్యమంత్రి పవన్

▸ ఇద్దరికీ ప్రతినెలా రూ.5 వేల వంతున ఆర్థిక సాయం

▸ ఇల్లు మంజూరు.. చదువు బాధ్యత కలెక్టర్‌కు అప్పగింత


తమను ఆదుకోవాలని కోరిన కరణం సత్య, చైతన్య చంటి

పిఠాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): "తల్లిదండ్రులను కోల్పోయాం.. ముందూ వెనుకా ఎవరూ లేరు. ఎంతోమంది అనాథ చిన్నారులను ఆదుకుంటున్న మీరు మమ్మల్ని కూడా ఆదుకోండి పవన్ సారూ..." అంటూ ఇద్దరు చిన్నారులు చేసిన వినతి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించి వారికి అండగా నిలిచారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మాధవపురం గ్రామానికి చెందిన చిన్నారులు కరణం సత్య, చైతన్య చంటి రెండేళ్ల క్రితం తండ్రి శ్రీనును కోల్పోయారు. తల్లి జ్యోతి వారిని పోషించేది. అయితే ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో ఆమె కూడా ఇటీవలే మృతిచెందింది. దీంతో పిల్లలిద్దరూ అనాథలుగా మారారు. సత్య ఇంటర్ పూర్తి చేయగా.. చైతన్య ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వారు ఉండేందుకు ఇల్లు కూడా లేదు. ఈ నేపథ్యంలో తమ దీన స్థితిని వివరిస్తూ చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. విషయం పవన్‌కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో వారి వేదన ఆయనను తీవ్రంగా కదిలించింది. ఆయన ఇప్పటికే తన జీతాన్ని పిఠాపురం నియోజకవర్గంలోని 42 మంది తల్లిదండ్రులు లేని పిల్లలకు నెలకు రూ.5 వేలు వంతున అందజేస్తున్నారు. ఈ ఇద్దరు చిన్నారులకు కూడా ప్రతినెలా రూ.5 వేలు చొప్పున అందజేయాలని తన కార్యాలయ అధికారులను ఆదేశించారు. వారికి తక్షణమే ఇల్లు కట్టించాలని సూచించారు. ఇద్దర్నీ వచ్చే విద్యాసంవత్సరం నుంచి రెసిడెన్షియల్ స్కూల్, తదనంతరం కళాశాలలో చేర్పించే బాధ్యతను కాకినాడ జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు.

ఏపీసీపీడీసీఎల్ పరిధిలో 492 ఫిర్యాదులు పరిష్కారం

▸ ఛైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ సీపీడీసీఎల్) పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో 492 ఫిర్యాదులను పరిష్కరించినట్టు కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) ఛైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ తెలిపారు. గుంటూరు విద్యుత్ భవన్‌లో మంగళవారం జరిగిన విద్యుత్ వినియోగదారుల అదాలత్‌లో ఆయన వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లతో అత్యధిక బిల్లింగ్ వస్తున్నట్టు తమకు ఫిర్యాదులు వస్తున్నాయని, వినియోగానికి మించి బిల్లు వచ్చినట్లయితే ఏపీఈఆర్‌సీ ఆదేశాల మేరకు త్వరలోనే అత్యధిక బిల్లు వచ్చిన మొత్తాన్ని తర్వాత వచ్చే బిల్లులలో సర్దుబాటు చేస్తారని, దీనిపై త్వరలోనే అధికారిక ఉత్తర్వులు రానున్నాయని స్పష్టం చేశారు.

20 తరువాత అల్పపీడనం?

విశాఖపట్నం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీలంక, దానికి ఆనుకుని తమిళనాడు పరిసరాల్లో ఈ నెల 20వ తేదీ తరువాత అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఇది అల్పపీడనంగా ఉంటుందా?, లేక బలపడుతుందా?... అనేదానిపై ఈ నెల 15 తరువాత స్పష్టత వస్తుందన్నారు. అయితే, ఈ విషయాన్ని భారత వాతావరణ శాఖ ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, మంగళవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పొగమంచు కురిసింది. రాత్రి ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో అక్కడక్కడ పొగమంచు కురుస్తుందని, రాత్రి ఉష్ణోగ్రతలు ఒకటి నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

తెలుగు వర్చువల్ అకాడమీకి అనుమతివ్వాలి

▸ మంత్రి లోకేశ్‌కు రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్‌డీ విల్సన్ విజ్ఞప్తి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు తరహాలో తెలుగు భాష నేర్పించడానికి వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్‌డీ విల్సన్ (శరత్ చంద్ర) ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం ఉండవల్లిలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. సీఆర్డీఏలో రెండెకరాలు కేటాయిస్తే అకాడమీ సొంత నిధులతో భవనం నిర్మించుకుంటామని తెలిపారు. తమిళనాడులో వర్చువల్ అకాడమీ ద్వారా 45 దేశాల్లోని తమిళ ప్రజలతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కూలీలు, కేంద్రీయ విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించే వారికి తమిళం నేర్పించినట్టు ఇక్కడ కూడా తర్ఫీదు ఇస్తామని మంత్రికి తెలియజేశారు. లోకేశ్ స్పందిస్తూ తెలుగు భాష పరిరక్షణ కోసం కృషి చేయాలని, వర్చువల్ అకాడమీ స్థాపన కోసం పూర్తి స్థాయిలో నివేదిక తయారు చేయాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సభాపతి సమరం

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను పదవినుంచి దించేయాలన్న తమ కోరిక నెరవేరదని విపక్షాలకు తెలుసు. ఎన్డీయే సంఖ్యాబలం రీత్యా అది జరిగేపనికాదని అధికారపక్షానికీ, స్పీకర్‌కూ కూడా తెలుసు. అయినా, ఓ సందేశాత్మక పోరాటం సాగుతోంది. 120మంది విపక్ష ఎంపీలు సంతకాలు చేసిన నోటీసును లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు కాంగ్రెస్‌పార్టీ అందించగానే, స్పీకర్ ఓంబిర్లా ఎంతో ఉదాత్తంగా అదేదో త్వరగా ముందుకు కదిలేట్టు చూడండని ఆదేశించారట. ఈ ఘట్టం ముగిసేవరకూ సభకు దూరంగా ఉండాలని కూడా ఆయన నిర్ణయించుకున్నారు. తృణమూల్ వినా పలు విపక్షపార్టీలు ఇచ్చిన ఈ నోటీసులో స్పీకర్‌మీద చాలా ఆరోపణలు, పలు ఆక్షేపణలు ఉన్నాయి. ప్రతిపక్ష ఎంపీలు పలు ప్రజాప్రయోజన అంశాలను లేవనెత్తకుండా స్పీకర్ అడ్డుకున్నారని, మాట్లాడనివ్వకుండా వారి ప్రాథమిక హక్కును కాలరాశారని, ఎనిమిదిమందిని ఏకపక్షంగా సస్పెండ్ చేశారని చాలా అంశాలు ఏకరువు పెట్టారు అందులో. నిజానికి ఇందులో చెప్పనివి కూడా అనేకం వారి మనసులో ఉండివుంటాయి. నాలుగుదశాబ్దాల తరువాత జరుగుతున్న ఇటువంటి ప్రయత్నం అధికారపక్షానికి పరోక్షంగా ప్రయోజనం చేకూరుస్తుందో, విపక్షానికి రాజకీయంగా నష్టం చేస్తుందో తెలియదు కానీ, చట్టసభల గౌరవాన్ని మరింత దిగజార్చుతుంది.

స్పీకర్ వ్యవస్థను కించపరిచేలా విపక్షం వ్యవహరిస్తోందని అధికార పక్షం ఆరోపిస్తోంది. సభలో ప్రధాని భద్రతమీద స్పీకర్ ఆందోళన చెందడానికి తగిన కారణాలు ఉన్నాయని, వ్యవస్థ పవిత్రతను కాపాడేందుకే ఆయన పలు నిర్ణయాలు తీసుకున్నారని లోక్‌సభ సచివాలయం ఓ ప్రకటన చేసింది. ప్రజాస్వామ్యం అన్నాక అధికార, విపక్షాల మధ్య పోరు సహజం. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపక్షాలకు కనీస గౌరవంలేకుండాపోవడం, వాటిని అవమానించడం పెరిగినందున అవి కూడా అతిగా వ్యవహరిస్తున్నమాట నిజం. ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తింటున్నకొద్దీ ఇతరత్రా విధానాల్లో తమ ఉనికిని కాపాడుకొనే ప్రయత్నాలు కూడా ఎక్కువవుతాయి. సభ వెలుపల సంగతి అటుంచితే, లోపల ఇరుపక్షాలను సమంగా చూడటం, వాటితో సమానంగా వ్యవహరించడం, సమన్యాయం చేయడం సభాపతి బాధ్యత. కనీసం అటువంటి ప్రయత్నాలు చేస్తున్నట్టు కనిపించినా, ప్రజలకు అలా అనిపించినా బాగుండేది. కానీ, స్వయంగా స్పీకరే తన వ్యాఖ్యలతో, చర్యలూ చేష్టలతో పరిస్థితులు ఉద్రిక్తం చేయడం సరికాదు. స్పీకర్ ఎంతో జాగ్రత్తగా అని వుండవచ్చును కానీ, ప్రధానిమీద సభలో భౌతిక దాడి చేయడానికి కొందరు కాంగ్రెస్ ఎంపీలు కుట్రచేస్తున్నారన్నది ఆ వ్యాఖ్యల సారాంశం. ఆయనను తానే సభకు రావద్దని చెప్పానని సభాముఖంగా ప్రకటించి, విపక్షాలను స్వయంగా అవమానించారు. దేశ ప్రజల దృష్టిలో విపక్ష సభ్యులను విలన్లుగా చిత్రీకరించారు. అంతర్జాతీయంగానూ అప్రదిష్టపాల్జేశారు. మీ వద్ద తగిన ఆధారాలు వుంటే దాడికి కుట్రపన్నుతున్నవారిమీద ఎఫ్ఐఆర్ దాఖలు చేయండని రాహుల్ గాంధీ బహిరంగం సవాలు చేసింది అందుకే.

సభలో ఇంతకుమించిన వేడినీ, రచ్చనూ దేశం అనేకసార్లు చూసింది. అనేక వివాదాస్పదమైన అంశాల్లో ఉభయపక్షాలూ ఘర్షణపడ్డాయి. కానీ, ప్రధానమంత్రిని సభకు రావద్దని స్పీకర్ స్వయంగా చెప్పడం చరిత్రలో ఎన్నడూ లేదు. ఒకవేళ ఆయన ఊహించినట్టుగానే సభ్యులు ఎవరైనా అతిగా ప్రవర్తించివుంటే దేశప్రజలు విపక్షాలను ఎన్నటికీ క్షమించేవి కాదు. కానీ, ప్రధాని సభకు రాకపోవడంతో ఆయన భయపడి పారిపోయారని అప్రదిష్ట వచ్చింది. ప్రధాని ప్రసంగం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ఆమోదం పొందిన ఘట్టం కూడా చరిత్రలో నిలిచిపోతుంది. విపక్షనాయకుడిని మాట్లాడనీయకపోవడం, ప్రధానిని సభకు రావద్దని చెప్పడం రెండూ పార్లమెంటరీ విలువల ఉల్లంఘనే. నరవణే పుస్తకంలో ఏదో ఉన్నదనీ, దానిని రాహుల్ సభలో విప్పుతారన్న భయంతోనే అధికారపక్షం ఇన్ని ఎత్తుగడలు వేసిందన్న అనుమానం అనవసరంగా ప్రజలకు కలిగింది. స్పీకర్ అంటే ఎంతో గౌరవమని అంటూనే అధికార విపక్షాలు ఆడుతున్న రాజకీయ నాటకంలో ఆ పదవీ మర్యాదలకు భంగం వాటిల్లుతున్నది. లోక్‌సభస్పీకర్‌ను తొలగించే ప్రయత్నాలేవీ భారత పార్లమెంటరీ చరిత్రలో విజయవంతం కాలేదని తెలిసినా ఈ నాటకం సాగుతూనే ఉంది.

మృగ్యమైన మావలంకర్ వారసత్వం



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'లోక్‌సభ తొలి స్పీకర్ జీవీ మావలంకర్, రెండవ స్పీకర్ అనంతశయనం అయ్యంగార్, రాజ్యసభ తొలి ఛైర్మన్, ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పార్లమెంటరీ సంస్థల పనితీరుపై గొప్ప ప్రభావాన్ని చూపారు. నిబంధనలు, విధానాలు, సంప్రదాయాలు, పద్ధతులను రూపొందించడంలో వారు హుందాగా, నిష్పాక్షికంగా వ్యవహరించేవారు. రాజ్యసభలో జనసంఘ్ కు ప్రాతినిధ్యం ఉండకపోయినా నేను అతిథుల గ్యాలరీల నుంచి అక్కడి చర్చలను తిలకించేవాడిని. ప్రశ్నోత్తరాల సమయం, వాయిదా తీర్మానాలు, బిల్లులు, తీర్మానాలు, స్థాయీ సంఘాలు, సావధాన నోటీసులు, సభ్యుల హక్కులు మొదలైన వాటన్నింటి గురించి నేర్చుకునే అవకాశం నాకు వారి వల్లే లభించింది. ప్రతిపక్ష బెంచీల్లో కూర్చున్న హేమాహేమీలు కూడా అధికార పక్షం వైపు కూర్చున్న సభ్యులతో సమానంగా అనర్గళంగా మాట్లాడేవారు. ప్రతిపక్షాల హక్కులకు సంరక్షకుడుగా స్పీకర్ నిజాయితీతో వ్యవహరించేవారు. ఈ ఉత్తమ సంప్రదాయాల వల్లే భారత దేశ ప్రజాస్వామ్యం పరీక్షలకు తట్టుకుని నిలబడింది. అంతర్జాతీయంగా తన ప్రతిష్ఠను నిలబెట్టుకుంది' – ఈ మాటలు ఎవరివో కాదు, భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన లాల్‌కృష్ణ అడ్వాణీవి. తన ఆత్మకథ ' నా దేశం నా జీవితం' లో ఒకప్పటి పార్లమెంటరీ ప్రమాణాల గురించి అడ్వాణీ వివరంగా రాశారు.

ఏ ప్రమాణాలైనా వ్యక్తులు నిలబెడితేనే సుస్థిరంగా ఉంటాయి. వ్యక్తులు తమ ప్రయోజనాలకోసం ప్రమాణాలను పణంగా పెడితే ఉదాహరణగా చెప్పుకోవడానికి ఏ ప్రమాణాలూ నిలువవు. సమాజంలో దిగజారుతున్న విలువలు పార్లమెంటరీ చర్చలను ప్రభావితం చేస్తే మన ప్రజాస్వామ్య పతనం ఎలా ఉంటుందో చెప్పేందుకు నేడు చట్టసభలు సాగుతున్న తీరే నిదర్శనం. 'మీరు మాకు మార్గనిర్దేశనం చేయండి, మేము దారి తప్పితే అవసరమైతే మాకు బుద్ధి చెప్పండి. మా ప్రవర్తనను సరిదిద్దండి' అని తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ లోక్‌సభ తొలి స్పీకర్ గణేశ్ వాసుదేవ్ మావలంకర్ ను అభ్యర్థించారు. ఎప్పుడైనా తీవ్ర విభేదాలు నెలకొన్నప్పుడు ప్రధానమంత్రి, స్పీకర్, కార్యదర్శి కలసికట్టుగా సంప్రదించుకుని సమస్యను పరిష్కరించేవారు. ఒక రోజు సభలోనే మావలంకర్, నెహ్రూ మధ్య వాగ్వివాదం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా ఒకే రోజు రెండోసారి ప్రకటన చేయాలని నెహ్రూ సంకల్పించారు. అయితే అలా మాట్లాడడం నిబంధనల ప్రకారం కుదరదని మావలంకర్ స్పష్టం చేశారు. నెహ్రూ సరేనంటూ వెనక్కు తగ్గారు. ఆర్డినెన్స్ లను మావలంకర్ తీవ్రంగా వ్యతిరేకించేవారు. అరుదైన పరిస్థితుల్లో మినహా ఆర్డినెన్సులు జారీ చేయవద్దని స్పష్టంగా చెప్పేవారు. ఈ విషయమై ప్రధానికి లేఖ రాసేవారు. న్యాయపరమైన సందేహం వస్తే స్వయంగా అటార్నీ జనరల్ ను సంప్రదించేవారు. స్పీకర్ న్యాయమూర్తిగా వ్యవహరించాలని మావలంకర్ చెప్పేవారు. నెహ్రూ కూడా మావలంకర్ కు సమున్నత గౌరవం ఇచ్చేవారు. పార్లమెంటరీ కమిటీల్లో తమ నిర్ణయాలను శల్యపరీక్ష చేస్తున్నారని అధికారులు నెహ్రూకు ఫిర్యాదు చేసినప్పుడు దాని గురించి మాట్లాడడం తన పరిధిలో లేదని, స్పీకర్ నే సంప్రదించమని సలహా ఇచ్చేవారు. అనేక విషయాలకు సంబంధించి మావలంకర్ రూపొందించిన నియమ నిబంధనలే ఇప్పటికీ ఉన్నాయి. ' పాలక, ప్రతిపక్షాల మధ్య సరైన సమతుల్యత ఉండేలా చేస్తూ, సభను సమర్థంగా నిర్వహిస్తూ, ప్రజల ప్రయోజనాలను కాపాడిన సభాపతి జీవీ మావలంకర్ 'అని లోక్ సభ తొలి సెక్రటరీ జనరల్ ఎమ్ఎన్ కౌల్ అన్నారు. పార్లమెంటు ప్రభుత్వ అధికారాలకు లోబడి ఉండకూడదని స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించాలని నిర్ణయించిన మావలంకర్ గుజరాత్ నుంచి ఎన్నికైన సభ్యుడు కావడం గమనార్హం.

మావలంకర్ మరణం తర్వాత స్పీకర్ అయిన అనంతశయనం అయ్యంగార్ కూడా అదే దారిలో నడిచారు. తిరుపతి సమీపంలోని తిరుచానూర్ లో వైష్ణవ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన అయ్యంగార్ లోక్ సభను నిష్పాక్షికంగా నడిపించేవారు. 'ఒక నియంత పాలనలో గానీ లేదా సంపూర్ణ రాచరిక పాలనలో గానీ పౌరుల జీవనానికి, స్వేచ్ఛకు ఎలాంటి రక్షణ ఉండదు. నియంత మంచివాడైతేనే ప్రజలు క్షేమంగా ఉంటారు. ప్రజాస్వామ్య వ్యవస్థ లో పాలకులు తమ వర్గాలకే అనుకూలంగా వ్యవహరిస్తూ చట్ట సభలో తక్కువ సంఖ్యలో ఉన్న వారిని అణిచివేసే ప్రమాదం ఉంది. ఈ ధోరణులను కఠినంగా నియంత్రిస్తూ తక్కువ సంఖ్యలో ఉన్న సభ్యుల ప్రయోజనాలను కాపాడ గలిగిన వ్యక్తి సభాధ్యక్షుడు (స్పీకర్) మాత్రమే' అని అయ్యంగార్ ఒక సందర్భంలో స్పష్టం చేశారు. ఇంగ్లీషులో హిరేన్ ముఖర్జీ (సీపీఐ), హిందీలో అటల్ బిహారీ వాజపేయి(జనసంఘ్)ను మించిన వక్తలు లేరని ఆయన కొనియాడేవారు. సరైన సంఖ్యాబలం లేనందువల్ల ప్రతిపక్ష నాయకుడంటూ లేకపోయినప్పటికీ ప్రతిపక్ష సభ్యులందరికీ అయ్యంగార్ ఎంతో గౌరవం ఇచ్చి వారు మాట్లాడేందుకు వీలు కల్పించేవారు. రెండవ లోక్ సభలో అధికార ప్రతిపక్ష సభ్యులందరూ ఏకగ్రీవంగా అయ్యంగారే మళ్లీ స్పీకర్ కావాలని ప్రతిపాదించారంటే ఆయన సంపాదించిన గౌరవం, నిలబెట్టిన ప్రమాణాలే కారణం. 1972లో తిరుపతి నుంచి ఒక దళిత క్రైస్తవ ఎమ్మెల్యేను నిలబెట్టినప్పుడు ఆయనను గెలిపించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థన మేరకు అనంతశయనం అయ్యంగార్ రంగంలోకి దిగారు. 'విశిష్టాద్వైతంలోనే లౌకిక వాదం జీర్ణించుకుపోయింది' అంటూ ఆయన తనను ప్రశ్నించిన తన వర్గీయులకు జవాబు చెప్పి ఆ ఎమ్మెల్యేను గెలిపించారు.

> 'స్పీకర్ మొత్తం సభకు ప్రాతినిధ్యం వహిస్తారు. సభ గౌరవాన్నీ, స్వేచ్ఛనూ ప్రతిఫలించేది స్పీకరే. సభ అంటే దేశం కనుక స్పీకర్ దేశంలో స్వేచ్ఛకు చిహ్నంగా ఉంటారు. కనుక ఆ పదవి గౌరవప్రదమైనది. ఆ స్థానంలో అత్యుత్తమ సామర్థ్యం, నిష్పాక్షికత గల వ్యక్తులు బాధ్యతలు నిర్వర్తించాలి' అని నెహ్రూ అన్నారు. లోక్‌సభ తొలి స్పీకర్ మావలంకర్ అందుకు నిండు నిదర్శనంగా నిలిచారు. స్పీకర్ గా ఆయన నెలకొల్పిన సమున్నత ప్రమాణాలు నేడు కానరావడం లేదు.



అయ్యంగార్ తర్వాత స్పీకర్ అయిన సర్దార్ హుకం సింగ్ తొలి సారి నెహ్రూ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాలను ఆమోదించారు. ప్రభుత్వం కంటే పార్లమెంట్ ఆధిక్యతే ఎక్కువ అని ప్రకటించారు. ఆయన తర్వాత స్పీకర్ అయిన నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతి ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించిన రోజే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు అనుమతించారు.

నాల్గవ లోక్‌సభ అనంతరం పార్లమెంటరీ ప్రమాణాల పతనం ప్రారంభమయింది. ఎమర్జెన్సీలో పార్లమెంటరీ కార్యకలాపాలను కనీవినీ ఎరుగని రీతిలో సెన్సార్ చేసినప్పటికీ ఉభయ సభల అధ్యక్షులు మౌనం పాటించారు. రెండు సార్లు లోక్ సభ స్పీకర్ గా ఉన్న జీఎస్ ధిల్లాన్‌ను ఇందిరాగాంధీ రాజీనామా చేయించి అదే రోజు షిప్పింగ్ మంత్రిగా నియమించారు. చట్టసభలకు ప్రభుత్వాలు లోబడి ఉండే విధంగా ఆయన రూలింగ్ లు ఇవ్వడమే అందుకు కారణం కావచ్చు. ఒక ప్రాంతీయ పార్టీ నుంచి మొదటి సారి స్పీకర్ పదవిని అధిష్ఠించిన బాలయోగి స్పీకర్ పదవి తటస్థతను ఎంతగా కాపాడారంటే ఆయన హయాంలోనే వాజపేయి ప్రభుత్వం కేవలం ఒక్క ఓటుతో పడిపోవడమే అందుకు నిదర్శనం. ఆ తర్వాత స్పీకర్ పదవిని నిర్వహించిన మహిళా నేతలు మీరాకుమార్, సుమిత్రా మహాజన్ హయాంలలో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు తలెత్తేవి. తెలంగాణ ఆందోళన మూలంగా మీరాకుమార్ పని కత్తిమీద సాములా మారితే నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత అధికార పార్టీకి, ప్రతిపక్షాలకూ మధ్య తలెత్తిన ఘర్షణాత్మక వైఖరి సుమిత్రా మహాజన్ ను ఇబ్బందుల్లో పడవేసేది. అప్పటి నుంచీ ఈ ఘర్షణ మరింత తీవ్రతరం కావడం, సుమిత్ర తర్వాత స్పీకర్ అయిన ఓం బిర్లా కూడా తరచు నిస్సహాయ పరిస్థితుల నెదుర్కోవలసి వస్తోంది. గత ఆరేళ్లలో మన పార్లమెంటరీ వ్యవస్థ ప్రమాణాలు బాగా దిగజారిపోతూ వస్తోన్నాయి.

తాజాగా కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మాట్లాడనీయనందుకు ప్రతిపక్షాలు ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాయి. ఇది మన ప్రజాస్వామ్య దుస్థితికి పరాకాష్ఠ. సైనిక దళాల మాజీ ప్రధానాధికారి మనోజ్ ముకుంద్ నరవణే తన ఆత్మ కథ 'Four Stars of Destiny' లో గల్వాన్ ఘర్షణల గురించి రాసిన విషయాలపై చర్చించడానికి అనుమతించి ఉంటే, అందుకు ప్రభుత్వం సమాధానమిచ్చి ఉంటే ఏమి జరిగేది? ప్రజలకు వాస్తవాలను బేరీజు వేసుకునేందుకు అవకాశం లభించేది. అలా కాకుండా అడ్డుకున్నందుకు ప్రతిపక్షాలు పార్లమెంట్‌ను స్తంభింపచేశాయి. రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌పై పూర్తి స్థాయి చర్చ జరగకుండానే, లోక్‌సభలో ప్రధానమంత్రి మాట్లాడకుండానే పార్లమెంట్ సమావేశాలు నీరుకారిపోయే పరిస్థితి ఏర్పడింది. పైగా మోదీపై మహిళా ఎంపీలు దాడి చేయబోతున్నారని తనకు తెలిసిందని స్పీకర్ స్వయంగా చెప్పడం ఒక విచిత్ర పరిణామం. నిజానికి ఈ మొత్తం పరిస్థితికి ప్రభుత్వ, ప్రతిపక్షాలు పట్టువిడుపులతో వ్యవహరించకపోవడం, పార్లమెంట్‌ను తమ రాజకీయ క్రీడకు ఉపయోగించుకోవడమే కారణం. అధికార, ప్రతిపక్ష పార్టీల్లో ఒకరికి మరొకరిపై పూర్తిగా గౌరవం లోపించిన ఈ పరిస్థితుల్లో స్పీకర్ నిష్పాక్షికంగా ఉంటారని, రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తారని ఎవరూ అనుకోరు. తద్వారా స్పీకర్ కూడా గౌరవం కోల్పోవడం స్పష్టంగా కనిపిస్తోంది.

'స్పీకర్ మొత్తం సభకు ప్రాతినిధ్యం వహిస్తారు. సభ గౌరవాన్నీ, స్వేచ్ఛనూ ప్రతిఫలించేది స్పీకరే. సభ అంటే దేశం కనుక స్పీకర్ దేశంలో స్వేచ్ఛకు చిహ్నంగా ఉంటారు. కనుక ఆ పదవి గౌరవప్రదమైనది. ఈ స్థానంలో అత్యుత్తమ సామర్థ్యం, నిష్పాక్షికత గల వ్యక్తులు బాధ్యతలు నిర్వర్తించాలి' అని నెహ్రూ అన్నారు. కానీ అప్పటి రోజులకూ, ఇప్పటి రోజులకూ పోల్చడం సాధ్యం కాదు. నాడు అధికారంలో ఉన్న వారు స్వయంగా ప్రమాణాలను నిర్దేశించి భావితరాలకు ఆదర్శంగా ఉండాలని భావించేవారు. వికసిత్ భారత్ కోసం దేశం తహతహలాడుతున్న ఈ సమయంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రమాణాలను కూడా ఫలానా తేదీ లోపు కాపాడాలనే విషయమై నేతలు తమలో తాము చర్చించుకోవడం అవసరం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

> గల్ఫ్ దేశాలలోని ప్రవాసులలో భారతీయులే కాకుండా ఆఫ్రికా దేశాల వారూ పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. సవాలక్ష సమస్యలతో తినడానికి తిండి లేని నిరుపేద దేశాల నుంచి వచ్చిన ఆ ప్రవాసులు ఆత్మస్థైర్యంతో జీవిస్తుండగా, భారతీయులు ఎందుకు విరక్తి చెందుతున్నారు?

ప్రవాసుల ప్రాణాలను హరిస్తున్న మనోరుగ్మతలు


ఆశల ఆరాటంలో జీవనపోరాటం విషాదాంతమవడం ఎంత బాధాకరం! దురదృష్టవంతులు అయిన కొంతమంది ప్రవాస భారతీయుల గురించి నేను ప్రస్తావిస్తున్నాను. కన్నవారికి, కట్టుకున్నవారికి దూరంగా ఉండే ప్రవాసుల జీవితాలు యాంత్రికంగా సాగిపోతుంటాయి. అనురాగాలు, ఆప్యాయతలు కరువై ఎంతో మంది ప్రవాసులు మానసిక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. పట్టుమని మూడు పదుల వయసు కూడా లేని యువకులు కన్న ఊరులో ఇల్లు, ఇంకా కొద్దిపాటి ఆస్తులు సమకూర్చుకునేందుకై అష్టకష్టాలు పడి ఈ సుదూర సీమలకు వచ్చి బతుకు పోరులో అలసిపోతున్న తీరును చూస్తే జాలి కలుగుతోంది. రేయింబవళ్ల రెక్కల కష్టం తరువాత నెలాఖరులో ఆదాయ వ్యయాల లెక్కలు చూసుకుంటూ నైరాశ్యంలోకి జారిపోతున్నారు. ఇది వారి మానసిక సమతుల్యతను దెబ్బతీసి శారీరక ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది.

సామాజిక మాధ్యమాలలో– సంఘ జీవన పోకడలపై వ్యాఖ్యానాలు, విమర్శలు చేయడంలో వీరు చలాకీగా ఉంటారు. అయితే స్వీయ కుటుంబ పరిస్థితులపై తమ అంతరంగంలోని

గల్ఫ్ లేఖ

ఆవేదనను ఎవరికీ చెప్పుకోలేక మానసికంగా నలిగిపోతున్న ప్రవాసులు తక్కువ మందేమీ కాదు. అంతులేని ఆ మనోవ్యథల భారంతో కొంతమంది జీవితాలు అర్థంతరంగా ముగిసిపోతున్నాయి. అవి సహజ మరణాలే, అయితే హైపర్ టెన్షన్‌తో సంభవిస్తున్న విషాదాలవి. గల్ఫ్ దేశాలలో ఉద్యోగులు, కార్మికులుగా ఉన్న వారిలో సంభవిస్తున్న ఇటువంటి సహజ మరణాల సంఖ్య ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగిపోయింది. గాడి తప్పుతున్న మానసిక ఆరోగ్య పరిస్థితులకు అవి అద్దం పడుతున్నాయి.

ఆర్థిక సమస్యలు ఉన్న వారు సరే, జీవన పరిస్థితులు సవ్యంగా ఉన్న వారు సైతం మానసిక కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడడమే దిగ్భ్రాంతి కలిగిస్తోంది. ఇరవై నాలుగు సంవత్సరాల వరికుప్పల రాకేశ్ ఇటీవల దుబాయిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక అసమానతల భారతంలో సగటు మనిషి జీవన పోరాటానికి ఈ దురదృష్టకర యువకుడు ఒక ప్రతీక. రాకేశ్ బాల్యంలోనే తండ్రిని కోల్పోయాడు. తన కుటుంబ భవిష్యత్తు కొరకు గల్ఫ్‌కు వచ్చాడు. రాజన్న సిరిసిల్లా జిల్లాలోని వీర్నపల్లి అనే ఒక చిన్న గ్రామంలో తను నివసించడానికి రెండు గదుల సొంత ఇంటి నిర్మాణం మాత్రమే అతడి లక్ష్యం. ఆ లక్ష్యంతో ఎడారి దేశానికి వచ్చిన రాకేశ్, ఆశించిన స్థాయిలో సంపాదించలేకపోయాడు. సెలవు రోజు రాత్రి మిత్రులతో కలిసి ఉల్లాసంగా గడిపాడు. మిత్రులు అందరూ వెళ్ళిన తర్వాత తన పరిస్థితిపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి మృతదేహం ఇంకా దుబాయిలోనే ఉంది. మారుమూల గ్రామంలో సొంత భూమిలో రెండు గదుల చిన్న ఇల్లు కట్టుకోవడానికి ఆ యువకుడు గల్ఫ్ బాటను ఎంచుకున్నా మనోరథంలో సఫలీకృతం కాలేక ప్రాణాలు పగొట్టుకున్నాడు. అతనే కాదు, కామారెడ్డి జిల్లాకు చెందిన మొహమ్మద్ యాసిన్ అనే 28 ఏళ్ళ యువ ఇంజనీర్ సమస్యల సుడిగుండం నుంచి బయటపడేందుకు మార్గం కనిపించక, మక్కా పుణ్యక్షేత్రంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయిన తరువాత లభించగా ఇంకా సౌదీలోనే ఉన్నది. ఇలాగే, బంధుమిత్రులు చాలా మంది ఉన్నా తన బాధలను ఎవరికీ చెప్పుకోలేకపోయిన హైదరాబాద్ మహిళ హుమేరా అఫ్రీన్ తన ముగ్గురు పసిపిల్లలను చంపి, తాను ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించి విఫలమయింది. ఆత్మహత్యాయత్నం చట్ట విరుద్ధం కావడంతో ఆమె ప్రస్తుతం జైలులో ఉంది. ఆర్థికంగానే కాకుండా, ఇతరత్రా అంతా సవ్యంగా ఉన్నప్పటికీ హైదరాబాద్ నగర శివారులో ఇటీవల ఒక గల్ఫ్ ప్రవాసుడి భార్య తన ఇద్దరు పిల్లలతో కలిసి రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడడం సమాజానికి అనేక సవాళ్ళు విసిరింది. మానసిక సమస్యలతో సంభవిస్తున్న విషాద మరణాలకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.



భారత జనాభాలో 15 శాతం మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. ఆర్థిక అసమానతలు ఆ రుగ్మతలకు ప్రధాన కారణమని ప్రభుత్వ నివేదికలే వెల్లడిస్తున్నాయి. కన్న ఊరు, మాతృదేశం దాటిన తరువాత ఆ మనోరుగ్మతలు ఎడారి ఏకాంతంలో మరింతగా పెచ్చరిల్లుతున్నాయి. మనిషి స్మార్ట్ ఫోన్‌తో తనకు తాను ఎంతగా మమేకమైనా, మానసిక శాంతి కొరవడిన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. ఒక కాకి చనిపోతే ఎన్నో కాకులు అక్కడికి చేరి గట్టిగా అరుస్తాయి. అయితే ఒక మనిషి చనిపోతుండగా ఆ దృశ్యాన్ని తమ స్మార్ట్ ఫోన్‌లో రికార్డు చేసే మనుషులు, సాటి మనుషులుగా ఎదుటివారికి ఎంత వరకు తోడ్పడుతున్నదీ ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకోవాలి. గల్ఫ్ దేశాలలోని ప్రవాసులలో భారతీయులే కాకుండా ఆఫ్రికా దేశాల వారూ పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. సవాలక్ష సమస్యలతో, తినడానికి తిండి లేని నిరుపేద దేశాల నుంచి వచ్చిన ఆ ప్రవాసులు ఆత్మస్థైర్యంతో జీవిస్తుండగా, భారతీయులు ఎందుకు తమ జీవితంపై విరక్తి చెందుతున్నారనేది అంతుపట్టని ప్రశ్న.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

'నెయ్యి కాని నెయ్యి'తో వైసీపీ అపచారం!

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సీబీఐ నేతృత్వంలో సిట్ 2026 జనవరి నెలాఖరులో నివేదిక ఇచ్చింది. లడ్డూ తయారీలో వాడిన నేతిలో కల్తీ జరిగిందని, అది అసలు నెయ్యే కాదని రసాయనాలు, పామాయిల్ ఉపయోగించి తయారు చేసిన నూనెతో లడ్డూలు తయారుచేశారని ఆ నివేదికలో పేర్కొంది. భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని– ఆ రసాయనాల్లో జంతువుల కొవ్వు కలిసిందా? లేదా? అనే విషయాన్ని సిట్ బహిర్గతం చేయలేదు.

తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపి భక్తుల మనోభావాలను, లడ్డూ పవిత్రతను వైసీపీ ప్రభుత్వం అపహాస్యం చేసిందంటూ జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గతంలో చేసిన వ్యాఖ్యల నడుమ, లడ్డూలో జంతువుల కొవ్వు కలవలేదని వైసీపీ నేతలు ఇప్పుడు గోబెల్స్ ప్రచారానికి పూనుకున్నారు. నిబంధనలను అడ్డగోలుగా మార్చేసి, టన్నుల కొద్దీ కల్తీ నెయ్యిని కొనుగోలు చేసి లడ్డూలో కలిపేశారు. ఈ విషయాన్ని సాక్షాత్తూ టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ నేత, వైవి సుబ్బారెడ్డి నేరుగా అంగీకరించారు. కాసులకు కక్కుర్తిపడి వైసీపీ నాయకులు శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేశారు.



అవినీతికి, అక్రమ సంపాదనకు టీటీడీనే కాక, హిందూ విశ్వాసాలను సైతం వైసీపీ కేంద్రంగా చేసుకుంది. నిబంధనలను తుంగలో తొక్కి ఒక పద్ధతి ప్రకారం తమ అనుయాయులకు నెయ్యి సరఫరా కాంట్రాక్టులు అప్పగించింది. వందల కోట్లు కొల్లగొట్టాలని నాటి ప్రభుత్వం పథక రచన చేసింది. కిలో నెయ్యికి రూ.25 కమీషన్‌తో చిన్న స్థాయి నాయకుల నుంచి కోట్ల రూపాయలను హవాలా రూపంలో ఆ పార్టీ నేతలు జేబులో వేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ 'నెయ్యి కాని నెయ్యి'తో 20 కోట్ల శ్రీవారి లడ్డూలు తయారు చేసి తీవ్ర అపచారం చేయడమే కాకుండా, హిందూ భక్తుల మనోభావాలను వైసీపీ దెబ్బతీసింది. ఈ నేపథ్యంలోనే, చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి తాము ఏ నేరం చేయలేదని, తాము అసలు కల్తీ నెయ్యి, జంతు కొవ్వులతో తయారు చేసిన నెయ్యి వాడలేదని బుకాయిస్తున్నది.

పవన్ కల్యాణ్ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న అంశం– కేవలం లడ్డూ కల్తీ మాత్రమే కాదు. హిందూ సంప్రదాయాల, ఆధ్యాత్మిక విశ్వాసాల సంరక్షణ, ప్రజల ప్రాణాల పరిరక్షణ. తమ అక్రమ సంపాదనకు అత్యంత నీచ స్థాయికి దిగజారి భక్తుల విశ్వాసాలకు నీళ్లొదిలి, కలియుగ దైవాన్ని సైతం నిలువు దోపిడీ చేయాలన్న కుట్రలకు అడ్డుకట్ట వేయడం. ఇటువంటి కుట్రను బహిర్గతం చేసిన పవన్ కల్యాణ్‌పై అసత్య ప్రచారం చేయడం క్షమించరాని నేరం. లడ్డూ కల్తీ వివాద అంశంలో ఆయనపై మతతత్వ ముద్ర వేయడం, ముస్లింలు, క్రైస్తవులకు వ్యతిరేకంగా హిందువులను రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నారని వైసీపీ దుష్ప్రచారం చేయడం అభ్యంతరకరం. ఆయన ఏనాడూ క్రైస్తవులను, ముస్లింలను ఒక్క మాట అనలేదు. ఒక్క లడ్డూ కల్తీ విషయంలోనే కాక, అనేకానేక అంశాల్లో హిందూ ధర్మానికి ఎదురవుతున్న ప్రమాదాలను గుర్తించడంలో సమాజ నిర్లక్ష్యాన్నే ఆయన ఎత్తి చూపారు. ఇతర మతాలతో పోలిస్తే హిందూ విశ్వాసాల పరిరక్షణ పట్ల ప్రభుత్వాలు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రతి వ్యక్తీ ధార్మిక బాధ్యత తీసుకోవాలని కోరుతూ, హిందువుల్లో చైతన్యాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. ధార్మిక అంశాల్లో అన్ని మతాలకు సమాన అవకాశాలు అందించడమే లౌకికత్వమనీ, మెజారిటీ మతం పేరుతో ఒక మతాన్ని నిత్య నిరాదరణకు గురిచేయడం సరికాదని, ఈ అపసవ్యతను సరిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులపై ఉంటుందనే నైతిక లౌకిక భావనను ప్రచారం చేస్తున్నారు. దానిలో భాగంగానే, ఇతర మత విశ్వాసాల రక్షణకు ఉన్నట్లే, హిందూ మత విశ్వాసాల రక్షణకూ జాతీయ స్థాయిలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించి, తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తున్న వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలి. ఆలయాల పవిత్రతను దెబ్బతీసిన గత ప్రభుత్వ నిర్వాకాన్ని అసెంబ్లీలో చర్చించి, ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలి. నిందితులను చట్టబద్ధంగా శిక్షించి భక్తుల్లో ధైర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● డా. పెదపూడి విజయకుమార్
జనసేన పార్టీ నాయకులు,
ఎస్సీ(మాల) కార్పొరేషన్ ఛైర్మన్

ఆర్థిక మంత్రి వీడియోతో ఏఐ దుర్వినియోగం!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ జమానాలో ఆర్థిక మోసాలు కూడా కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇటీవల ఫేస్‌బుక్‌లో వెల్లువెత్తుతున్న ఒక రకం వీడియోలను ఇందుకు పరాకాష్ఠగా చెప్పుకోవచ్చు. ఈ వీడియోల్లో కనపడేదీ మాట్లాడేదీ సామాన్యులు కాదు– దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి జయశంకర్, ఇన్ఫోసిస్ సుధా మూర్తి… అంతెందుకు ఏకంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీనే కనపడి మాట్లాడతారు! ఏమని? ఆర్థికంగా నలిగిపోతున్న ప్రజల కోసం వికసిత్ భారత్‌లో భాగంగా ప్రభుత్వం ఒక పథకాన్ని మొదలుపెట్టిందనీ, ప్రారంభంలో 22,000 రూపాయలు డిపాజిట్ చేస్తే మీ ఆదాయం రోజువారీ పెరుగుతూ ఒక్క నెలలోనే మీరు లక్షాధికారులైపోతారని! ఈ మాయానరులు ఎంత నిజంగా ఉంటారంటే సామాన్యులకు ఏమాత్రం అనుమానం రాదు!

కృత్రిమ మేధ సృష్టిస్తున్న అద్భుతాల్లో మంచి ఎంత ఉందో, అంతకుమించి చెడూ ఉంది. ఇలాంటి నకిలీ వీడియోలు సృష్టిస్తున్న మోసగాళ్ళు ఆర్థిక సమస్యలతో సతమతమయ్యే మెజారిటీ ప్రజానీకాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. వారి అవసరాలను, బలహీనతలను సొమ్ము చేసుకునేందుకు ఏకంగా మన ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రులనే ఎరగా వాడుకుంటున్నారు! రోజూ ఫేస్ బుక్‌లో ఆర్థిక మంత్రితో ఈ నకిలీ వీడియోలు వస్తూనే ఉన్నాయి. అందులో ఆర్థిక మంత్రి ఏరోజుకారోజే మీరు డిపాజిట్లు చేయటానికి ఇదే చివరి తేదీ అని ప్రకటిస్తూనే ఉంటారు. కృత్రిమ మేధను ఉపయోగించి సాగిస్తున్న అతిపెద్ద కుంభకోణంలో ఎందరో సామాన్యులు ప్రతి రోజూ మోసపోతున్నారు.



నాతో సహా చాలామంది ఇవి బూటకపు వీడియోలని, వీటిని నమ్మి ఎవరూ మోసపోవద్దని ఆ వీడియోల కిందే కామెంట్లు పెడుతున్నాం. అలానే ఫేస్‌బుక్ యాజమాన్యాన్ని కూడా వీటిని తొలగించాలని కోరుతూనే ఉన్నాం. ఇలాంటివే ఎన్నో హైటెక్ మోసాలను సైబర్ క్రైమ్ ప్రత్యేక విభాగాల దృష్టికి తీసుకు వెళ్తున్నాం. అయినా ఇవి తగ్గుముఖం పట్టడం లేదు సరికదా, కొత్త మోసాలకు సరికొత్త ముఖాలు తొడుక్కుని ప్రత్యక్షమవుతూనే ఉన్నాయి.

ఇదే కోవలో ఇటీవల ప్రత్యక్షమైన మరో వీడియోలో స్వయంగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఉన్నారు. ఈ వీడియోలో రాహుల్ గాంధీ పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉద్దేశించి మాట్లాడుతున్నట్టు ఉంది. ఈ పథకం పేరుతో మీరు భారతదేశాన్ని మోసగించారనీ, మొబైల్ అప్లికేషన్ ద్వారా నెలకి రూ.20 లక్షల రహస్య ఆదాయాన్ని పొందుతున్నారని రాహుల్ ఆరోపిస్తూ, ఆర్థికమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తుంటారు. దీనికి సమాధానంగా నిర్మలా సీతారామన్– ఇది గవర్నమెంట్ ప్రాజెక్టేనని, ఏమాత్రం రహస్యం కాదని, తాను అఫీషియల్‌గా దీన్ని ప్రకటిస్తున్నాననీ, రూ.22 వేలు డిపాజిట్ చేసే ప్రతి పౌరుడూ నెలకి 20 లక్షల రూపాయల ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని, రాహుల్ గాంధీ ఆరోపణలు నిరాధారమైనవనీ, అబద్ధపు ప్రచారాలను ఆపాలని మాట్లాడతారు. ఇలా కృత్రిమ మేధ సాయంతో ఈ మోసగాళ్ళు ఏకంగా కృత్రిమ పార్లమెంటు సమావేశాలనే సృష్టిస్తున్నారు.

సామాన్య ప్రజలను దోచుకోవటానికి ఇంత పెద్ద ఎత్తున మోసం జరుగుతున్నా పాలకులు చోద్యం చూస్తూ ఉండటం మహా నేరం. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోని ఆయా శాఖలకు చెందిన ప్రభుత్వ యంత్రాంగం ఈ వీడియోలపై దృష్టి పెట్టాలి. వీటి మూలం ఎక్కడో కనుక్కొని నేరస్థులను కఠినంగా శిక్షించాలి. ప్రజలు ఇలాంటి వీడియోల బారిన పడి మోసపోకుండా పెద్ద ఎత్తున చైతన్యం తీసుకురావాలి. ప్రజలు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలి.

■ ముప్పాళ్ళ భార్గవశ్రీ

పన్నులు.. 60.33 శాతం



వినుకొండ మున్సిపాలిటీ

- మున్సిపాల్టీల్లో మెరుగైన వసూళ్లు
- రూ.297.37 కోట్లకు రూ.179.42 కోట్లు..
- పన్ను వసూళ్లలో రాష్ట్రంలో వినుకొండ ప్రథమం


(తెనాలి, ఆంధ్రజ్యోతి)

పురపాలక సంఘాల్లో పన్నుల వసూళ్లు మెరుగయ్యాయి. ఇప్పటికే 60.33 శాతం వసూలైంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో అధికారులు నిర్లక్ష్యం వీడి వసూళ్లపై దృష్టి సారించగా.. కుళాయి కనెక్షన్ తొలగిస్తామన్న హెచ్చరికలతో బకాయి దారులు పన్నులు చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. అదే సమయంలో నూరు శాతం వసూళ్లకు మున్సిపల్ పరిపాలన విభాగం మున్సిపాలిటీలకు లక్ష్యాలను నిర్దేశించింది. పన్నుల వసూళ్ల తీరుపై మునిసిపల్ పరిపాలన డైరెక్టర్ కూడా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మార్చి 31 కల్లా నూరు శాతం పన్ను వసూలు చేయాలని డీఎంఏ ఆదేశాలు జారీ చేసింది. అలసత్వం వహించే ఉద్యోగులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటుండటంతో ఎక్కడికక్కడ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో మున్సిపాల్టీలలో రెవెన్యూ విభా గం, సచివాలయ కార్యదర్శులు పన్ను చెల్లింపుదారులకు ఫోన్ చేసి పన్ను చెల్లించేలా వారిని చైతన్య పరుస్తు న్నారు. సకాలంలో పన్ను చెల్లించాలని, లేకుంటే కుళాయి కనెక్షన్ తొలగిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో పలువురు బకాయిలు చెల్లిస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఆస్తి, నీటి పన్ను మొత్తం రూ.297.37 కోట్లు వసూలు చేయాలి. కాగా మంగళ వారానికి రూ.179.42 కోట్లు వసూలైంది. 83.55 శాతం పన్ను వసూలు చేసి రాష్ట్రంలోనే వినుకొండ ప్రథమ స్థానంలో నిలిచింది. మాచర్లలో 46 శాతం లోపే పన్ను వసూలైంది. నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, బాపట్ల మున్సిపాల్టీలు, గుంటూరు కార్పొరేషన్‌లో 58 శాతం లోపు పన్ను వసూలు ఉంది. సకాలంలో పన్ను వసూలు కాకపోతుండటంతో మున్సిపాల్టీల్లో అభివృద్ధి పనుల నిర్వాహణ, కాంట్రాక్ట్ కార్మికుల జీతాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నది. ఆక్రమణలు, ప్రకటనల పన్నుల ఆదాయాన్ని మున్సిపాలిటీలు కోల్పోతున్నాయి. ప్రణాళికా విభాగం పర్యవేక్షణ లేకపోవడంతో ఈ ఆదాయాన్ని రాబట్టుకోలేక పోతున్నాయి.

మునిసిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూలు రూ కోట్లలో..

మునిసిపాలిటీ	లక్ష్యం	వసూలు	శాతం
నరసరావుపేట	15.43	8.93	57.89
చిలకలూరిపేట	10.88	5.99	55.06
వినుకొండ	5.53	6.62	83.55
సత్తెనపల్లి	7.20	3.87	53.76
మాచర్ల	5.40	2.71	45.33
పిడుగురాళ్ళ	6.32	4.28	67.79
దాచేపల్లి	2.37	1.49	62.77
గురజాల	1.49	1.11	74.67
బాపట్ల జిల్లా :			
రేపల్లె	5.95	3.83	64.39
బాపట్ల	9.55	5.32	55.72
చీరాల	11.71	7.68	65.56
గుంటూరు జిల్లా :			
గుంటూరు	163.08	93.33	57.23
పొన్నూరు	6.04	4.33	71.67
మంగళగిరి, తాడేపల్లి	20.59	14.71	71.45
తెనాలి	22.83	15.22	66.67

కోటప్పకొండలో.. ఏర్పాట్లు వేగవంతం




కోటయ్య పండుగ వచ్చేస్తోంది. మరో నాలుగు రోజుల్లో మహాశివరాత్రి. దేశ ప్రసిద్ధి చెందిన తిరునాళ్లకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండపై శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం జరిగే తిరునాళ్ల పనులు వేగవంతమయ్యాయి. ఏకాదశి శుక్రవారం నుంచి తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కొండ దిగువున ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు రెవెన్యూ, పంచాయతీరాజ్, రవాణా, పోలీసు, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల కోసం కొండ దిగువున ఎమ్యూజ్‌మెంట్ పార్కు రూపుదిద్దుకుంటున్నది. ఇక ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఈవో చంద్రశేఖరరావు పర్యవేక్షిస్తున్నారు. బందోబస్తుతో పాటు ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా అవసరమైన ఏర్పాట్లపై పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తిరునాళ్ల ఏర్పాట్లపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో పల్నాడు కలెక్టర్ కృతికాశుక్లా మంగళవారం ప్రత్యేకంగా సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు.



రాజగోపురం రంగులతో ముస్తాబు



లడ్డు ప్రసాదం తయారీ



తిరునాళ్లలో తాగునీటి సరఫరా కోసం సిద్ధం చేస్తున్న ఫిల్టర్ బెడ్లు



కొండపైకి వెళ్లే బస్సుల కోసం ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక బస్టాండ్‌లో టిక్కెట్ కౌంటర్ల నిర్మాణం

ప్రసాదాలు సిద్ధం

తిరునాళ్లను పురస్కరించుకుని తరలి వచ్చే భక్తుల కోసం కోటయ్య స్వామి వారి ప్రసాదాన్ని సిద్ధం చేస్తున్నారు. రెండు లక్షల లడ్లు, లక్ష అరిసె ప్రసాదాన్ని ప్రత్యే కంగా తయారు చేస్తున్నారు.

సమీపిస్తోన్న తిరునాళ్ల

- 13 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు
- ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్ కృతికా శుక్లా
- తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేస్తున్న ఆర్టీసీ
- ఉచిత, శీఘ్ర, వీఐపీ దర్శనాలకు వేర్వేరుగా క్యూలు

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మహ శివరాత్రి పండుగ త్రికోటేశ్వరస్వామి దర్శనం కోసం ఉచిత, శీఘ్ర, ప్రత్యేక, వీఐపీ దర్శన క్యూలు ఏర్పాటు చేశారు. క్యూలను తాటాకు పందిళ్లతో నిర్మించారు. తిరునాళ్ల రోజున నరసరావుపేట, చిలకలూరిపేట డిపోల నుంచి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను కొండకు నిర్వహించ నున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ తాగు నీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్లను నిర్మిస్తోంది. కొండ దిగువున దాదాపు 3,700 ఫ్లడ్‌లైట్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లను, జనరేటర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాతకోటేశ్వరస్వామి ఆలయం వద్ద విద్యుత్ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పర్యాటక కేంద్రాన్ని సందర్శించేలా ఆటవీ శాఖ ఏర్పాట్లు చేస్తున్నది. చిలకలూరిపేట

(మిగతా 8వ పేజీలో)



విద్యార్థులను సొంతబిడ్డల్లా భావించాలి

- హాస్టళ్లలో వసతుల విషయంలో రాజీపడొద్దు
- అధికారులకు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆదేశాలు



జ్యోతిరావ్‌పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పిస్తున్న మంత్రి సవిత

8



8

అసెంబ్లీ సమావేశాలకు పటిష్ఠ బందోబస్తు

- అధికారులు, సిబ్బందికి ఎస్పీ వకుల్ జిందాల్ నిర్దేశం


ఒక్క రోజే లక్ష టిక్కీలు

- మిర్చి యార్డుకు పోటెత్తుతోన్న వైనం
- మహాశివరాత్రి తర్వాత పెరుగుతాయని అంచనా
- ధరలో జోరు కొనసాగిస్తున్న దేశవాళి వెరైటీలు

పెరిగిన ధరలు..

తాలుకాయలు మినహా అన్ని రకాల మిర్చి ధరలు క్వింటాల్ రూ.20 వేలు దాటాయి. 341, బ్యాడిగి, దేవనూరు డీలక్స్ రూ.25 వేలు దాటిపోయాయి. ఎక్స్‌పోర్టు వెరైటీ అయిన తేజ కూడా రూ.20,500కి చేరింది. 341 రకం తాలు కాయలు రూ.12 వేలకు పైగా విక్రయం జరుగుతుండటం మార్కెట్‌లో ఆశాజనక వాతావరణాన్ని స్పష్టం చేస్తోన్నది. గత ఏడాది కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిరపకాయలకు కూడా క్వింటాల్‌కు రూ.20 వేలకు పైగా లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సీజన్‌లో ప్రప్రథమంగా ఒకే రోజున లక్ష టిక్కీలకు పైగా మంగళవారం గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)కు రైతులు తీసుకొచ్చారు. కొద్ది రోజుల నుంచి నిత్యం 80 వేల నుంచి 92 వేల మధ్య టిక్కీలు వస్తోండగా మంగళవారం ఈ సంఖ్య 1,02,248కి చేరుకున్నది. 98,826 టిక్కీల అమ్మకాలు జరగడం విశేషం. తొలి కోతలు పూర్తి కావడం, అనుకూల వాతావరణంతో రైతులు తమ పంటను విక్రయాలకు తీసుకొస్తున్నారు. కారం తయారీతో పాటు విదేశాలకు ఎగుమతి ఆర్డర్స్ వస్తోండటంతో ట్రేడర్లు మిర్చి కొనుగోలుకు పోటీపడుతున్నారు. నిత్యం ఉదయం ఆరు గంటలకే యార్డుకు చేరుకుని ట్రేడింగ్ ప్రారంభించే సమయం కోసం ఎదురు చూస్తున్నారు. బిడ్డింగ్ గంట మోగగానే కమీషన్ వ్యాపారుల దుకాణాలకు వెళ్లి నాణ్యత పరిశీలించి అప్పటికప్పుడు రేటు ఖరారు చేసుకుని ఆ తర్వాత ఈనామ్‌లో బిడ్డింగ్ వేసి కొనుగోలు చేస్తున్నారు. పల్నాడు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో మహ శివరాత్రి పండుగ తర్వాత మిర్చి కోతలు పెద్దఎత్తున జరుగుతాయి. దాంతో పండుగ వెళ్లిన రెండు, మూడు రోజుల్లోనే యార్డుకి ఎరైవల్స్ రోజుకు లక్షన్నర నుంచి 2 లక్షల టిక్కీల వరకు పెరుగుతాయని అధికారులు, కమీషన్ వ్యాపారులు అంచనా వేస్తోన్నారు. ఈ నేపథ్యంలో అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా ముందురోజు రాత్రి వచ్చే సరుకు అంతా వేకువజామునకు కమీషన్ దుకాణాలకు చేరేలా చూడాలి. దానివల్ల బిడ్డింగ్ వేగవంతంగా జరుగుతుంది. లేకుంటే రైతులు మరుసటి రోజు కోసం యార్డులో పడిగాపులు పడాల్సి ఉంటుంది.



గుంటూరు మిర్చి యార్డులో మిర్చి టిక్కీలు

కుళ్లిన మాంసంతో బిర్యానీ

- రెస్టారెంట్లపై ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడి
- కాలం చెల్లిన ఆహారం, నిల్వ మాంసం స్వాధీనం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కుళ్లిన మాంసం.. ఫ్రిజ్‌ల్లో గడ్డకట్టిన మాంస పదార్థాలతో బిర్యానీ, ఇతర ఆహార పదార్థాలు తయారవుతున్నట్లు తేలింది. గుంటూరులో దాదాపు అన్ని రెస్టారెంట్లలో నిల్వ చేసిన మాంసాన్ని, ఆహార పదార్థాలను చూసి ఆహార భద్రత, తూనికలు కొలతల శాఖ అధికారులు నివ్వెరపోయారు. పలు రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లు, స్వీట్ షాపులు, బేకరీలపై మంగళవారం అధికారులు తనిఖీలు చేశారు. 8 బృందాలుగా విడిపోయిన అధికారులు లక్ష్మీపురం, అమరావతి రోడ్డు, పాతగుంటూరు తదితర ప్రాంతాల్లోని 12 రెస్టారెంట్లు, 2 బేకరీలు, 2 స్వీట్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. వంద కిలోల కుళ్లిన మాంసాన్ని గుర్తించి ధ్వంసం చేశారు. కొన్ని ఆహార నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. లైసెన్స్ లేకపోవడం, శుభ్రత లేకపోవడం వంటి కారణాలతో 5 కేసులు నమోదు చేశారు. కాటాలపై ముద్ర లేకపోవడంతో తూనికలు, కొలతల శాఖ అధికారులు 8 కేసులు నమోదు చేశారు.

నిరంతరంగా దాడులు చేస్తాం..

గుంటూరులోని గోంగూర, మయూరి, స్వాగత్, సాయిరాం ఫుడ్స్, హోటల్ సుభాని, బిస్మిల్లా, శుభం రెస్టారెంట్, బెంగళూరు అయ్యంగారి బేకరి, మరో రెండు బిర్యానీ పాయింట్లలో తనిఖీలు చేసినట్లు జిల్లా సహాయ ఆహార నియంత్రణాధికారి పూర్ణచంద్రరావు చెప్పారు. లక్ష్మీపురం ప్రధాన రోడ్డులోని బిస్మిలా హోటల్‌లో 48, గార్డెన్స్ స్వాగత్ రెస్టారెంట్‌లో 23, గోంగూరలో 5 కిలోల చికెన్, అదే రోడ్డులో సాయిరాం స్వీట్ షాపులో 28 కిలోలు నిల్వ చేసిన మిఠాయిలను ధ్వంసం చేశామన్నారు. మిగిలిన రెస్టారెంట్లలో సేకరించిన శాంపిల్స్ నివేదిక అందగానే కేసులు నమోదు చేస్తామన్నారు. ఫ్రిజ్‌ల్లో గడ్డ కట్టిన మాంసాన్ని వినియోగిస్తున్న రెస్టారెంట్ల లైసెన్స్‌ను రద్దు చేయాలని నగర కమిషనర్‌కు సిఫార్సు చేశామని చెప్పారు. దాడులు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు పాటించకపోతే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఫుడ్ ఇన్స్‌స్పెక్టర్ నరసింహారావు, వెంకటేశ్వర్లు, లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ మా ధురి, డిప్యూటీ కంట్రోలర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి పూర్ణ చంద్రరావు

13న మంగళగిరిలో జాబ్ మేళా

సద్వినియోగం చేసుకోవాలన్న కలెక్టర్

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో మంగళగిరిలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్‌అన్సారియా కోరారు. జాబ్ మేళా పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. 15 కంపెనీలు పాల్గొంటాయని, 597 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు మాట్లాడుతూ విద్యార్హతలను బట్టి రూ.9 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 13న ఉదయం పది నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటో, బయోడేటాతో మేళాకు రావాలన్నారు. నైపుణ్యం పోర్టల్‌లో ముందు గా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. జాబ్ మేళా ప్రాంగణంలో స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా అందుబాటులో వుంటుందని తెలియజేశారు. వివరాలకు 8074597926, 77805 88993, 99667 88993 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, డీఆర్‌డీఏ పీడీ వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

16 అర్ధరాత్రి నుంచి ఆర్మీ అగ్నివీర్ ర్యాలీ

- తెలుగు రాష్ట్రాల నుంచి 8,598 అభ్యర్థుల రిజిస్ట్రేషన్
- ఏర్పాట్లపై సమీక్షలో గుంటూరు జేసీ అశుతోష్ శ్రీవాస్తవ



ర్యాలీ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, ఆర్మీ అధికారులు

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ ప్రాంగణంలో ఈ నెల 16న అర్ధరాత్రి తర్వాత నుంచి 27వ తేదీ వరకు జరగనున్న ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీకి విస్తృత ఏర్పాట్లు చేయాలని జేసీ అశుతోష్‌శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. ర్యాలీపై మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ ర్యాలీకి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పురుష అభ్యర్థులు 8,598 మంది హాజరవుతారన్నారు. ఏఎన్‌యూలోని 400 మీటర్ల సింథటిక్ ట్రాక్‌ను సిద్ధం చేయాలన్నారు. ఎంపిక ప్రక్రియ రాత్రిళ్లు జరగనున్నందున ఫ్లడ్‌లైట్లలో లోపం లేకుండా చూసుకోవాలన్నారు. సింథటిక్ ట్రాక్‌కు ఆనుకుని శారీరక దారుఢ్య, డ్రగ్ పరీక్షలు, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు. అంబులెన్స్‌లతో పాటు అత్యవసర వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్మీ రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ రజత్ సువర్ణ మాట్లాడుతూ అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లరికల్/ స్టోర్ కీపర్, ట్రేడ్స్‌మన్ తదితర విభాగాలలో అగ్నివీర్ రిక్రూట్మెంట్ జరుగుతుందని, అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. రాత్రి 2 నుంచి ఉదయం 5 గంటల వరకు పరుగు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు స్పైక్ షూ/కనీసం సాధారణ షూ ధరించడం మంచిదని తెలిపారు. శారీరక పరీక్షల్లో పుల్ అప్స్, జిగ్ జాగ్, 9 అడుగుల లాంగ్ జంప్ చేయాల్సి ఉంటుందన్నారు. వీటిలో ఎంపికైన వారికి ఎత్తు, బరువు తదితర శారీరక కొలతల పరీక్ష ఉంటుందన్నారు. అందులో ఎంపికైన వారికి పేరాగ్రాఫ్ రాత, డ్రగ్, మెడికల్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు వారికి నిర్దేశించిన సమయంలో రిక్రూట్మెంట్ ప్రదేశానికి చేరుకోవాలని సూచించారు. శరీరంపై ఎక్కడా ఐదు సెంటీమీటర్లు మించి టాటూలు ఉండరాదని, అయితే గిరిజన తెగలకు వారి ఆచారాల మేరకు వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ సమీక్షలో డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, ఏఎస్పీ హనుమంతు, ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, జిల్లా రవాణా, అగ్నిమాపక, జిల్లా పౌర సరఫరాల అధికారులు కృష్ణారెడ్డి, కే శ్రీహరి, పి.కోమలిపద్మ, డీపీవో బి.వి.నాగసాయికుమార్, డీఆర్‌డీఏ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీలు వి.విజయలక్ష్మి, వి.శంకర్, జిల్లా సైనిక సంక్షేమ అధి కారి ఆర్.గుణశీల, జడ్పీ ఉపముఖ్య కార్యనిర్వహణ అధికారి కృష్ణ, పాల్గొన్నారు.

గ్రామీణ పరిశుభ్రతే లక్ష్యం

● జడ్పీ సీఈవో జ్యోతి బసు ● ఉమ్మడి జిల్లాలో స్వచ్ఛ రథాల రెండో దశకు శ్రీకారం



మాట్లాడుతున్న సీఈవో జ్యోతి బసు, డీపీవో నాగేశ్వరరావు నాయక్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతను మరింత పెంచే లక్ష్యంతో అమలు చేస్తున్న స్వచ్ఛ రథాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి వీడ్ల జ్యోతి బసు పిలుపు నిచ్చారు. స్వచ్ఛరథాల రెండో దశ అమలుపై మంగళవారం గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ రథాల కార్యక్రమం పకడ్బందీగా అమలు కావాలంటే స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో పాటు శాఖల మధ్య సమన్వయం, నిరంతర పర్యవేక్షణ ఎంతో కీలకమన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించడంలో ఎంపీడీవోలు కీలకపాత్ర పోషించాలని, ప్రతి మండలంలో కార్యక్రమం సాఫీగా, సమర్థవంతంగా అమలయ్యేలా చురుకైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఓరియంటేషన్ కార్యక్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన ఎంపీడీవోలు పాల్గొన్నారు. గ్రామాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణలో స్వచ్ఛ రథాల పాత్ర కీలకమని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పల్నాడు డీపీవో నాగేశ్వరరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పొన్నూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో తుంగభద్ర కాలువ కట్ట వద్ద అర్బన్ పోలీసులకు మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభించింది. పోలీసుల వివరాల ప్రకారం, నిడుబ్రోలు తుంగభద్ర కాలువలో 50 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సమాచారం తెలిసినవారు పొన్నూరు అర్బన్ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. పోలీసులు మృతదేహాన్ని నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఇంజనీరింగ్ విద్యార్థిపై కర్రలతో దాడి

చేబ్రోలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సరదాగా గడపాల్సిన యువజన ఉత్సవాలు కాస్తా రణరంగాన్ని తలపించాయి. పాత కక్షలు సెగలు చిమ్మడంతో ఓ ఇంజనీరింగ్ విద్యార్థిపై పదిమందికి పైగా యువకులు కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. వడ్లమూడిలో ఓ విశ్వవిద్యాలయంలో ఈ ఘటన కలకలం రేపింది. చందూరుకు చెందిన ఆరమండ్ల భరత్ నాగార్జున యూనివర్సిటీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితుడు హేమంత్ ఆహ్వానం మేరకు వడ్లమూడిలోని ఓ యూనివర్సిటీలో జరుగుతున్న యువజన ఉత్సవాలకు వెళ్లాడు. అయితే హేమంత్‌కు అదే ప్రాంతానికి చెందిన శ్రీరామ్ అనే యువకుడికి మధ్య గతంలోనే గొడవలున్నాయి. ఈ విషయాన్ని హేమంత్ ముందే భరత్‌కు వివరించాడు. స్నేహితుడి కోసం భరత్ శ్రీరామ్‌పై దాడికి దిగాడు. భరత్ తన పై చేయి చేసుకోవడంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన శ్రీరామ్ వెంటనే తన స్నేహితులైన ఆదర్శతో సహా మరో తొమ్మిది మందిని అక్కడికి పిలిపించాడు. అందరూ కలిసి భరత్‌ను చుట్టుముట్టి కర్రలతో దారుణంగా కొట్టారు. అనంతరం పరారయ్యారు. ఈ దాడికి సంబంధించిన దృశ్యాలను కొందరు సెల్ ఫోన్లలో చిత్రీకరించారు, అవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. భరత్ తండ్రి అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వీరనారాయణ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

నాటకరంగ పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

● గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ● ఘనంగా ముగిసిన నాటక మహోత్సవం ● అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



మాట్లాడుతున్న నసీర్ అహ్మద్, వేదికపై ప్రత్తిపాటి పుల్లారావు, గుమ్మడి గోపాలకృష్ణ, డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నాటకరంగానికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో తెలుగు నాటక పరిషత్తుల సమాఖ్య సంయుక్త వేదిక (యడ్లపాడు), నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా-ఢిల్లీ వేదిక (ఎన్ ఎస్‌డి) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత్ రంగ్ అంతర్జాతీయ నాటక మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమాల్లో భాగంగా జరిగిన నాటక ప్రదర్శనలను, సభలను నాటక వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, కళాకారులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ నాటక మహోత్సవాలను నగరంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. నాటకులను, కళాకారులను ప్రోత్సహించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలుగు నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ, భారత్ రంగ్ మహోత్సవాలను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు. ముత్తవరపు సురేష్‌బాబు మాట్లాడుతూ, గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దయా ప్రకాష్ సిన్హా రచనలో ఆయుషి త్రిపాఠి దర్శకత్వంలో అప్ ఆర్ గ్రూప్ ప్రదర్శించిన వన్స్ ఇన్ ఇండియా నాటకం 22 శతాబ్దాల నాటి మౌర్య సామ్రాజ్య పతనాన్ని కళ్లకు కట్టింది. విదేశీ దండయాత్రల నుంచి దేశాన్ని కాపాడలేక, కేవలం అహింస పేరుతో మౌనంగా ఉన్న చివరి మౌర్య రాజు బృహద్రథుడిని సైనిక తిరుగుబాటు ద్వారా పడగొట్టిన చారిత్రక సమయాలను ఈ నాటకం అద్భుతంగా ఆవిష్కరించింది.

● అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ముగింపు ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. నరసరావుపేట బీవీసీ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు, రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థినుల జానపద నృత్యాలు, అను డాన్స్ అకాడమీ వారి నృత్య ప్రదర్శన భారతీయ సంస్కృతికి అద్దం పట్టాయి. అంతకు ముందు వందలాది మంది కళాకారులు, విద్యార్థులతో నగరంలో కళా ర్యాలీ జరిగింది. ర్యాలీలో ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని కళాకారులను ఉత్తేజపరిచారు.

కత్తితో వ్యక్తిపై దాడి

● తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

చేబ్రోలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం గుండవరం గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై కత్తితో దాడి జరిగింది. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు, రాత్రి సుమారు 10 గంటల సమయంలో మద్యం సేవించిన సాతర్ల గోపి, తాడిమెల గోపి, సాతర్ల శ్రీకాంత్ అనే ముగ్గురు వ్యక్తులు సాతర్ల వెంకటేష్ (34)పై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో వెంకటేష్ మెడపై కత్తిగాట్లు పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వెంకటేష్‌ను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో గుంటూరు ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిర్చియార్డు సమాచారం (మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	1,02,248
అమ్మకాలు	98,826
నిల్వ	21,721

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	23000
నెంబరు. 5	13500	22500
273	14000	22000
341	14000	26000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	20500
షార్ప్-1	-----	-----
బ్యాడిగి	14000	25000
దేవనూరు డీలక్స్	15000	27000
అర్మూరు	13000	18000
ఏసీ కామన్ వెరైటీ		
334	13500	21500
నెంబరు. 5	13000	21000
273	----	----
341	14000	24000
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	19000
బ్యాడిగి 355	14000	24500
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	12500

దంత వైద్య పరిశోధనలపై ఆసక్తి చూపాలి

● హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్ ● ఘనంగా కేర్ డెంటల్ కాలేజీ స్నాతకోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రసూల్

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దంత వైద్యులు గ్రాడ్యుయేషన్‌తోనే పరిమితం కాకుండా పీజీ స్పెషాలిటీ కోర్సులు, పరిశోధన రంగం పట్ల ఆసక్తి చూపాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి, కార్డియాలజిస్ట్ డాక్టర్ పుల్లల చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో జరిగిన కేర్ డెంటల్ కాలేజీ నాలుగో స్నాతకోత్సవం ఆల్వీదా 2026లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి సమాజంలో దంత సంబంధ వ్యాధులు సాధారణ మై పోయాయన్నారు. పోటీ ఉన్నప్పటికీ, దంత వైద్యులు వృత్తి నైపుణ్యం పెంచుకుంటే వృత్తిపరంగా అద్భుతాలు సృష్టించవచ్చని వీసీ డాక్టర్ చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ కేర్ విద్యా సంస్థల ద్వారా డాక్టర్ రసూల్, దంత వైద్యం, నర్సింగ్ తదితర కోర్సుల్లో చక్కటి ప్రమాణాలతో విద్యా సంస్థలు నెలకొల్పి సమాజ సేవ చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కేర్ డెంటల్ కాలేజీ వ్యవస్థాపక అధ్య క్షుడు డాక్టర్ సయ్యద్ రసూల్, సీఈవో ముజహిద్ ఆలీ, ప్రెసిడెంట్ సుజాయిత్ ఆలీ, జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, సీనియర్ వైద్యు లు డాక్టర్ అజ్మల్‌హుస్సేన్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మోహబూబ్, డాక్టర్ సుహేల్ తదితరులు ప్రసంగించారు. అనంతరం 2020 బ్యాచ్ గ్రాడ్యుయేట్లకు వీసీ డాక్టర్ చంద్రశేఖర్ డిగ్రీ పట్టాలను ప్రదానం చే శారు. తొలుత కేర్ డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, గ్రాడ్యుయేట్లతో డెంటల్ ఓత్ (ప్రమాణం) చేయించారు. పెద్ద సంఖ్య లో డెంటల్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రికవరీ బంగారం మాయం

● పొన్నూరు అర్బన్ పోలీస్ స్టేషన్లో ఘటన

పొన్నూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రికవరీ బంగారం మాయం అయిన ఘటన పెను సంచలనంగా మారింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం పొన్నూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులకు సంబంధించి పోలీసులు రికవరీ చేసిన బంగారం గత కొద్ది రోజులుగా కనిపించడం లేదని తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రేషన్ పుల్లర్ హత్య కేసులో పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు కూడా అదృశ్యమైనట్లు సమాచారం. ఇటీవల మండల పరిధిలోని ఒక గ్రామానికి చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు కనిపించడం లేదు సుమారు 140 గ్రాముల పైబడి బంగారు ఆభరణాలను పోలీసులు ఈ రెండు కేసుల్లో రికవరీ చేసి అర్బన్ పోలీస్ స్టేషన్‌లోని బీరువాలో భద్రపరిచారు. గతంలో పనిచేసిన పోలీసు అధికారి బదిలీపై వెళుతూ ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందికి వాటిని అప్పగించి రికార్డు చేయించినట్లు తెలుస్తోంది. ఆ తరువాత ఆ బంగారం ఎక్కడ ఉంది అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల ఈ బంగారు ఆభరణాలు కనిపించడం లేదని సిబ్బంది మల్లగుల్లాలు పడ్డారు. ఈ విషయం ఆ నోట ఈ నోట పాకి బంగారం అదృశ్యమైన సంఘటన వెలుగు చూసింది. బంగారు ఆభరణాలు రికవరీ చేసి భద్రపరిచిన బీరువాతాళాలు కింద స్థాయి సిబ్బంది వద్ద ఉండటంతో సదరు సిబ్బంది అజాగ్రత్తగా వ్యవహరించారా, ఉద్దేశపూర్వకంగా అదృశ్యం చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత రెండు, మూడు రోజులుగా పోలీసులు ఈ విషయం బయటకు పొక్కనీయకుండా గుంబనంగా వ్యవహరించడమే కాకుండా అంతర్గతంగా విచారణ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌లో ఉన్న సీసీటీవీ పుటేజ్‌లను నిపుణులు రప్పించి పరిశోధిస్తున్నారు. ఈ సంఘటనతో స్థానికులతో పాటు పోలీసులూ అవాక్కవుతున్నారు. పోలీస్ స్టేషన్లో ఉన్న ఆభరణాలకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఎలా అని ప్రశ్నిస్తున్నారు. బంగారం అదృశ్యంపై అర్బన్ సీఐ ఎల్ వీరా నాయక్‌ను వివరణ కోరగా జరిగిన సంఘటపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

పొన్నెకల్లులో భారీ చోరీ

● 400 గ్రాముల బంగారం, 2 కేజీల వెండి అపహరణ



ఘటనా స్థలిలో వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీమ్

తాడికొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి ఇంటికి తాళం వేసి ఉండటాన్ని అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగలకొట్టి బీరువాలోని బంగారు ఆభరణాలు, వెండి వస్తువు లు చోరీ చేశారు. ఈ ఘటన తాడికొండ మండలం పొన్నెకల్లులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పొన్నెకల్లుకు చెందిన కేసరి అశోక్‌రెడ్డి తన భార్యతో కలిసి ఈ నెల 4వ తేదీన బంధువుల ఇంటికి హైదరాబాద్ వెళ్లారు. మంగళవారం తమ ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తాళాలు పగ లకొట్టి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కబోర్డు లోపల ఉన్న బీరువా తలుపులు పగలకొట్టి సుమారు 400 గ్రాములు బంగారు ఆభరణాలు, 2 కేజీల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సుమారు రూ.60 లక్షలు విలువైన బంగారు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. క్లూస్ టీమ్, డ్యాగ్ స్క్వాడ్ రంగం లోకి దిగి వేలి ముద్రలు సేకరించాయి. సీఐ కె.వాసు దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జీత్యానాయక్ తెలిపారు.

బాపట్ల పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం. 15/2026/ఇ1 తేది. 10.02.2026

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

బాపట్ల పురపాలక సంఘమునకు సంబంధించి సాఫ్ట్ లోన్ గ్రాంట్ క్రింద వివిధ అభివృద్ధి పనులను చేయుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు విధానము ద్వారా అర్హత గల రిజిష్టరు కాంట్రాక్టరు దారుల నుండి టెండర్లు కోరబడుచున్నవి. ఇతర వివరములకు www.tender.apeprocurement.gov.in (procurement place) వద్ద చూడగలరు మరియు ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలలో సంబంధిత విభాగము నందు అడిగి తెలుసుకొనగలరు.

పనుల సంఖ్య :- 3

అంచనా విలువ :- రూ॥ 2,00,84,351/-

1. టెండరు బిడ్‌లు ప్రారంభపు తేది. : 11.02.2026 ఉదయం 10.00 గం॥లకు
2. టెండరు బిడ్‌లు వేయుటకు ఆఖరు తేది. : 25.02.2026 సాయంత్రం 4.00 గం॥లకు
3. టెండరు బిడ్‌లు స్వీకరించు చివరి తేది. : 25.02.2026 సాయంత్రం 5.00 గం॥లకు

సం/- **కమీషనరు,**
బాపట్ల పురపాలక సంఘం

LIC HFL LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

LIC HOUSING FINANCE LTD

విజయవాడ బ్యాక్ ఆఫీస్: డి నెం. 20-4-15, ఆనంద్ హైట్స్, లోటస్ ల్యాండ్ మార్క్, కేదారేశ్వరపేట మెయిన్ రోడ్డు, విజయవాడ-520003, ఆంధ్రప్రదేశ్.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఎల్.ఐ.సి. హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (LIC HFL) వారి యొక్క అధీకృత అధికారిగా ఉన్న ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 నందు చెప్పబడిన నిబంధనలు మరియు అందలి సెక్షన్ 13(12)తో కలిపి చదవబడే విధంగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 3 క్రింద తమకు లభించిన అధికారములను వినియోగించుకొంటూ ఈ దిగువ చెప్పబడిన ఋణగ్రహీత(లు) / తనఖాదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తములను తిరిగి చెల్లించవలసినదిగా కోరుతూ డిమాండ్ నోటీసు జారీచేసియున్నారని ఇందుమూలముగా తెలియజేయడమైనది. అయినప్పటికినీ మా నోటీసులు నందు చెప్పబడిన బకాయి మొత్తములను ఈ ఋణగ్రహీత(లు) / తనఖాదారు(లు) చెల్లింపులో విఫలమైనందున, ఈ దిగువ చెప్పబడిన సంతకందారుడు, ఈ దిగువ చెప్పిన ఆస్తులను సదరు పై చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు సెక్షన్ 14 తో కలిపి చదవబడే నిబంధన 8 క్రింద **భౌతికముగా స్వాధీనము** చేసికొనియున్నారు.

క్ర సం.	లోన్ నెం. / ఋణగ్రహీత / సహ-ఋణగ్రహీత పేరు	స్థిరాస్తి వివరములు	రిజర్వు ధర (రూ.)	ధరావత్తు (రిజర్వు ధరలో 10%)	బ్యాంక్ వివరములు (ధరావత్తు బదిలీ చేయవలసిన)
1)	లోన్ ఖాతా నెం. 710800006631 శ్రీ సుమన్ సురేశ్‌బాబు కాకర్లమూడి (ఋణగ్రహీత) శ్రీమతి సుగుణ ఇందిరా దేవి కాకర్లమూడి (సహ-ఋణగ్రహీత). గుంటూరు ఏరియా ఆఫీసు: ఫోన్ : 9704653695, 9704020357	షెడ్యూల్-ఎ ఆస్తి: గుంటూరు జిల్లా, పెదకాకాని రిజిస్ట్రేషన్ జిల్లా, కొప్పురావూరు గ్రామ పంచాయతీ పరిధి, కొప్పురావూరు గ్రామం, డి.నెం.26 నందు విస్తీర్ణం ఎ. 3-18 సెంట్లు, డి.నెం.27 నందు విస్తీర్ణం ఎ. 2.55 సెంట్లు, డి.నెం. 28/1 నందు విస్తీర్ణం ఎ. 0.66.1/2 సెంట్లు, డి.నెం.30/1 నందు విస్తీర్ణం ఎ. 4-90 సెంట్లు, మొత్తం నాలుగు నెంబర్లు యొక్క ఒకే భాగం భూమి విస్తీర్ణం ఎ.11.29/.1/2, సెంట్లు మరియు డి.నెం. 26, ఎ.1-06 సెంట్లు మొత్తం ఎ. 12-34.1/2 సెంట్లు V.G.T.M.UDA ఫైల్ నెం.E2/120/2014, యల్‌పి నెం. 19/2014/GNT ప్లాన్ ప్రకారం ప్లాట్ నెం.61 లోని విస్తీర్ణం 550 చ॥గ॥ల విస్తీర్ణం, ప్లాట్ నెం.62 లోని విస్తీర్ణం 220 చ॥గ॥, ప్లాట్ నెం.63 లోని విస్తీర్ణం 220 చ॥గ॥, ప్లాట్ నెం.64 లోని విస్తీర్ణం 220 చ॥గ॥, ప్లాట్ నెం.77 లోని విస్తీర్ణం 240 చ॥గ॥, ప్లాట్ నెం.78 లోని విస్తీర్ణం 240 చ॥గ॥, ప్లాట్ నెం.79 లోని విస్తీర్ణం 240 చ॥గ॥,	రూ. 32,00,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-	రూ. 3,20,000/-	Beneficiary Name: LIC Housing Finance Ltd Branch Name: HDFC BANK Account Number:- LHFLVW710800006631 IFSC Code:- HDFC0000109 Property Id:- VW710800006631
		ప్లాట్ నెం.80 లోని విస్తీర్ణం 600 చ॥గ॥ మొత్తం విస్తీర్ణం 2530 చ॥గ॥ల స్థలంలో నిర్మించిన "**క్యాపిటల్ స్క్వేర్**", ఎ-బ్లాక్ లో సేల్ డీడ్ నెం.3853/2018 తో ఉన్న రెసిడెన్షియల్ ఆస్తి. **హద్దులు: తూర్పు:** 40 అ॥ల వెడల్పు రోడ్డు : 198'-0", **దక్షిణం:** ప్లాట్ నెం. 76,65:115'-0"కి సంబంధించిన స్థలం, **పడమర:** 40 అ॥ల వెడల్పు గల రోడ్డు :198'-0", **ఉత్తరం:** 40 అ॥ల వెడల్పు రోడ్డు : 115'-0". **షెడ్యూల్-బి:** పైన తెలిపిన స్థలం మొత్తం 2530 చ॥గ॥ల లేదా 2115.33 చ॥మీ॥ల విస్తీర్ణంలో అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా 59 చ॥గ॥ల లేదా 43.33 చ॥మీ॥ల విస్తీర్ణంతో "క్యాపిటల్ స్క్వేర్", ఎ-బ్లాక్ నందు మొదటి అంతస్తులో మొత్తం 1650 చ॥అ॥ల విస్తీర్ణంతో (ప్లింత్ & ఉమ్మడి ఏరియా మరియు ఒక కార్ పార్కింగ్‌తో సహా) సెమీ ఫినిష్డ్ **త్రి బెడ్‌రూమ్ ఫ్లాట్ నెం. 202. తూర్పు:** శూన్యాకాశం, **దక్షిణం:** శూన్యాకాశం, **పడమర:** ఉమ్మడి వరండా, **ఉత్తరం:** శూన్యాకాశం.			
		క్రింద పేర్కొన్న ఋణగ్రహీతలందరికీ అనగా క్రమ సంఖ్య 2 నుండి 5 వరకు షెడ్యూల్-ఎ ఆస్తి కామన్‌గా ఉంది: **స్థిరాస్తి వివరములు:** షెడ్యూల్-ఎ: గుంటూరు జిల్లా, పెదకాకాని ఎస్ఆర్ఒ, కొప్పురావూరు పంచాయితీ, కొప్పురావూరు గ్రామం, డి.నెం.26 నందు ఎ. 3-18 సెంట్లు, డి.నెం.27 నందు ఎ. 2-55 సెంట్లు, డి.నెం. 28/1 నందు ఎ. 0.66.1/2 సెంట్లు, డి.నెం.30/1 నందు ఎ.4-90 సెంట్లు, మొత్తం నాలుగు నెంబర్లు కలిపి ఒకే ఐటెంగా విస్తీర్ణం ఎ. 11-29.1/2 సెంట్లు మరియు డి.నెం.26 నందు ఎ. 1-06 సెంట్లు కలిపి మొత్తం ఎ. 12-35.1/2 సెంట్లు, ఇందులో V.G.T.M.UDA ఫైల్ నెం.E2/120/2014 Lp No.19/2014/GNT Plan ప్రకారం ప్లాట్ నెంలు.65, 66, 67, 68, 69, 70, 71, 72, 73, 74, 75 మరియు 76 నందు మొత్తం స్థలం 2764.16 చ॥గ॥లో నిర్మించిన "క్యాపిటల్ స్క్వేర్" బి-బ్లాక్. **మొత్తం విస్తీర్ణం 2764.16 చ॥గ॥లు లేదా 2311.11 చ॥మీ॥లులోని భూమికి హద్దులు: తూర్పు:** 40 అ॥ల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** శ్యామల కిషోర్‌రెడ్డికి సంబంధించిన స్థలం, **పడమర:** 40 అ॥ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నెం. 64,67 కి సంబంధించిన స్థలం.			
2)	లోన్ ఖాతా నెం. 720100001334 శ్రీ మాధవ్ పొన్నాడ (ఋణగ్రహీత) విజయవాడ ఏరియా ఆఫీసు: ఫోన్ : 9951534212, 9704020357	**షెడ్యూల్-బి:** గుంటూరు-521121, పెద్దకాకాని, కొప్పురావూరు పంచాయతీ, కొప్పురావూరు గ్రామం, రెయిన్ ట్రీ పార్క్ వెనుక, అవిభాజ్యపు వాటా 46 చ॥గ॥ లేదా 38.46 చ॥మీ॥ వాటాతో బి-బ్లాక్ క్యాపిటల్ స్క్వేర్, 1వ అంతస్తు నందు మొత్తం ఏరియా 1250 చ॥అ॥లుతో (ప్లింత్ & కామన్ ఏరియాలు మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లో ఒక కారు పార్కింగ్‌తో కలిపి) **ఫ్లాట్ నెం.202** మరియు **హద్దులు: తూర్పు:** శూన్యాకాశం, **దక్షిణం:** శూన్యాకాశం, **పడమర:** ఉమ్మడి వరండా, **ఉత్తరం:** లిఫ్ట్ & శూన్యాకాశం.	రూ. 24,28,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 10,000/-	రూ. 2,42,800/-	Beneficiary Name: LIC Housing Finance Ltd Branch Name: HDFC BANK Account Number:- LHFLVW720100001334 IFSC Code:- HDFC0000109 Property Id:- VW720100001334
3)	లోన్ ఖాతా నెం. 720100001337 శ్రీ మాధవ్ పొన్నాడ (ఋణగ్రహీత) విజయవాడ ఏరియా ఆఫీసు: ఫోన్ : 9951534212, 9704020357	**షెడ్యూల్-బి:** గుంటూరు-521121, పెద్దకాకాని, కొప్పురావూరు పంచాయతీ, కొప్పురావూరు గ్రామం, రెయిన్ ట్రీ పార్క్ వెనుక, అవిభాజ్యపు వాటా 46 చ॥గ॥ లేదా 38.46 చ॥మీ॥ వాటాతో బి-బ్లాక్ క్యాపిటల్ స్క్వేర్, 1వ అంతస్తు నందు మొత్తం ఏరియా 1250 చ॥అ॥లుతో (ప్లింత్ & కామన్ ఏరియాలు మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లో ఒక కారు పార్కింగ్‌తో కలిపి) **ఫ్లాట్ నెం.205** మరియు **హద్దులు: తూర్పు:** శూన్యాకాశం, **దక్షిణం:** శూన్యాకాశం, **పడమర:** ఉమ్మడి వరండా, **ఉత్తరం:** శూన్యాకాశం.	రూ. 24,28,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 10,000/-	రూ. 2,42,800/-	Beneficiary Name: LIC Housing Finance Ltd Branch Name: HDFC BANK Account Number:- LHFLVW720100001337 IFSC Code:- HDFC0000109 Property Id: VW720100001337
4)	లోన్ ఖాతా నెం. 720100001397 శ్రీ మాధవ్ పొన్నాడ (ఋణగ్రహీత) విజయవాడ ఏరియా ఆఫీసు: ఫోన్ : 9951534212, 9704020357	**షెడ్యూల్-బి:** గుంటూరు-521121, పెద్దకాకాని, కొప్పురావూరు పంచాయతీ, కొప్పురావూరు గ్రామం, రెయిన్ ట్రీ పార్క్ వెనుక, అవిభాజ్యపు వాటా 46 చ॥గ॥ లేదా 38.46 చ॥మీ॥ వాటాతో బి-బ్లాక్ క్యాపిటల్ స్క్వేర్, 1వ అంతస్తు నందు మొత్తం ఏరియా 1250 చ॥అ॥లుతో (ప్లింత్ & కామన్ ఏరియాలు మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లో ఒక కారు పార్కింగ్‌తో కలిపి) **ఫ్లాట్ నెం.206** మరియు **హద్దులు: తూర్పు:** శూన్యాకాశం, **దక్షిణం:** శూన్యాకాశం, **పడమర:** ఉమ్మడి వరండా, **ఉత్తరం:** లిఫ్ట్ & శూన్యాకాశం.	రూ. 24,28,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 10,000/-	రూ. 2,42,800/-	Beneficiary Name: LIC Housing Finance Ltd Branch Name: HDFC BANK Account Number:- LHFLVW720100001397 IFSC Code:- HDFC0000109 Property Id: VW720100001397
5)	లోన్ ఖాతా నెం. 720100001398 శ్రీ మాధవ్ పొన్నాడ (ఋణగ్రహీత) విజయవాడ ఏరియా ఆఫీసు: ఫోన్ : 9951534212, 9704020357	**షెడ్యూల్-బి:** గుంటూరు-521121, పెద్దకాకాని, కొప్పురావూరు పంచాయతీ, కొప్పురావూరు గ్రామం, రెయిన్ ట్రీ పార్క్ వెనుక, అవిభాజ్యపు వాటా 46 చ॥గ॥ లేదా 38.46 చ॥మీ॥ వాటాతో బి-బ్లాక్ క్యాపిటల్ స్క్వేర్, 1వ అంతస్తు నందు మొత్తం ఏరియా 1250 చ॥అ॥లుతో (ప్లింత్ & కామన్ ఏరియాలు మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లో ఒక కారు పార్కింగ్‌తో కలిపి) **ఫ్లాట్ నెం.204** మరియు **హద్దులు: తూర్పు:** శూన్యాకాశం, **దక్షిణం:** శూన్యాకాశం, **పడమర:** ఉమ్మడి వరండా, **ఉత్తరం:** లిఫ్ట్ & శూన్యాకాశం.	రూ. 24,28,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 10,000/-	రూ. 2,42,800/-	Beneficiary Name: LIC Housing Finance Ltd Branch Name: HDFC BANK Account Number:- LHFLVW720100001398 IFSC Code:- HDFC0000109 Property Id:- VW720100001398

ఇ-వేలం యొక్క వెబ్‌సైట్	https://www.bankeauctions.com
ఆస్తి తనిఖీ కొరకు మరియు ఆస్తి డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ కొరకు తేది & సమయం	25-02-2026 ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 05:00 గం॥ల మధ్యన
టెండరు / ఆన్‌లైన్ బిడ్ సమర్పించుటకు చివరి తేది	04-03-2026 సా॥ 05.00 గం॥ల లోపు (ఆన్‌లైన్ విధానం ద్వారా మాత్రమే)
ఇ-వేలం తేది మరియు సమయం	05-03-2026 ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 1.00 గం॥ల వరకు

ఇ-వేలం ద్వారా విక్రయం చేయు పైన చెప్పబడిన అసెట్స్ / ఆస్తులు (SARFAESI, చట్టం 2002 నియమములు మరియు నిబంధనలకు లోబడి మరియు తదుపరి చెప్పిన నిబంధనలు) కొరకు జారీ చేసిన ఈ బహిరంగ ప్రకటనతో పాటుగా, ఆన్‌లైన్ విధానం ద్వారా పైన చెప్పబడిన ఆస్తిని "ఎక్కడ ఏమి ఉన్నదో అలాగే" & "అక్కడ ఏమి ఉన్నదో అదే" ప్రాతిపదిక పై కొనుగోలు చేయుటకు ఆసక్తి గల బిడ్డర్ల నుండి ఆఫర్లను ఎల్.ఐ.సి. హెచ్.ఎఫ్.ఎల్ వారు ఆహ్వానిస్తున్నారు.

వేలం ద్వారా విక్రయం యొక్క నియమములు & నిబంధనలు ఈ దిగువున చెప్పబడినవి:

1) "ఎక్కడ ఏమి ఉన్నదో అలాగే, "అక్కడ ఏమి ఉన్నదో అదే", "ఏదైతే ఉన్నదో అదే" మరియు "ప్రశ్నించే వీలులేని" ప్రాతిపదిక పై మాత్రమే ఇ-వేలం నిర్వహించబడును మరియు "ఆన్‌లైన్" విధానము ద్వారా ఇ-వేలం ఎల్.ఐ.సి హౌసింగ్ ఫైనాన్స్ వారిచే ఆమోదిత ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ **"M/s. 4Closure"** వారిచే నిర్వహించబడును. **2)** ఆసక్తి గల బిడ్డర్లు తమ పేర్లను దయచేసి మా పోర్టల్ **https://bankauctions.in** నందు నమోదు చేసుకొనవలెను మరియు వారి యొక్క యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌లను ఉచితముగా పొందవచ్చును. ఇ-వేలం విధానం ద్వారా పాల్గొనుటకు ఆన్‌లైన్ శిక్షణ కొరకు ఆసక్తి గల అర్హత కలిగిన బిడ్డర్లు మా సర్వీసు ప్రొవైడరు **M/s. 4Closure** వారిని సంప్రదించవగలరు. సంప్రదించవలసిన వ్యక్తి: శ్రీ టి. జయప్రకాష్ రెడ్డి, ఫోన్: 8142000064, ఇ-మెయిల్ ఐడి: **prakash@Bankauctions.in & info@bankauctions.in. 3)** ఆమోదిత ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ **"M/s. 4Closure"** వారి **https://bankauctions.in** వెబ్‌సైట్ దర్శించి వేలం ద్వారా విక్రయం చేయు ఆస్తి యొక్క పూర్తి వివరములు మరియు అందలి పూర్తి నియమ నిబంధనలు తెలుసుకొనవచ్చును. **4) ఇతర వివరములకు సంప్రదించండి. ఫోన్: 97046 53695, 97040 20357.**

తేది: 11.02.2026, ప్రదేశం: విజయవాడ సం/- **అధీకృత అధికారి, ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా నందకిశోర్ ఎన్నిక



ధ్రువపత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ జి.నందకిశోర్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా గుంటూరు ఐఎంఏ శాఖకు చెందిన డాక్టర్ జి.నందకిశోర్ ఎన్నికయ్యారు. 13మంది సభ్యుల ఎంపికకు మొత్తం 84మంది వైద్యులు పోటీపడ్డారు. ఆన్‌లైన్ లో ఎన్నికలు జరగగా అత్యధిక ఓట్లు సాధించి ఎన్నికైన 13 మందిలో డాక్టర్ నందకిశోర్ ఉన్నారు. డాక్టర్ నందకిశోర్ ఎన్నిక పట్ల ఐఎంఏ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ ఎన్.కిశోర్ ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవ కుమార్, కార్యదర్శి డాక్టర్ బి.సాయి కృష్ణ, స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ డి.అమర్, పలువురు సీనియర్ వైద్యులు అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల కు రాష్ట్ర సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర బాబు రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు.

టెన్నిస్ క్రీడాకారుడికి అభినందనలు

గుంటూరు(తూర్పు): పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన ఓపెన్ టెన్నిస్ పోటీల్లో పురుషుల సింగిల్స్ విభాగంలో రన్నర్ టైటిల్ సాధించిన ఎన్టీఆర్ స్టేడియానికి చెందిన శబరీష్‌ను పలువురు అభినందించారు. రానున్న రాష్ట్ర స్థాయి పోటీలలో అత్యున్నత ప్రతిభ కనబరిచి స్టేడియంకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్టేడియం టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాదు, నార్త్ క్లబ్ టెన్నిస్ సభ్యులు, డాక్టర్ టీవీ రావు, ఎన్ సాంబశివరావు, అరుణ్ కుమార్, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

అంబటి కుటుంబ సభ్యులకు వెల్లంపల్లి పరామర్శ

గుంటూరు: గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబసభ్యులను మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పలువురు వైసీపీ నేతలు మంగళవారం పరామర్శించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి కూటమి హామీలను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రతి అక్రమ చర్యకు రానున్న రోజుల్లో డిజిటల్ బుక్ ద్వారా సమాధానం చెబుతామని హెచ్చరించారు.

జీసీకేవీఎన్ కళాశాల విద్యార్థుల జయకేతనం

గుంటూరు(విద్య): స్థానిక సంగడిగుంటలోని జీసీకేవీఎన్ కళాశాల విద్యార్థులు ఇటీవల ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విడుదల చేసిన 3, 5వ సెమిస్టర్ ఫలితాలలో ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులు బీకాం కంప్యూటర్స్‌లో 95శాతం, బీఎస్సీ కంప్యూటర్స్‌లో 90శాతం, బీసీఏలో 89శాతం ఫలితాలు సాధించారన్నారు. అదే విధంగా 5వ సెమిస్టర్‌లో బీకాం కంప్యూటర్స్‌లో 93శాతం, బీఎస్సీ కంప్యూటర్స్‌లో 90శాతం, బీసీఏలో 85 శాతం ఫలితాలు సాధించారని వెల్లడించారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ, బాపూజీ కమిటీ కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు పాల్గొన్నారు.

13న మేడూరికి సాహితీ పురస్కారం

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి సాహితీ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 13న భారత హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి, ప్రముఖ రాడికల్ హ్యూమనిస్ట్ మేడూరి సత్యనారాయణకు సాహిత్య పురస్కార సభ నిర్వహిస్తున్నట్లు సమితి కార్యదర్శి వల్లూరి తాండవ కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు సమితి గౌరవాధ్యక్షులు గద్దె మంగయ్య అధ్యక్షత వహిస్తారని, సంస్థ పూర్వ అధ్యక్షులు భైరపినేని నరేష్ అధ్యక్షులు ఆలోకం పెద్దబ్బాయి ప్రసంగిస్తారని చెప్పారు.

భార్యలు వదిలివెళ్లారనే మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఒకరి తర్వాత ఒకరు ఇరువురు భార్యలు తనను వదిలి వెళ్ళిపోయారనే మనస్తాపంతో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోరంట్లలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, భట్టిప్రోలుకు చెందిన విద్యాసాగర్ ఎనిమిదేళ్ళ క్రితం గుంటూరు రూరల్ మండలం తురకపాలేనికి చెందిన లక్ష్మీని వివాహం చేసుకున్నాడు. వారికి ఇరువురు పిల్లలున్నారు. విద్యాసాగర్ ఓ ఎలక్ట్రానిక్స్ దుకాణంలో పనిచేస్తూ గుంటూరులోనే ఉండేవాడు. ఏడాదిగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో విడిపోయారు. దీంతో విద్యాసాగర్ మూడునెలల క్రితం జ్యోతి అనే మరో యువతిని వివాహం చేసుకున్నాడు. వారిద్దరి మధ్య కూడా మనస్పర్థలు రావడంతో ఆమె కూడా విద్యాసాగర్‌ను వదిలి వెళ్లిపోయింది. దీంతో రెండునెలలుగా విద్యాసాగర్ గోరంట్లలో గది అద్దెకు తీసుకొని ఒక్కడే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఇరువురు భార్యలు తనను వదిలి వెళ్ళిపోయారని మనస్తాపానికి గురై మంగళవారం తన ఫోన్‌లో కుటుంబసభ్యులను మిస్ అవుతున్నందుకు బాధగా ఉంది.. మిస్‌యూ ఆల్ అని స్టేటస్ పెట్టి తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

11వ రోజుకు సహకార ఉద్యోగుల ఆందోళనలు

గుంటూరు (తూర్పు): సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించేవరకు నిరసనల్లోనే ఉంటామని రాష్ట్ర వ్యవసాయ, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ స్థానిక శ్యామలనగర్‌లోని సహకార కార్యాలయం ఎదుట ఉద్యోగులు చేపట్టిన నిరసనలు మంగళవారం నాటికి 11వ రోజుకు చేరాయి. ఉద్యోగులు చెవిలో పూలు పెట్టుకుని వినూత్న నిరసన చేపట్టారు. నిరసనల్లో సీఐటీయూ అధ్యక్షుడు నాగేశ్వరరావు, పెంకే సత్యనారాయణ, రావుల అంజిబాబు, బాషా, కొండయ్య, హనుమంతురావు, రాజేంద్రరెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీమా రంగంలో విదేశీ పెట్టుబడులు ప్రమాదకరం

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): బీమా రంగంలో విదేశీ పెట్టుబడులను నూరు శాతానికి పెంచడం సరికాదని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యదర్శి జి.కిషోర్ కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేట ఎల్ఐసీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటువంటి నిర్ణయాలతో దేశ ఆర్థికభద్రత ప్రమాదంలో పడుతుందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎల్ఐసీ సంస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ఈ నెల 12న జరిగే సమ్మెను ఉద్యోగులు, ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘనాయకులు డి.వాసు, శ్రీనివాస్, సీహెచ్ మధుబాల, గోపాలకృష్ణ, ఆర్.విజయ, రాఘవ, వెంకట్రావు, ఎం.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశ్రామిక పార్కులకు స్థలాలు గుర్తించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



రెవెన్యూ అధికారులతో సమావేశమైన కలెక్టర్

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక పార్కులకు స్థలాలు గుర్తించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఒక పారిశ్రామిక పార్కును ఏర్పాటుచేయాలనే నిశ్చయంతో ఉందన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గుంటూరు తూర్పు, ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రాంతాల్లో స్థలాలు గుర్తించినట్లు నివేదికలు అందాయని, మిగిలిన నియోజకవర్గాలలో త్వరగా గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. మండలాల్లో ఉన్న గృహ లేఅవుట్లు, అందులో మౌలిక వసతుల వివరాలు సమర్పించాలని సూచించారు. లేఅవుట్‌లో స్థలాలు, ఇళ్ల లబ్ధిదారుల వివరాలు పొందుపరచాలన్నారు. సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి పాల్గొన్నారు.

● సైబర్ భద్రతపై పోస్టర్ విడుదల

సైబర్ భద్రతపై ప్రతి ఒక్క ఇంటర్నెట్ వినియోగదారుడు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. సేఫర్ ఇంటర్నెట్ డే 2026 సందర్భంగా ఆమె మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి, ఎన్ఐసీ బృందం సమక్షంలో సేఫర్ ఇంటర్నెట్‌డే-26 పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటర్నెట్ వల్ల విద్య, సమాచార మార్పిడి, వ్యాపారం వంటి అనేక లాభాలు ఉన్నప్పటికీ, సైబర్ మోసాలు, డేటా చోరీ, ఆన్‌లైన్ వేధింపులు, ఫేక్ న్యూస్ వంటి ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా సైబర్ భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఐసీ జిల్లా సమాచార అధికారి పి.మోహన రాగిణి పాల్గొన్నారు.

చెత్త రహిత నగరంగా గుంటూరును తీర్చిదిద్దాలి

● నగర కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చెత్త రహిత, శుభ్రమైన నగరంగా గుంటూరును తీర్చిదిద్దుకోవడంలో ప్రజలను భాగస్వాములు చేస్తూ నగరపాలక సంస్థ ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కేవీపీ కాలనీలోని జీఎంసీ వెహికిల్ షెడ్‌ను పరిశీలించి, పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. వెహికిల్ షెడ్‌ను పరిశీలించి, ఎన్ని వాహనాలున్నాయి, వర్కింగ్, రిపేర్, విభాగాల వారీగా సిబ్బంది హాజరు తదితర అంశాలపై కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటుచేయాలన్నారు. నగరంలో రోడ్లపై చెత్త కనబడకుండా ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. షెడ్‌లో చెత్తకుప్పలు లేకుండా, పాత, వినియోగంలో లేని వస్తువులను నిర్దేశిత విధానంలో వేలం నిర్వహించాలన్నారు. పర్యటనలో ఎస్ఈ వెంకటేశ్వరరావు, సీఎంవోహెచ్ శాంతికళ, ఈఈలు విష్ణు, వేణు, డీసీపీ సూరజ్, ఎంహెచ్‌వో లక్ష్మీనారాయణ, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయకార్యదర్శులు పాల్గొన్నారు.

● కమిషనర్‌ను కలిసిన తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు తూర్పు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని నగర కమిషనర్ అశోక్ మయూర్‌ను ఎమ్మెల్యే నసీర్ కోరారు. మంగళవారం నగర మున్సిపల్ కార్యాలయంలో మేయర్ అశోక్ మయూర్‌ను ఎమ్మెల్యే నసీర్ కలిశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, వీటి మంజూరుకు సహకరించాలని కోరారు.



వాహనాల షెడ్డులో పరిశీలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

స్మార్ట్ మీటర్‌ల అధిక బిల్లులకు త్వరలో సర్దుబాటు

● సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్



సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్, ఎస్ఈ రమేష్, సీజీఆర్ఎఫ్ సభ్యులు

గుంటూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏర్పాటుచేసిన కొన్ని విద్యుత్ స్మార్ట్‌మీటర్‌లకు అధికంగా వచ్చిన బిల్లులకు రానున్న బిల్లులతో సర్దుబాటు చేసి జరిగిన నష్టాన్ని సవరిస్తారని కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం చైర్మన్ ఎన్ విక్టర్ ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. గుంటూరు సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌లో మంగళవారం గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ అధ్యక్షతన విద్యుత్ వినియోగదారుల అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా ఇమ్మానుయేల్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అదాలత్‌లో 20 ఫిర్యాదులు అందగా అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు. అత్యధికంగా స్మార్ట్ మీటర్లతో అధిక బిల్లులు వస్తున్నాయని ఫిర్యాదులు వచ్చాయని, త్వరలో సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. సీజీఆర్ఎఫ్‌కు ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో కూడా ఫిర్యాదులు చేయవచ్చని, ఫిర్యాదుదారు పూర్తి వివరాలు తెలపాలన్నారు. అదాలత్‌లో సర్కిల్ ఎస్ఏవో పాశం రామిరెడ్డి, గుంటూరు టౌన్ -1 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీ హుస్సేన్‌ఖాన్, పలువురు డీఈఈలు, ఏఈలు ఉన్నారు. ఇటీవల బిల్లుల్లో ఇష్టానుసారం వేసిన ట్రూఅప్ చార్జీలతో ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని వెంటనే వాటిని ఎత్తివేయాలని కోరుతూ వినియోగదారుల అభివృద్ధి సంఘం అధ్యక్షుడు సయ్యద్ ఆదం షాహెబ్ చైర్మన్ ఇమ్మానుయేల్‌ను కోరారు.

తుది దశకు శంకర్‌విలాస్ పాత ఆర్‌వోబీ తొలగింపు

● రైళ్ల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పూర్తి చేస్తున్న ఏజెన్సీ



గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ పాత ఆర్‌వోబీ తొలగింపు పనులు తుది దశకు చేరుకున్నాయి. క్లిష్టమైన రైల్వేభాగంలో బ్రిడ్జి తొలగింపు పనిని వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణలో ఏజెన్సీ పూర్తిచేస్తోంది. పిల్లర్లపై ఉన్న శ్లాబును ముక్కలుముక్కలుగా ప్రత్యేక యంత్రం ద్వారా కోసి భారీ క్రేన్‌ల సాయంతో శిథిలాలను తొలగించింది. ఈ క్రమంలో రైల్వేయార్డులో ఎలాంటి శిథిలాలు కిందపడకుండా చూసింది. దీనివల్ల రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేకుండాపోయింది. శ్లాబు తొలగింపు పూర్తి కావడంతో పిల్లర్లను తీసేసే పనిని ప్రారంభించింది. మంగళవారం సాయంత్రానికి ఒక పిల్లర్ తొలగింపు పూర్తైంది. రైల్వేయార్డులో ఉన్న మిగతా పిల్లర్లను మరో వారం వ్యవధిలోనే తొలగించే అవకాశం ఉంది. ఈ పనులు పూర్తయితే రైల్వే శాఖ అమలుచేస్తోన్న ట్రాఫిక్ బ్లాక్‌లను ఎత్తేయొచ్చు. ఎంతో క్లిష్టమైన పనిని సులభతరంగా పూర్తిచేస్తుండడంతో అంతా ఊపిరిపీల్చుకొంటున్నారు. పాతఆర్‌వోబీ తొలగింపు పూర్తయితే రైల్వే భాగంలో తొలుత వంతెన నిర్మాణాన్ని పూర్తిచేస్తారు. ఇందుకోసం రైల్వేకు సంబంధించిన కొంత స్థలాన్ని కూడా తీసుకోనున్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా వేరేచోట స్థలాన్ని నగర పాలకసంస్థ రైల్వేకు కేటాయిస్తోంది. జూన్ నెలాఖరుకు 60 శాతం పైగా నిర్మాణపనులు పూర్తవుతాయని భావిస్తున్నారు.

పైపుల మరమ్మతుకు డబ్బులు ఇవ్వలేదని దాడి

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తనతోపాటు అద్దెకు ఉంటున్న వ్యక్తి పైపుల మరమ్మతులకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆయనపై, ఆయన స్నేహితులపై పలువురు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాడీపేటలో జరిగింది. బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం కూచిపూడి గ్రామానికి చెందిన కట్ట తరుణ్ కుమార్ బ్రాడీపేట 4/10లోని ఓ మూడంతస్తుల భవనంలో గది అద్దెకు తీసుకొని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. అదే భవనంలో మూడో అంతస్తులో తలుపుల అప్పారావు అద్దెకుంటున్నాడు. అయితే అప్పారావు వాటర్ పైపులైన్‌లకు మరమ్మతులు చేయించాడు. అందులో కొంత ఇవ్వాలని తరుణ్ కుమార్ ను కోరాడు. తరుణ్ డబ్బులు ఇవ్వకపోవడంతో మంగళవారం వేపూరి సోమన్న అప్పారావు మరికొందరు కలిసి తరుణ్ ఆయన స్నేహితులపై రాడ్లు బీరు సీసాలతో దాడి చేసి కొట్టి గాయపరిచారు. ఈ ఘటనపై బాధితుడు తరుణ్ ఫిర్యాదుమేరకు అరండల్‌పేట పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీఎస్ఆర్ చౌదరికి సూపర్‌స్టార్ కృష్ణ మెమోరియల్ అవార్డు

● పలువురు అభిమానుల అభినందనలు



అవార్డుతో జీఎస్ఆర్ చౌదరి పక్కన విజయవర్మ, శ్రీనివాస్ తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విశ్రాంత సెంట్రల్ ఎక్సైజ్ ఉద్యోగి, హీరో కృష్ణకు వీరాభిమాని గుమ్మడి సీతారామయ్యచౌదరికి ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సూపర్‌స్టార్ కృష్ణ మెమోరియల్ అవార్డును అందజేశారు. గుంటూరు కన్నవారితోటలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎఫ్‌టీపీసీ సంస్థ ప్రధానకార్యదర్శి సినీ నిర్మాత పాకలపాటి విజయవర్మ, సంయుక్త కార్యదర్శి ఆలపాటి శ్రీనివాస్, సినీగీత రచయిత తైదల బాబులు సీతారామయ్యచౌదరికి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జీఎస్ఆర్ చౌదరిని ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. విజయ్‌వర్మ మాట్లాడుతూ కృష్ణ అభిమానిగా సీతారామయ్యచౌదరి సేవలను కొనియాడారు. సినీ అభిమానులకు సీతారామయ్య స్ఫూర్తిదాయకం అన్నారు. సినీ గేయ రచయిత తైదల బాబు మాట్లాడుతూ కృష్ణ జీవితచరిత్రను సంపూర్ణంగా సేకరించిన ఘనత సీతారామయ్యదేనన్నారు. అవార్డు గ్రహీత చౌదరి మాట్లాడుతూ లక్షలాది కృష్ణ అభిమానులలో తనను గుర్తించి, సూపర్‌స్టార్ అవార్డుకు ఎంపికచేసిన ఎఫ్‌టిపిసి అధ్యక్షులు చైతన్య జంగా, కార్యదర్శి విజయవర్మలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏఐ సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు వైవీ ఆంజనేయులు తదితరులు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో లామ్‌లోని చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 1న నిర్వహించనున్న జనరేటెడ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ జూనియర్ టెక్నో వర్క్‌షాప్‌కు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. లాంలోని చలపతి ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, ఆశిష్ , బెస్సి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కందుల దుర్గేష్‌కు మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖ

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌కు మావోయిస్టుల పేరుతో లేఖ రావడం కలకలం రేపుతోంది. నీకు, నీ కుటుంబానికి మావోయిస్టుల చేతిలో ప్రాణహాని తప్పదని బెదిరిస్తూ లేఖ రాశారు. సచివాలయంలోని ఆయన పేషీకి సోమవారం ఈ లేఖ అందింది. అయితే ఆలేఖలో ప్రత్యేకమైన డిమాండ్స్ కానీ, స్పష్టమైన ఆరోపణలుగాని చేయలేదని సమాచారం. మావోయిస్టులే అయితే అందులో దుర్గేష్‌పై ఉన్న ఆరోపణలను ఆధారాలతో సహా పేర్కొంటారు. అలాగే హెచ్చరికలతో కూడిన డిమాండ్స్ కూడా ఉంటాయి. చివరగా లేఖ రాసిన మావోయిస్టు పేరు, ఆయన హోదా స్పష్టంగా పేర్కొంటారు. అయితే మంత్రి దుర్గేష్‌కు వచ్చిన ఈ లేఖ మావోయిస్టులు రాసింది కాదని పోలీస్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. మంత్రి దుర్గేష్ నిడదవోలు నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ బెదిరింపు లేఖపై మంత్రి వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాసరావు మంగళవారం తుళ్లూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. వివిధ కోణాలలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో కళ్ళం విద్యార్థులకు 4వ స్థానం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో 4వ స్థానం సాధించినట్లు డైరెక్టర్ మువ్వా ఉమాశంకరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజ్ఞాన్ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో తమ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కళ్ళం భరద్వాజ్ అభినందించారు.

రేపు జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్లను తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఈ నెల 12 సమ్మెను ఉపాధ్యాయ శ్రేణులన్నీ విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు మంగళవారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయం నుంచి శంకర్‌విలాస్ సెంటర్ వరకు ఉపాధ్యాయులు సమ్మె సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఇందులో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కుసుమకుమారి, ప్రచురణ విభాగం చైర్మన్ హనుమంతరావు, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాజశేఖర్ రావు, ఏం.కళాధర్ జిల్లా సహాధ్యక్షురాలు షకీలా బేగం, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, గోవింద్, రంగారావు, ప్రసాద్, కోటిరెడ్డి పాల్గొన్నారు.

● గుంటూరు(తూర్పు): కేంద్ర లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈ నెల 12న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వామపక్షాల, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. నగరంలో బైక్ ర్యాలీ, పోస్టర్లు ఆవిష్కరణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలలో గనిరాజు, హనుమంతురావు, లక్ష్మణరావు, చైతన్య, మాల్యాద్రి, ముత్యాలరావు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

● రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పని గంటల పెంపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చినఆంజనేయులు డిమాండ్ చేశారు. గతంలో ఉన్న 8 పనిగంటల విధానాన్ని అమలుచేయాలని మంగళవారం పాతగుంటూరు, సివిల్ సప్లయీస్ గోడౌన్‌ల వద్ద కార్మికులు నిరసన చేపట్టారు.12న జరిగే సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. నిరసనల్లో రావుల అంజిబాబు, కోట్ల మరియదాసు, కాంతారావు, డేవిడ్, సురేష్, బుజ్జి, బాలకోటేషు, కిరణ్, సురేష్ పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

● గుంటూరు కార్పొరేషన్: ఈ నెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ వసంతరాయపురం శానిటరీ కార్యాలయం వద్ద మల్యాద్రి మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులందరూ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఆయనతోపాటు నగర ఉపాధ్యక్షులు కోటి వీరాంజనేయులు, బండి ప్రసాదు, కోటమ్మ, ఏడుకొండలు, నవీన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు: కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల పిలుపుమేరకు ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ సార్వత్రిక సమ్మెకు ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ సంఘీ భావం ప్రకటించింది. సమ్మెకు సంబంధించి రాష్ట్ర సంఘం మధ్యాహ్న భోజన విరామంలో నిరసనకు పిలిపిచ్చిందని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా కార్యదర్శి శ్యామ్‌సుందర్ శ్రీనివాస్ తెలిపారు. నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మిర్చి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

● మార్కెటింగ్ ప్రాంతీయ జేడీ శ్రీనివాసరావు



యార్డులో తనిఖీలు నిర్వహిస్తోన్న మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, పక్కన డీడీ దివాకర్, సెక్రెటరీ చంద్రిక

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మార్కెటింగ్ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన యార్డులో పర్యటించారు. ఈ ఏడాది సరుకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున అన్ని గేట్లు తెరిచి లోనికి వాహనాలను అనుమతించాలన్నారు. బిడ్డింగ్ పూర్తి కాగానే అదే రోజు సాయంత్రానికల్లా సరుకు యార్డు వెలుపలికి వెళ్లిపోయేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీని వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పారు. గేట్ల వద్ద ఏమైనా రిపేర్లు ఉంటే తక్షణమే చేపట్టాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం మెరుగుపరచాలని, రైతు విశ్రాంతి గదులలో ఆహ్లాదకరమైన వాతావరణం నిరంతరం కొనసాగేలా చూడాలన్నారు. జీరో, కటింగ్ బిజినెస్‌లకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. అలాగే మచ్చుకాయలను ఎవ్వరూ బయటకు తీసుకెళ్లకుండా నిఘా పెంచాలన్నారు. యార్డులోకి ప్రవేశించే ప్రతి ఒక్క మిర్చి టిక్కీని అకౌంట్ ఫర్ చేయడం ద్వారా మార్కెట్ ఫీజు రూపంలో ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు. బిడ్డింగ్‌లో ఎవరైనా ధర తక్కువగా వేస్తే దానిపై పరిశీలన చేయాలని సూచించారు. బిల్-టూ-బిల్ బిజినెస్‌లు కూడా జరగకుండా చూడాలన్నారు. ఏఎంసీ నిబంధనల మేరకు రైతుల వద్ద రెండు శాతం కమీషన్ మాత్రమే వ్యాపారస్థులు తీసుకొనేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ తనిఖీలలో మార్కెటింగ్ డీడీ దివాకర్, మార్కెటింగ్ శాఖ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ.చంద్రిక, ఏడీ సత్యన్నారాయణ చౌదరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాల అసిస్టెంట్‌లకు శిక్షణ



శిక్షణ నిర్వహిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు డీఆర్‌డీఏ-వెలుగు ఆధ్వర్యంలో గ్రామ సంఘాల అసిస్టెంట్లకు జీవనోపాధులపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లాలోని 523 మంది గ్రామ సంఘాల అసిస్టెంట్లు పాల్గొన్నారు. బ్యాంకింగ్, స్త్రీనిధి రికవరీలు, జాబ్స్ విభాగం ద్వారా ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని, ప్రతి గ్రామ సంఘాల అసిస్టెంట్లు జీవనోపాధుల విభాగంలో ముందుండాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి సూచించారు.

సెలూన్‌లకు ఉచిత విద్యుత్ జీవోను సవరించాలి

● గుంటూరు జిల్లా సవితా నాయీ బ్రాహ్మణ సంఘం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సెలూన్‌లకు ఉచిత విద్యుత్ కోసం వెలువరించిన జీవోను వెంటనే సవరించాలని గుంటూరు జిల్లా సవితా నాయీ బ్రాహ్మణ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు గుంటూరులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రావిపాటి వెంకట సాంబయ్య, ప్రధాన కార్యదర్శి వల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్ పథకం క్షేత్రస్థాయిలో అమలు కాకుండా గందరగోళాన్ని సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ జీవో ప్రకారం రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణ సెలూన్ షాపులకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రకటించగా, అర్హతగా సంవత్సర ఆదాయం రూ.75,000లోపు ఉండాలని పేర్కొన్నారని తెలిపారు. అయితే మీ సేవ పోర్టల్‌లో రూరల్, అర్బన్ విభాగాల్లో ఆదాయ పరిమితిని రూ.1,20,000గా చూపిస్తున్నారని, దానివల్ల లబ్ధిదారుల్లో తీవ్ర గందరగోళం, అనుమానాలు నెలకొన్నాయన్నారు. పథకం ఎలా అమలు చేస్తారనే విషయంలో ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడం పరిపాలనా వైఫల్యమని వారు విమర్శించారు. నాయీ బ్రాహ్మణులు కాకుండా ఇతరులు రూ.కోట్ల పెట్టుబడులతో ఆధునిక సెలూన్ షాపులు నిర్వహిస్తూ పోటీ పెంచుతుండటంతో, తరతరాలుగా ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న తాము ఉపాధి కోల్పోయే పరిస్థితికి చేరుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సంప్రదాయ వృత్తిని కాపాడేందుకు, సెలూన్ షాపులను ఆధునీకరించుకునేలా తక్కువ వడ్డీతో ప్రత్యేక రుణాలు వెంటనే మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సంఘం డిమాండ్ చేసింది.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఆయన పట్టాభిపురం, రైలుపేట, ఏటి అగ్రహారం తదితర ప్రాంతాల్లోని మున్సిపల్ పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక హాస్టల్స్‌ను పరిశీలించి వాటిలో గల సౌకర్యాలు, భోజనం వసతులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులందరూ పాస్ అయ్యే విధంగా ప్రభుత్వం ఇచ్చిన ప్రణాళిక ప్రకారం చదివించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు చెక్

● ఐటీ కోర్ సీఐ నిసార్ బాషా

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పూర్తి అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు చెక్ పెట్టవచ్చని సైబర్ క్రైం సీఐ నిసార్ బాషా అన్నారు. ఫైనాన్షియల్ లిటరసీ వీక్-2026 సందర్భంగా జిల్లా లీడ్ బ్యాంకు అధికారులతో కలిసి సైబర్ క్రైం పోలీసులు వివిధ కళాశాలల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఐటీ కోర్ సీఐ నిస్సార్ బాషా, గుంటూరు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, సమన్వయంతో ఈ నెల 9 నుంచి 13 వరకు ఫైనాన్షియల్ లిటరసీ వారం-2026 సందర్భంగా గుంటూరు జిల్లాలోని వివిధ కళాశాలల్లో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో భాగంగా అధికారులు విద్యార్థులకు, అధ్యాపకులకు సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీ కోర్ హెడ్ కానిస్టేబుల్ రాజకిశోర్, ఇతర పోలీస్ సిబ్బంది, వివిధ కళాశాల యాజమాన్యాలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు వేతనాలను పెంచాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం అమరావతి రోడ్డులోని ఐసీడీఎస్ కార్యాలయంలో డైరెక్టర్ వేణుగోపాలరెడ్డికి వినతి ప్రతం అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలు, పెండింగ్‌లో ఉన్న 1,810 మినీవర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్‌గా మార్చాలని, గ్రాట్యూటీ అమలుకు మార్గదర్శకాలు రూపొందించాలని, అంగన్‌వాడీలకు సంక్షేమపథకాలు వర్తింపచేయాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో ప్రజ, గజలక్ష్మి లవతమ్మ, సుబ్బరాయమ్మ పాల్గొన్నారు.

జోయాలుక్కాస్‌లో ఇంటి దొంగ చేతివాటం

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అమరావతి రోడ్డులోగల జోయాలుక్కాస్ దుకాణంలో ఇంటి దొంగ చేతివాటం ప్రదర్శించాడు. అందులో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసే షేక్ నజీర్ షోరూంలోని డైమండ్ నెక్లెస్‌కు ఉన్న బంగారు లింకులను మూడు దఫాలుగా దొంగిలించాడు. రూ.2లక్షల ఖరీదు చేసే 12 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించినట్లు షోరూం మేనేజర్ ప్రదేశ్ ఎంపీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీరనున్న భక్తుల ఇక్కట్లు

● కోటప్పకొండ గిరి ప్రదక్షిణ దారికి రూ.3.80 కోట్లు మంజూరు

- కోటప్పకొండ గిరి ప్రదక్షిణ దారికి రూ.3.80 కోట్లు మంజూరు
- పనులు చేపట్టేందుకు పరిపాలన అనుమతులు జారీ
- పంచాయతీరాజ్‌శాఖ నుంచి నిధులు
- డిప్యూటీ సీఎం పవన్ జోక్యంతో నిధుల కేటాయింపు


గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవాలయం గిరి ప్రదక్షిణ భక్తుల ఇక్కట్లు తీరనున్నాయి. గిరి ప్రదక్షిణ రహదారి అభివృద్ధికి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ నిధులు మంజూరు చేసింది. రూ.3.80 కోట్లు నిధులు మంజూరుతో పాటు పనులు చేపట్టేందుకు పరిపాలనా అనుమతులిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రహదారికి సబంధించిన పనులు పంచాయతీరాజ్‌శాఖ చేపట్టేందుకు ఏర్పాట్లు చేయనుంది.

● గ్రావెల్ రోడ్డులో భక్తుల ఇబ్బందులు

ప్రతి పౌర్ణమి, కార్తికమాసం, మహాశివరాత్రి ముఖ్య పండుగ రోజుల్లో వేలాది మంది భక్తులు శ్రీ త్రికోటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ చేస్తారు. ఏటా భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగు తోంది. సూమరు 8.5 కిమీ పొడవునా ఉన్న ఈ రహదారిలో చిలకలూరిపేట మేజరు కాలువ నుంచి పెట్లూరివారిపాలెం వరకు తారు రోడ్డు ఉంది. అక్కడి నుంచి సుమారు 4.35 కిమీ ఉన్న గ్రావెల్ రోడ్డులో నడిచేందుకు భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలికి చెప్పులు లేకుండా ప్రదక్షిణ చేస్తుండటంతో రాళ్లు గుచ్చుకుంటున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ గ్రావెల్ రహదారిని తారు రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను రూపొందించింది.

● డిప్యూటీ సీఎం జోక్యంతో

కాగా, గత నెల 22న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గిరి ప్రదక్షిణ రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన పవన్ కల్యాణ్ నిధులు మంజూరు చేయించారు. అయితే గిరి ప్రదక్షిణ రహదారిలో కొంత ప్రాంతం అటవీశాఖ కింద ఉంది. రహదారి నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు లభించాల్సి ఉంది. ఇటీవల కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్షలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గిరి ప్రదక్షిణ రహదారిపై చర్చించారు. అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అటవీశాఖ అనుమతులు లభించగానే పనులు చేపట్టేందుకు పంచాయతీరాజ్‌శాఖ టెండరు ప్రక్రియ నిర్వహించనుంది.

వాజ్‌పేయి స్మృతివనం పనులకు శ్రీకారం

- టెండరు ప్రక్రియను ప్రారంభించిన ఏజీఐసీఎల్
- అమరావతిలోని వెంకటపాలెంలో పార్కు నిర్మాణం
- వాజ్‌పేయి విగ్రహంతోపాటు మ్యూజియం, లైబ్రరీ ఏర్పాటు

మంగళగిరి(గుంటూరు), ఫిబ్రవరి 10 (ఆంధ్ర జ్యోతి): రాజధాని అమరావతిలో నిర్మించ తలపెట్టిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి స్మృతి వనం ప్రాజెక్ట్‌కు సంబంధించిన పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా స్మృతివనం నిర్మాణానికి అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏజీఐసీఎల్) టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది. ఈ స్మృతి వనం కేవలం ఒక పార్కులాగా కాకుండా వాజ్‌పేయి జీవితం, విలువలు, సుపరి పాలన, జాతీయ ఐక్యతను ప్రతిబింబించే సజీవ స్మారక చిహ్నంగా ఉండేలా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాంతోపాటు ప్రజలకు విజ్ఞానాన్ని అందించే, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా నిలిచే ఒక ప్రజా వేదికను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. వాజ్‌పేయి విగ్రహం, పీఠంతో పాటు ఎగ్జిబిషన్ కమ్ మ్యూజియం, ఇంటర్‌ప్రి టేషన్ సెంటర్, గ్రంథాలయం, పార్క్ లను ని ర్మించనున్నారు. తొలి దశ పనులను ఏజీఐసీఎల్ ప్రారంభిస్తోంది. డిజైన్-బిల్డ్ పద్ధతిలో ప్రాజెక్టును ఒకే సంస్థకు అప్పగించనున్నారు. ఆ సంస్థే ప్రాజెక్టును డిజైన్ చేసి, నిర్మించి అప్పగించనుంది. టెం డరు పొందే సంస్థ డిజైన్ రూపొందించి, ఖర్చు అంచనాలు సిద్ధం చేసి, నిర్ణీత నాణ్యతా ప్రమాణాల్లో, నిర్ణీత గడువులోపు ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయాలని ఏజీఐసీఎల్ టెండర్లలో పేర్కొం ది. దీని బాధ్యత అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏజీఐసీఎల్), రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ) తీసుకుంటున్నాయి. కిందటేడాది డిసెంబరు 25న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా అమరావతిలోని వెంకటపాలెం గ్రామంలో సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన రాష్ట్ర ప్రభుత్వం స్మృతివనాన్ని ప్రారంభించింది. రెండున్నారెకరాల భూమిని స్మృతివనం కోసం కేటాయించింది.


వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, పెమ్మసాని తదితరులు (పాతచిత్రం)

ఏఎన్‌యూలో దూరవిద్య కోర్సులకు నోటిఫికేషన్

● మార్చి 25 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పీజీ దూర విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. 2026 సంవత్సరానికి సెమిస్టర్ విధానంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) నుంచి 23 పీజీ కోర్సులకు అనుమతి లభిం చిందని సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయల పాటి వేంకటేశ్వర్లు తెలిపారు. పీజీ ఆర్ట్స్‌లో ఎంఏ ఇంగ్లిష్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, సోషల్ వర్క్, జర్నలిజం, హెచ్ఆర్ఎం వంటి 11 కోర్సులు, పీజీ కామర్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్ ఎంకామ్ అకౌంటెన్సీ, బ్యాంకింగ్, ఎంబీఏ జనరల్, లైబ్రరీ ప్రోగ్రామ్స్ మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. పీజీ సైన్స్ విభాగంలో ఎమ్మెస్సీ బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎంసీఏ తదితర కోర్సులలో ప్రవేశం పొందే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. మార్చి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కోర్సుల కాల వ్యవధి, విద్యార్హతలు, ఫీజులు తదితర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ సందర్శించాలని లేదంటే 0863-2346222, 9848477441 నెంబర్లలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

ఉద్యోగాలకు ఏఎన్‌యూ విద్యార్థుల ఎంపిక

● ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ సిటీలలో నియామకం

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) ఇంజనీరింగ్ నాలుగో ఏడాది ఈఈఈ, మెకానికల్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 16 మంది విద్యార్థులు ట్రైనీ ఆపరేటింగ్ ఇంజనీర్లుగా సంవత్సరానికి రూ.2.8లక్షల ప్యాకేజీతో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ సిటీలో ఉద్యోగాలు పొందారు. ఈ సందర్భంగా మంగళవారం పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో వారు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ మహమ్మద్‌తో వచ్చి వీసీ గంగాధరరావు, రెక్టార్ శివరామ్ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య గంగాధరరావు విద్యార్థులను అభినందించారు. వీరితో పాటు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లింగరాజ్, డాక్టర్ బోయపాటి పూర్ణచంద్రశేఖర్, ఈఈఈ విభాగపు సమన్వయకర్త డాక్టర్ ఉమామహేశ్వరి ఉన్నారు.


వీసీ గంగాధరరావు, రెక్టార్ శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలంకు ఎంపికైన దస్త్రాన్ని చూపిస్తున్న విద్యార్థులు

విద్యార్థులను సొంతబిడ్డల్లా భావించాలి

● హాస్టళ్లలో వసతుల విషయంలో రాజీపడొద్దు ● అధికారులకు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆదేశాలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ వసతి గృహాలు, జ్యోతిరావ్‌పూలే గురుకులాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులను సొంతబిడ్డలుగా సంక్షేమ అధికారులు భావించి, వారికి సక్రమంగా డైట్ అమలుతో పాటు, నాణ్యమైన విద్యను అందించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. గుంటూరు ఏపీఎన్జీవో కల్యాణ మండపంలో పది, ఇంటర్ పరీక్షలు, మౌలిక వసతులపై మంగళవారం సంక్షేమ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో మెనూ అమలు, మంచినీటి సరఫరా, పనితీరు ఆదర్శంగా పని చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పది పరీక్షల్లో సీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారు ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొంత మంది నిర్లక్ష్యమైన పనితీరు వల్ల మొత్తం శాఖకే చెడ్డ పేరు వస్తుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ వసతి గృహాల్లో మెనూ అమల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యదర్శి సత్యన్నారాయణ ప్రసంగిస్తూ హాస్టల్ వేల్ఫేర్ ఆఫీసర్ల పనితీరులో మార్పు రావాలన్నారు. అనంతరం మంత్రి బీసీ సంక్షేమ శాఖ మినిస్టీరియల్ సర్వీసెస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు డైరెక్టర్ మాధవీలత, జాయింట్ డైరెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖరరాజు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి మయూరి తదితరులు పాల్గొన్నారు.



బీసీ సంక్షేమశాఖ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఎస్ సవిత

అభివృద్ధి చూసి ఓర్వలేక డైవర్షన్ రాజకీయాలు

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేకే మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని మంత్రి ఎస్ సవిత తెలిపారు. సమీక్ష అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఒకవైపు కల్తీ నెయ్యి, మరోవైపు మద్యం కుంభకోణం వివాదాలు చుట్టుముడుతున్న సమయంలో జగన్ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. నాడు గుర్తుకురాని కులాలు ఇప్పుడే ఎందుకు గుర్తుకు వచ్చాయని జగన్‌పై ధ్వజమెత్తారు. సీఎంగా జగన్మోహన్ రెడ్డి ఉన్న సమయంలో ఆరు కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి హెలికాప్టర్ ఎందుకు వాడారని, ఇప్పుడు గంటల తరబడి పరామర్శలు పేరుతో ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. చంద్రబాబును ఎందుకు దూషించారని ప్రశ్నించిన బీసీ మహిళా ఎమ్మెల్యే గళ్లా మాధవిపై అనుచిత వ్యాఖ్యలు చేసి దాడికి వైసీపీ శ్రేణులు ప్రయత్నించడం సబబేనా అన్నారు.

అసెంబ్లీ సమావేశాలకు పటిష్ఠ బందోబస్తు

● సిబ్బంది అప్రమత్తతతో విధులు నిర్వహించాలి ● అధికారులు, సిబ్బందికి ఎస్పీ వకుల్ జిందాల్ నిర్దేశం


అధికారులు, సిబ్బందికి అసెంబ్లీ సమావేశాల బందోబస్తు నిర్వహణపై దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్


గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ సమావేశాలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం తుళ్లూరు డీఎస్పీ కార్యాలయంలో సౌత్ కోస్టల్ జోన్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠితో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా అధికారులు, సిబ్బందికి బందోబస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. బందోబస్తుకు హాజరయ్యే ప్రతి ఒక్క పోలీస్ అధికారి తమకు కేటాయించిన సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు తమ విధి నిర్వహణ ప్రదేశంలో ఏదైనా అనుకోని సంఘటన జరిగితే వెంటనే కమాండ్ కంట్రోల్ కేంద్రానికి సమాచారం అందించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వీవీఐపీ, వీఐపీలు హాజరయ్యే అసెంబ్లీ సమావేశాలు అత్యంత సున్నితమైనందున బందోబస్తు విధులను అప్రమత్తతతో నిర్వహించాలని సూచించారు. ఏదైనా సెక్టార్‌లో ఆకస్మిక ఘటన జరిగితే పక్క సెక్టార్‌లకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి సహకరించాలని ఆదేశించారు. సచివాలయానికి వీవీఐపీ, వీఐపీలు రాకపోకలు సాగించే మార్గాలను ముందుగానే క్లియర్‌గా ఉంచి, ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై అక్రమ పార్కింగ్ లేకుండా నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. సున్నిత ప్రాంతాలలో ప్రత్యేక భద్రత బృందాలతో తనిఖీలు నిర్వహించి తగిన ముందస్తు భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అసెంబ్లీ సమావేశ మందిరానికి వీవీఐపీ, వీఐపీలు, మీడియా ప్రతినిధులు, సందర్శకులు ప్రవేశించే అన్ని గేట్లకు డీఎస్పీ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించామని, సంబంధిత అధికారులను తమకు కేటాయించిన గేట్ల ద్వారా మాత్రమే అనుమతించాలని స్పష్టం చేశారు. వాహనాలను సక్రమంగా పార్కింగ్ చేయిస్తూ ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని, అవసరమైన చోట్ల చిహ్నాలు ఏర్పాటు చేయాలని సూచించారు. బందోబస్తు విధులకు హాజరయ్యే పోలీస్ అధికారులు, సిబ్బంది బాడీ వోర్న్ కెమెరాలు ధరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు.

● నేడు అసెంబ్లీకి గవర్నర్, సీఎం

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడు బుధవారం అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారని ఎస్పీ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం సీఎం చంద్రబాబు అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారని చెప్పారు. వీరి పర్యటనలను దృష్టిలో ఉంచుకొని, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా భద్రత ఏర్పాట్లు నిర్వహించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీలు ఏటీవీ రవికుమార్, ఏ.హనుమంతు, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాస్, తుళ్లూరు సీఐ శ్రీనివాసరావు, ఇతర డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కాకాని శివాలయ పాలకమండలి నియామకం

● ఆలయ చైర్మన్‌గా పూర్ణచంద్ర ఎన్నిక లాంఛనమే


పెదకాకాని శివాలయం

పెదకాకాని, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి ఆలయ పాలకమండలిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం జీవో 228ని జారీ చేసింది. పాలకవర్గంలో 13 మంది నియమితులయ్యారు. చేబ్రోలు వెంకట భాస్కరపున్నారావు, కంభంపాటి వెంకయ్య, క్రోసూరు పూర్ణచంద్రరావు, కొమ్మూరి మల్లికార్జునరావు, బైరపనేని ధనలక్ష్మి, కొండా లత, ధూపాటి శివశంకరరావు, వడ్లమూడి సువర్ణలక్ష్మి, ఉల్లం రాజేశ్వరి, బండారు మల్లేశ్వరి, వరికుటి వీర సుధాకర్, బాణావత్ మంగమ్మ, పాముదుర్తి నాగలక్ష్మి తదితరులు పాలకవర్గంలో ఉన్నారు. కాగా వీరిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. ఎమ్మెల్యే నరేంద్రకు ముఖ్య అనుచరుడిగా, పెదకాకానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, బీసీ సామాజిక వర్గానికి చెందిన పూర్ణచంద్రరావును చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. గతంలో ఒక పర్యాయం పాలకవర్గ సభ్యుడిగా ఎంపిక చేసినప్పటికీ ఆయన అప్పట్లో సున్నితంగా తిరస్కరించారు. ఈ మారు చైర్మన్‌గా ఆయనను ఎన్నుకోనున్నారు.

కోటప్పకొండలో ఏర్పాట్లు వేగవంతం

(5వ పేజీ తరువాయి)

మేజర్ వద్ద స్నాన ఘట్టాలు నిర్వహించనున్నారు. వైద్య శిబిరాల ఏర్పాటులో వైద్యఆరోగ్య శాఖ నిమగ్నమైంది.

మారిన బస్టాండ్

ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా ఏటా ఏర్పాటు చేసే తాత్కాలిక బస్టాండ్‌ను ఈ సారి ఘాట్ రోడ్డు పక్క స్థలంలోకి మార్చారు. నరసరావుపేట, వినుకొండ ప్రాంతాల నుంచి వచ్చే బస్సు లు ఘాట్ రోడ్డు పక్కన స్థలంలో నిలిపేవారు. ఈ సారి పెట్లూరివారిపాలెం రోడ్డులో కొండ వెనుక భాగంలో తాత్కాలిక బస్టాండ్‌ను ఆర్టీసీ ఏర్పాటు చేస్తోంది. దీంతో భక్తులు కొండ పైకి వెళ్లే బస్సుల కోసం దాదాపు కిలోమీటరు దూరం నడిచివెళ్లాల్సి వస్తుంది.

ఆన్‌లైన్‌లో టిక్కెట్ల విక్రయం

స్వామి దర్శనం లేని సమయంలో దేవదాయ శాఖ వీఐపీ దర్శనం టిక్కెట్లు ఆన్‌లైన్‌లో ఈ సారి విక్రయిస్తుంది. 15న తెల్లవారుజామున టైం స్లాట్‌లో టిక్కెట్లు విక్రయిస్తున్నారు. నరసరావు పేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దంపతులు ఒంటి గంట స్లాట్‌లో టిక్కెట్లు కొను గోలు చేశారు. రూ.300 వీఐపీ దర్శనం టిక్కెట్ల విక్రయాలకు పది స్లాట్లు ఏర్పాటు చేశారు. ఒక్కో స్లాట్‌లో 200 టిక్కెట్ల చొప్పున విక్రయాలు జరిగాయి.

ప్రభల మార్గం మార్చాలి..

నరసరావుపేట వైపు నుంచి సాధారణ ప్రభలు రాత్రి వేళలో కొండకు యల్లమందరోడ్డులో వస్తాయి. ఆ సమయంలోనే చిలకలూరిపేట మేజర్ వద్ద ఏటా ట్రాఫిక్ స్తంభిస్తుంది. ఈ పరిస్థితుల్లో చిలకలూరిపేట మేజర్‌పై ఐరన్ బ్రిడ్జి మీదగా ప్రభలను తరలిస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందని ఈ దిశగా పోలీసులు చర్యలు తీసుకోవాలని భక్తులు సూచిస్తున్నారు.

వీఐపీ దర్శనం టిక్కెట్ల కోటా పెంపు : కలెక్టర్ కృతికాశుక్లా

వీఐపీ దర్శనం టిక్కెట్లను పెంచాలని ఈవోను కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సమీక్ష సమయానికి దర్శనం టిక్కెట్లు అయిపోయాయి. ఒక్కరోజులోనే 2 వేల వీఐపీ దర్శనం టిక్కెట్లను భక్తులు కొనుగోలు చేశారు. ఈ క్రమంలో మరో 4 వేల టిక్కెట్లను పెంచాలని కలెక్టర్ సూచించారు. కాగా 2 వేల టి క్కెట్లను బుధవారం ఉదయం 10 గంటల నుంచి అందుబాటులోకి తెస్తామని ఈవో తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏ ర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రభల తరలిం పునకు కరెంటు వైర్లు తాకకుండా చర్యలు తీసుకో వాలన్నారు. గత ఏడాది కంటే భక్తుల సంఖ్య పె రిగే అవకాశం ఉందని అందుకు తగ్గట్లుగా ఏర్పా ట్లు ఉండాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో ఎస్పీ కృష్ణారావు, అధికా రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

యాప్‌తో రైతులకు డ్రోన్ సేవలు

● వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

క్రోసూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో ప్రధానమైన సస్యరక్షణ మందుల పిచికారికి ప్రభుత్వం రూపొందించిన ఉబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్ యాప్ అత్యంత ఉపయోగకరం కానుంది. రైతులు డ్రోన్ ద్వారా మందులు పిచికారి చేసుకునేందుకు ఈ యాప్‌తో అవకాశం లభిస్తుంది. సెల్ ఫోన్ల ద్వారా క్యాబ్‌లు, బైక్‌లు బుక్ చేసుకున్నట్లే రైతులు డ్రోన్ సేవలను బుక్ చేసుకొనే విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. సెల్‌ఫోన్‌లలో ప్లే స్టోర్‌లోకి వెళ్ళి ఉబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని డ్రోన్ సేవలు పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన డ్రోన్ దీదీ యాప్ లేదా వాల్ పోస్టర్లలో ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి డ్రోన్ సేవలు పొందవచ్చని వారు సూచిస్తున్నారు. రైతులు తమ పేర్లను యాప్‌లో రిజిస్టర్ చేసుకోవటంతో పాటు డ్రోన్ సమకూర్చే వారు లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. మొత్తం 61 డ్రోన్‌ల వివరాలు యాప్‌లో లభ్యమ వుతాయని అధికారులు తెలిపారు. డ్రోన్ వినియోగంపై జిల్లావ్యాప్తంగా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. డ్రోన్‌కు అమర్చే కెమేరాతో పంటల ఫోటోలు తీయటం, తెగుళ్ళు గుర్తించటం సులభమవుతుందని, కేవలం పావు గంటలోనే ఎకరా విస్తీర్ణంలో ఎరువులు, పురుగు మందులు పిచికారి చేయవచ్చని పేర్కొంటున్నారు. తద్వారా కూలీల సమస్యను అధిగమించడం, సమయం, ఖర్చు ఆదాతో రైతులకు కలసి వస్తుందని అధికారులు చెబుతున్నారు.


డ్రోన్‌ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్ ఫోటో)

ఆంధ్రజ్యోతి 9
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 11 ఫిబ్రవరి 2026



కలర్‌ఫుల్ క్రిస్టల్స్

తళతళ మెరిసే క్రిస్టల్ జ్యువెలరీకి సర్వత్రా ఆదరణ పెరుగుతోంది. భిన్నమైన రంగులు, వినూత్నమైన డిజైన్లలో రూపొందే ఈ జ్యువెలరీ గురించిన మరిన్ని ఆసక్తికరమైన విశేషాలు...

బంగారం ధర కొండెక్కి కూర్చుంది. అలాగని ఆభరణాల జోలికి వెళ్లకుండా ఉండలేం కదా! అందుబాటు ధరల్లో ఆకట్టుకునే జ్యువెలరీ కోసం వెతుక్కుంటాం. ఆ కోవకి చెందినదే క్రిస్టల్ జ్యువెలరీ! సహజసిద్ధ క్వార్ట్జ్ క్రిస్టల్స్, జెమ్‌స్టోన్స్ లేదా హై క్వాలిటీ లెడ్ జోడించిన గాజుతో క్రిస్టల్ జ్యువెలరీ తయారుచేస్తారు. వజ్రాలకు బదులుగా అదే మెరుపుతో అత్యంత తక్కువ ధరలో దొరికే క్రిస్టల్ ఆభరణాలు పలు రంగుల్లో, రూపాల్లో దొరుకుతూ ఉంటాయి.





డైలీ వేర్‌గా...

భారీ క్రిస్టల్ ఆభరణాలు వేడుకలకు బాగుంటాయి. అలాగే వీటిలో డైలీ వేర్ జ్యువెలరీ కూడా ఉంటాయి. సన్నని రోల్డ్‌గోల్డ్ చైన్‌కు క్రిస్టల్ లాకెట్ జోడించి, అవే క్రిస్టల్స్‌తో కూడిన స్టడ్స్‌ను డైలీ వేర్‌గా ఎంచుకోవచ్చు. లేదంటే చిన్న సైజు క్రిస్టల్స్‌తో తయారైన నాజూకు నెక్లెస్ సెట్‌ను ఎంచుకోవచ్చు.



పలు రకాల రంగుల్లో...

క్రిస్టల్స్ అన్ని రంగుల్లో రూపొందుతూ ఉంటాయి. కాబట్టి దుస్తులకు మ్యాచ్ అయ్యే హారాల సెట్‌ను ఎంచుకోవచ్చు. ప్రత్యేకించి, గులాబీ, ఆకుపచ్చ, ఎరుపు, తెలుపు క్రిస్టల్స్ ఎక్కువ ఆకర్షణీయంగా ఉంటాయి. ఒకే రకమైన క్రిస్టల్ హారాలు ఎంచుకోవచ్చు లేదా మల్టీ కలర్ క్రిస్టల్ హారాలను కూడా ఎంచుకోవచ్చు. దేన్ని ఎంచుకున్నా దుస్తులకు చక్కగా మ్యాచ్ అయ్యేలా చూసుకోవాలి.





భిన్నమైన రూపాల్లో...

నెక్లెస్, బ్రేస్‌లెట్, లాంగ్ చైన్... ఇలా క్రిస్టల్స్‌తో పలు రకాల ఆభరణాలు రూపొందుతూ ఉంటాయి. సందర్భాన్ని బట్టి నచ్చిన నగ ఎంచుకోవచ్చు. బంగారాన్ని తలపించే గోల్డ్ కలర్ బీడ్స్‌తో కలిపి అల్లుకునే క్రిస్టల్ హారాలు సంప్రదాయ వస్త్రధారణకు చక్కగా సూటవుతాయి. భారీ లాకెట్‌తో కూడిన లేయర్ క్రిస్టల్ హారాల సెట్స్, పెళ్లిళ్లు, పండుగ వేడుకల్లో అందర్నీ ఆకట్టుకుంటాయి. కాబట్టి ఒకటికి మించిన వరుసల హారాలు, లావుపాటి క్రిస్టల్ నెక్లెస్‌లను వేడుకలకు పరిమితం చేయాలి.

సెలెబ్ ఫిట్

పెద్దల నడక తడబడకుండా..

సుప్రసిద్ధ నటి హెలెన్ డాన్స్ నంబర్స్ గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. కారవాన్ నుంచి షోలే వరకూ ఆమె నటించిన ప్రతి పాటా ఒక సంచలనమే! ప్రస్తుతం 86 ఏళ్ల వయసులో కూడా అంతే చురుగ్గా వ్యాయామాలు చేస్తూ తనలోని డాన్సర్‌ను సజీవంగా ఉంచుకుంటున్నారామె! ముదిమి వయసులో ఆమె అనుసరిస్తున్న వ్యాయామ నియమాలు, ప్రయోజనాల గురించి తెలుసుకుందామా?





86 ఏళ్ల వయసులో వ్యాయామం చేసేవాళ్లను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. పెద్ద వయసులో వ్యాయామం అవసరం ఎంత? అన్న ప్రశ్నకు హెలెన్ ఆసక్తికరమైన సమాధానమిచ్చారు. 'వ్యాయామం నాలో ఉత్సాహాన్ని పెంచుతుంది. పూర్తి ఆరోగ్యానికి కూడా దోహదపడుతుంది. నా శరీరం వ్యాయామాన్ని ఇష్టపడుతుంది. వ్యాయామంతో సంతులనం సాధించడంతో పాటు నడక మీద ఏకాగ్రత పెరుగుతుంది' అంటున్నారు హెలెన్. క్రమం తప్పకుండా వ్యాయామం చేసే వృద్ధుల్లో నడక పట్టుతప్పడం, తూలడం లాంటి ఇబ్బందులు తలెత్తవు. శరీరం మీద ఇలాంటి పట్టు పెంచుకోవడం కోసం హెలెన్ క్రమం తప్పకుండా అనుసరించే కొన్ని తేలికపాటి వ్యాయామాలు ఏవంటే...

- **స్టాండ్ టు సిట్:** కాళ్లు, చీలమండలాల మీద బరువు మోపుతూ లేచి నిలబడడమే సిట్ టు స్టాండ్. సాధారణంగా పెద్దలు కుర్చీలో నుంచి లేచి నిలబడేటప్పుడు హ్యాండ్ రెస్ట్‌ల మీద చేతులుంచి వాటి ఆధారంగా లేచి నిలబడతారు. బదులుగా సిట్ టు స్టాండ్ పద్ధతిని సాధన చేయడం వల్ల, శరీరం మీద పట్టు పెరుగుతుంది
- **హీల్ రైజెస్:** చీలమండల కదలికలకు ఎంతో కీలకమైన వ్యాయామమిది. నిలబడిన భంగిమలో, మడమలను పైకి లేపి కిందకు దింపాలి. ఈ వ్యాయామం చేస్తున్నప్పుడు చేతికి ఆసరా కావాలనుకుంటే కుర్చీ మీద చేతులుంచి మడమలను పైకి లేపి దింపవచ్చు.
- **బ్రిడ్జెస్:** నేల మీద వెల్లకిలా పడుకుని, మోకాళ్ల మడవాలి. తర్వాత నెమ్మదిగా నడుమును పైకి లేపి దింపాలి. నడుమును పైకి లేపేటప్పుడు మెడ కంటే ఎత్తుకు తీసుకువెళ్లవలసిన అవసరం లేదు.
- **మార్చింగ్:** బ్రిడ్జెస్ భంగిమలోనే ఉండిపోయి, ఒక మోకాలిని పొట్ట దగ్గరకు లేపి, తిరిగి నేల మీద ఆనించాలి. తర్వాత రెండో కాలిని కూడా ఇలాగే కదిలించాలి.
- **వాల్ పుషప్:** గోడ ఎదురుగా నిలబడి రెండు అరచేతులను , భుజాల కంటే దిగువకు గోడ మీద ఉంచి పుషప్స్ చేయాలి. ఈ వ్యాయామం చేసేటప్పుడు కాళ్లను గోడకు దూరంగా ఉంచి, మోచేతులను మడుస్తూ ముందుకు వంగి లేస్తూ ఉండాలి.

కృషికి దక్కిన విజయం

పుస్తకాలు కొనడానికి కూడా నోచుకోని పేదరికం... అడుగడుగునా అవరోధాలు, ఎన్నెన్నో అవమానాలు... ప్రతికూల పరిస్థితులన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొని... నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించారు నంద్యాల జిల్లాకు చెందిన ఇట్టే విజయలక్ష్మి. ఉదయం వ్యవసాయ కూలి పనులు చేస్తూ... రాత్రంతా పట్టుదలతో చదివి గ్రూప్-2లో విజయం సాధించారు. తనను చిన్నచూపు చూసిన చోటే సత్కారాలు అందుకుంటున్న విజయలక్ష్మి స్ఫూర్తిమంతమైన ప్రయాణం ఇది...

"మాది నంద్యాల జిల్లా రుద్రవరం మండలం యల్లావత్తుల గ్రామం. మా తల్లిదండ్రులకు అయిదుగురు సంతానం. నేను ఆఖరుదాన్ని. చిన్న వయసు నుంచి చదువంటే నాకు ప్రాణం. నా తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. వారి కష్టాలను చూసి... ప్రైవేట్ స్కూల్‌లో చదవాలనే నా కోరికను చంపుకొన్నాను. అయిదో తరగతి వరకూ యల్లావత్తుల స్పెషల్ స్కూలులో, ఆరు నుంచి పదో తరగతి వరకు యల్లావత్తుల జిల్లాపరిషత్ హైస్కూలులో, ఇంటర్మీడియెట్ నంద్యాలలోని ప్రభుత్వ కళాశాలలో నా చదివాను. కొన్ని సందర్భాల్లో పుస్తకాలు కొనేందుకు కూడా డబ్బు ఉండేదికాదు. అయినా పట్టుదల వదల్లేదు. తరగతిలో అందరికన్నా ముందుండేదాన్ని. ఇంటర్ తరువాత నంద్యాలలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చేశాను.

కోచింగ్ మధ్యలో ఆపేశా...

డిగ్రీలో ఉండగా... మా గ్రామానికే చెందిన సాలు చెన్నయ్యతో పరిచయమయింది. అది ప్రేమగా మారింది. దీంతో అన్ని వైపులనుంచి చిక్కులు ఎదురయ్యాయి. ఊరివారి మాటలు నన్ను కుంగదీశాయి. చివరకు అందరినీ ఎదిరించి... 2018లో పెళ్లి చేసుకున్నాం. నా భర్త ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవారు. సొంత ట్రాక్టర్ కొనాలని కోరిక. దానికోసం ఇద్దరం ఎంతో కష్టపడ్డాం. నేను కూలిపనులకు వెళ్లేదాన్ని. అలా కొన్నాళ్లు శ్రమించి... ట్రాక్టర్ కొన్నాం. నా భర్త విద్యావంతుడు కాదు. కానీ నాలో ప్రతిభను గుర్తించి... గ్రూప్స్ రాయాలని ప్రోత్సహించారు. డబ్బు పోగుచేసి, నన్ను గ్రూప్-2 కోచింగ్ కోసం హైదరాబాద్ పంపించారు. అక్కడ హాస్టల్‌లో ఉండి, శిక్షణ తీసుకొనేదాన్ని. అంతా సవ్యంగా సాగుతూ ఉండగా... 2023లో నా భర్తకు యాక్సిడెంట్ అయింది. మా ఊరు నుంచి నంద్యాలకు వెళ్తుండగా... ఆయన్ని ఆటో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. దాంతో కోచింగ్ మధ్యలోనే ఆపేసి మా ఊరు వచ్చేశాను.



తొలి ప్రయత్నంలోనే...

అప్పటినుంచి కూలి పనులు చేస్తూ నా భర్తకు సపర్యలు చేశాను. ఆయన కోరిక మేరకు గ్రూప్-2 కోసం సన్నద్ధతను కొనసాగించాను. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పనులకు వెళ్లేదాన్ని. ఇంటికి వచ్చాక, వంట పని, ఇంటి పనులు ముగించుకొని... అర్ధరాత్రి వరకూ చదివేదాన్ని. మళ్లీ తెల్లవారుజామునే లేచి... అల్పాహారం, మధ్యాహ్నానికి భోజనం తయారు చేసి, పనికి బయలుదేరేదాన్ని. ఒక వారమో, ఒక నెలో కాదు... కొన్ని నెలలు దీక్షగా దీన్ని కొనసాగించాను. వేసవి కాలంలో వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి కూలీగా మారి, మట్టి పనులకు వెళ్లాను. ఆ సమయంలోనూ నా దినచర్యలో గ్రూప్-2 ప్రిపరేషన్‌ను భాగం చేసుకున్నాను. ఇతరుల నుంచి తీసుకున్న న్యూస్ పేపర్లను, అకాడమీ పుస్తకాలను చదివేదాన్ని. ఆన్‌లైన్‌లో చూసి సొంతంగా నోట్స్ తయారు చేసుకొనేదాన్ని. డిప్యూటీ తహసీల్దార్ కావాలనేది నా లక్ష్యం. దానికోసం రోజూ 8 గంటలకు పైగా చదువు మీదనే దృష్టి పెట్టాను. తొలి ప్రయత్నంలోనే గ్రూప్-2 సాధించాను. రాష్ట్ర సచివాలయంలో అసిస్టెంట్ సెక్షన్ అధికారి (ఏఎస్‌ఓ)గా కొలువు సంపాదించాను."

ఎప్పటిలాగానే పనికి వెళ్తున్నా...



ఒకప్పుడు ఎక్కడ అవమానాలు ఎదుర్కొన్నానో ఇప్పుడు అక్కడే ప్రశంసలు అందుకుంటున్నాను. మా గ్రామస్తులు నన్ను సన్మానించారు. ప్రతి ఇంటికీ నన్ను పిలిచి... నన్ను ఆదర్శంగా తీసుకోవాలని పిల్లలకు చెబుతున్నారు. తమతో కలిసి పని చేసిన వ్యక్తి ఉన్నత ప్రభుత్వోద్యోగం సాధించిందంటూ నా తోటి కూలీల ఆనందానికి అవధులు లేవు. నా భర్త సహకారంతోనే అది సాధ్యమయింది. అతని కళ్లలో ఆనందం కోసం, నా తల్లిదండ్రులకోసం ఇదంతా చేశాను. జీవితంలో ఇబ్బందులు సహజం. ఇబ్బందులను ఎదుర్కొని, లక్ష్యాన్ని చేరుకున్నప్పుడు కష్టాలన్నిటినీ మరచిపోతాం. కష్టం వచ్చినప్పుడు కుంగిపోవడం, గెలిచినప్పుడు పొంగిపోవడం కాదు... ఎప్పుడూ ఒకేలా ఉండాలి. నాకు ఉద్యోగం వచ్చినట్టు సమాచారం అందినా... ఎప్పటిలాగానే పనికి వెళ్తున్నాను. ఉద్యోగంలో చేరేవరకూ కొనసాగిస్తాను. ఆ తరువాత కూడా ఖాళీ దొరికినప్పుడు వ్యవసాయ పనులు చేస్తూనే ఉండాను."

● **చల్లా నవీన్ కుమార్ చౌదరి**, కర్నూలు

సంకల్పం

ఎవరికీ పట్టనివారు ఆమెకు కావల్సినవారు

పదహారేళ్ల వయసులో ఒక దృశ్యం... ఆమెను తీవ్రంగా కలచివేసింది. అదే డాక్టర్ కావాలనే బలమైన సంకల్పాన్ని కలిగించింది. ఆ తరువాత అనేకమంది జీవితాలకు భరోసానిచ్చింది. ఎవరికీ పట్టనివారు తనకు కావల్సినవారంటూ సామాజిక బాధ్యతను భుజానికెత్తుకున్న 62 ఏళ్ల డాక్టర్ రేణుక రామకృష్ణన్ జర్నీ ఇది.



"కొన్ని సంఘటనలు మనపై బలమైన ముద్ర వేస్తాయి. ఒక్కోసారి అవి మన జీవన పయనాన్ని కూడా మార్చేస్తుంటాయి. అలాంటిదే పదహారేళ్లప్పుడు నా జీవితంలోనూ చోటు చేసుకుంది. తమిళనాడులోని ఆలయాల నిలయమైన కుంభకోణం మాది. అక్కడ ఏటా భారీ ఎత్తున ఉత్సవం జరుగుతుంటుంది. వేలాది మంది భక్తులు పాల్గొంటారు. భక్తుల మేళతాళాలు, ఊరేగింపులతో పట్టణం కిక్కిరిసిపోయింది. ఆ జనసందోహంలో ఓ వృద్ధుడు రోడ్డు పక్కన నిర్జీవంగా పడివున్నాడు. నా చూపు అటువైపు మళ్లింది. ఆరా తీస్తే కుష్టు వ్యాధితో మరణించాడని తెలిసింది. అతడిని ఎవరూ పట్టించుకోవడంలేదు. దగ్గరకు వెళ్లేందుకు కూడా సాహసించలేదు. అది నన్ను తీవ్రంగా కలచివేసింది. వేగంగా అటువైపు అడుగులు వేశాను. అతడి శరీరంపై నా దుపట్టా కప్పాను. ఎవరు ఎలా బతికినా మరణించినవారికి గౌరవంగా వీడ్కోలు పలకాలనేది నా అభిప్రాయం. అందుకే ఆ నిర్జీవ శరీరానికి అంతిమ సంస్కారాలు చేయాలని అనుకున్నాను. కానీ ఎవరూ సాయం రాలేదు. దాంతో నా భుజాలపై వేసుకుని దగ్గర్లోని శ్మశానానికి వెళ్లాను. అక్కడ కుష్టు రోగికి దహన సంస్కారాలు చేయడానికి నిరాకరించారు. ఎలాగో వారిని ఒప్పించాను. ఓ పెద్దాయన సహకారంతో కార్యక్రమం కానిచ్చాను.

అప్పుడే నిర్ణయించుకున్నా...

ఇంటికి వచ్చాక చాలా రోజులు ఆ సంఘటనే నా మనసులో మెదిలింది. నిద్ర పట్టేది కాదు. ఇలాంటివి పునరావృతం కాకూడదంటే ఏంచేయాలి? ఇవే ఆలోచనలు. ఒకరోజు నిర్ణయించుకున్నా... వైద్య విద్య చదవాలని. డాక్టర్‌ని అయితే అందరిలో అవగాహన పెంచవచ్చు. రోగులకు తగిన వైద్యం అందించవచ్చని. పట్టుదలగా చదివాను. ఎంబీబీఎస్‌లో ర్యాంకు సాధించడమే కాదు, సంబంధిత సబ్జెక్టులో స్పెషలైజేషన్ కూడా చేశాను. ప్రస్తుతం సీనియర్ కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్‌గా, లెప్రాలజిస్ట్‌గా సేవలు అందిస్తున్నాను.

లివింగ్ మదర్ థెరిసా...

ఒక వైద్యురాలిగా, సామాజిక కార్యకర్తగా, ఇల్లాలిగా, తల్లిగా... ఇలా ఒక మహిళ బహుముఖ పాత్రలు పోషించడం అంత సులువు కాదు. కానీ అన్నిటినీ సమన్వయం చేసుకొంటూ ముందుకు వెళుతున్నా. అలాగే మోటివేషనల్ స్పీకర్‌గా కూడా విద్యా సంస్థలకు వెళుతుంటాను. పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి వృద్ధ, అనాథ ఆశ్రమాలను సందర్శిస్తుంటాను. వారికి అవసరమైన వైద్య సాయం అందిస్తుంటాను. సమాజం పట్టించుకోని, దూరం పెట్టిన వారికి ఆర్థిక సాయం అందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాను. ఇందుకు గానూ నాకు రెండు వందలకు పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. నాపైన కొన్ని డాక్యుమెంట్లు కూడా తీశారు. 'లివింగ్ మదర్ థెరిసా' అంటూ నన్ను కొందరు కీర్తిస్తుంటారు. ఆ పిలుపు నాకు ఎంతో ప్రేరణనిస్తుంది.

అన్నిటికన్నా సంతృప్తి కలిగించే అంశం ఏంటంటే... నా ప్రయత్నంవల్ల తమిళనాడులో కుష్టు వ్యాధి కేసులు గణనీయంగా తగ్గడం. కానీ ఈ వ్యాధి లేని సమాజాన్ని చూసినప్పుడే నాకు నిజమైన సంబరం."

ఆయన చూపిన మార్గం...



నాడు మరణించి కూడా ఆ వృద్ధుడు నాకు సందేశం ఇచ్చినట్టు అనిపించింది... సేవా మార్గంలో పయనించమని. అందుకే వైద్య వృత్తిని ఎంచుకున్నాను. కుష్టుతో పాటు హెచ్‌ఐవీ బాధితులకు కూడా ఉచిత వైద్యం అందిస్తున్నాను. వారి పట్ల సమాజం దృష్టి కోణాన్ని మార్చే ప్రయత్నం నాది. ఈ కార్యక్రమాలన్నిటి కోసం 'మంగళం చారిటబుల్ ట్రస్ట్' నెలకొల్పాను. దానికి ఎండీగా, 'రోటరీ క్లబ్' సభ్యురాలిగా నిత్యం ప్రజలతో మమేకం అవుతున్నాను. 'చికిత్స కంటే నివారణ మంచిద'ని నమ్ముతాను. ఈ సందేశాన్ని నలుమూలలకూ తీసుకువెళ్లడానికి ఇప్పటివరకు వందల సంఖ్యలో ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహించాను. బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సులు, రక్తదాన, మెడికల్ స్క్రీనింగ్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాను.

నగుమోము కోసం

మేకప్ సహజంగా, ఎక్కువసేపు ఉండాలంటే ఈ చిట్కాలు పాటించండి.



- **ప్రైమర్ వాడకం:** మేకప్‌కు ముందు ప్రైమర్ వాడటం వల్ల చర్మంపై ఉండే రంధ్రాలు కనబడకుండా ఉంటాయి. అంతేకాదు, మేకప్ రోజంతా తాజాగా ఉంటుంది.
- **సరైన ఫౌండేషన్ ఎంపిక:** ఫౌండేషన్ రంగును ఎప్పుడూ దవడ ఎముక దగ్గర చెక్ చేయాలి. అది మీ చర్మం రంగులో కలిసిపోతే మీకు అది సరైన షేడ్ అనుకోవాలి.
- **బ్లెండింగ్ ముఖ్యం:** బ్యూటీ బ్లెండర్ లేదా బ్రష్ వాడి మేకప్‌ను ఎంత బాగా బ్లెండ్ చేస్తే అంత నేచురల్ లుక్ వస్తుంది. లేదంటే ముఖం పగుళ్లు వచ్చినట్టు కనిపిస్తుంది.
- **కాన్సీలర్ ట్రిక్:** కళ్ల కింద నలుపును కవర్ చేయడానికి కాన్సీలర్‌ను 'వి' షేప్‌లో అప్లై చేయాలి. దీనివల్ల ముఖం లిఫ్ట్ అయినట్టు కనిపిస్తుంది.
- **సెట్టింగ్ స్ప్రే:** మేకప్ అంతా పూర్తయ్యాక సెట్టింగ్ స్ప్రే వాడటం మర్చిపోవద్దు. ఇది మేకప్ చెమట వల్ల కారిపోకుండా కాపాడుతుంది.
- **లిప్‌లైనర్:** లిప్‌స్టిక్ వేసే ముందు అదే రంగు లిప్‌లైనర్‌తో అవుట్‌లైన్ గీస్తే లిప్‌స్టిక్ పెదవుల బయటకు రాకుండా నీట్‌గా ఉంటుంది.

డైనింగ్ టేబుల్ వద్ద
నో గాడ్జెట్ రూల్

భోజనం చేసేటప్పుడు ఫోన్లు, టీవీలు చూడటం వల్ల పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. దీనిని అరికట్టేందుకు ఇలా చేయండి.



- **మైండ్‌ఫుల్ ఈటింగ్:** ఆహారం రంగు, రుచి, వాసనను ఆస్వాదిస్తూ తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. గాడ్జెట్స్ చూస్తూ తింటే పిల్లలు అతిగా తినడం లేదా అసలు తినకపోవడం జరుగుతాయి.
- **సంభాషణలకు ప్రాధాన్యం:** భోజన సమయాన్ని కుటుంబ సభ్యుల మధ్య కబుర్ల సమయంగా మార్చండి. ఆ రోజంతా ఎవరెవరు ఏం చేశారో పంచుకోవడం వల్ల పిల్లల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి.
- **తల్లిదండ్రులే రోల్ మోడల్స్:** పిల్లలకు వద్దని చెప్పేముందు, భోజనం చేసేటప్పుడు తల్లిదండ్రులు కూడా ఫోన్లను పక్కనపెట్టడం అత్యంత ముఖ్యం.

కథల ద్వారా విలువలు

పుస్తక పఠనం పిల్లల్లో ఊహాశక్తిని పెంచుతుంది. వారికి కేవలం పాఠ్యపుస్తకాలే కాకుండా బయటి ప్రపంచాన్ని పరిచయం చేసే పుస్తకాలను అందించండి.



- **నీతి కథలు:** పంచతంత్రం, ఈసప్ కథలు కేవలం వినోదాన్ని మాత్రమే కాకుండా, జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో నేర్పుతాయి.
- **వొకాబులరీ పెరుగుదల:** రోజుకు కనీసం రెండు పేజలు చదవడం అలవాటు చేస్తే వారిలో భాషా నైపుణ్యం, పదజాలం అద్భుతంగా పెరుగుతాయి.
- **స్నేహం చేయండి:** వారితో కలిసి మీరు కూడా చదవడం మొదలుపెట్టండి. పుస్తకంలోని పాత్రల గురించి చర్చించడం వల్ల వారి విశ్లేషణాత్మక ఆలోచన మెరుగుపడుతుంది.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్‌లు

దక్షిణాఫ్రికా X అఫ్ఘానిస్థాన్	(ఉ. 11 గం. నుంచి)
ఆస్ట్రేలియా X ఐర్లాండ్	(మ.3 గం.)
ఇంగ్లండ్ X వెస్టిండీస్	(రా.7 గం.)



సైఫర్ట్ (89 నాటౌట్)

అలెన్ (84 నాటౌట్)

ఓపెనర్లే బాదేశారు

● సైఫర్ట్, అలెన్‌ల మెరుపు ఇన్నింగ్స్

● యూఏఈపై కివీస్ ఘనవిజయం


చెన్నై: టీ20 వరల్డ్‌కప్‌లో ప్రధాన జట్లు పసి కూనలపైనే తడబడుతున్నా.. న్యూజిలాండ్ మాత్రం స్థాయికి తగ్గ ఆటతీరుతో అదరగొడుతోంది. తొలి మ్యాచ్‌లో అఫ్ఘాన్‌ను చిత్తు చేసిన మాదిరే.. తాజాగా మంగళవారం యూఏఈని మరింతగా వణికించి పది వికెట్ల తేడాతో నెగ్గింది. ప్రస్తుతం కివీస్ రెండు విజయాలతో గ్రూప్ 'డి'లో నాలుగు పాయింట్లతో టాప్‌లో ఉంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ 20 ఓవర్లలో 173/6 స్కోరు సాధించింది. ఓపెనర్ ముహమ్మద్ వసీం (66 నాటౌట్), షరాపు (55) అర్ధ సెంచరీలతో రాణించారు. హెన్రీకి రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో ఓపెనర్లు టిమ్ సైఫర్ట్ (42 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్సర్లతో 89 నాటౌట్), ఫిన్ అలెన్ (50 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 84నాటౌట్) సునామీ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. దీంతో కేవలం 15.2 ఓవర్లలో కివీస్ 175 పరుగులు సాధించి మ్యాచ్‌ను ముగించింది. సైఫర్ట్ 23 బంతుల్లో, అలెన్ 27 బంతుల్లో అజేయ అర్ధసెంచరీలు పూర్తి చేశారు. అలాగే పురుషుల టీ20 వరల్డ్ కప్‌లో ఏ వికెట్‌కైనా అత్యధిక భాగస్వామ్యాన్ని (175) నమోదు చేసిన జోడీగా నిలిచారు. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ సైఫర్ట్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దక్కడం విశేషం.

సంక్షిప్త స్కోర్లు

యూఏఈ: 20 ఓవర్లలో 173/6 (వసీం 66 నాటౌట్, షరాపు 55; హెన్రీ 2/37).
న్యూజిలాండ్: 15.4 ఓవర్లలో 175/0 (సైఫర్ట్ 89 నాటౌట్, అలెన్ 84 నాటౌట్).

ఈసారి గెలిచారు

యూఎస్‌ఏపై పాక్ ప్రతీకారం
ఫర్హాన్ అర్ధసెంచరీ
టీ20 ప్రపంచ కప్



సాహిబ్జాదా ఫర్హాన్ (73)

కొలంబో: రెండేళ్ల క్రితం టీ20 ప్రపంచ కప్ సూపర్ ఓవర్‌లో తమకు షాకిచ్చిన అమెరికాపై పాకిస్థాన్ ఈ సారి టోర్నీలో బదులు తీర్చుకుంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ 32 పరుగుల తేడాతో అమెరికాపై ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 190 పరుగులు చేసింది. ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ (41 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 73) మెరుపు బ్యాటింగ్‌తో పాక్ గెలుపులో కీలకంగా నిలిచాడు. బాబర్ ఆజమ్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 46), షాదాబ్ (12 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 30) రాణించారు. అమెరికా పేసర్ షాక్విక్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ఛేదనలో అమెరికా జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లకు 158 పరుగులకే పరిమితమై పరాజయం పాలైంది. పవర్‌ప్లేలో ఫర్వాలేదనిపించినా.. ఆ తర్వాత స్పిన్ దాటికి అమెరికా బ్యాటర్లు తడబడ్డారు. శుభమ్ (30 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 51), జహంగీర్ (49), మిలింద్ కుమార్ (29) మినహా అంతా విఫలమయ్యారు. స్పిన్నర్లు ఉస్మాన్ తారిఖ్‌కు మూడు, షాదాబ్ ఖాన్‌కు రెండు వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సాహిబ్జాదా ఫర్హాన్ నిలిచాడు.

అదిరే ఆరంభం..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాక్‌కు ఓపెనర్ ఫర్హాన్ అదిరే ఆరంభాన్నందించాడు. ఎడాపెడా బౌండరీలతో యూఎస్ బౌలర్లపై విరుచుకుపడగా, అటు మరో ఓపెనర్ సయీమ్ (19) ఉన్న కాసేపు వేగం చూపాడు. దీంతో తొలి వికెట్‌కు 31 బంతుల్లోనే 54 పరుగులు జత చేరాయి. ఆరో ఓవర్‌లో సయీమ్, కెప్టెన్ సల్మాన్ (1)లను పేసర్ షాక్విక్ అవుట్ చేశాడు. అయితే ఫర్హాన్ జోరు కొనసాగిస్తూ 27 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అటు కుదురుకునేందుకు కాస్త సమయం తీసుకున్న బాబర్ 12వ ఓవర్‌లో 6,4,4తో ఆకట్టుకున్నాడు. కాగా, మూడో వికెట్‌కు 81 పరుగులు జత చేశాక బాబర్‌ను స్పిన్నర్ మొహిసిన్ అవుట్ చేశాడు. తర్వాతి ఓవర్‌లోనే ఫర్హాన్ వెనుదిరగ్గా.. షాదాబ్ ఎదురుదాడికి దిగి విలువైన పరుగులందించాడు. కానీ, చివరి రెండు ఓవర్లలో 5 వికెట్లు కోల్పోవడంతో పాక్ స్కోరు 200 లోపే ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 190/9. (ఫర్హాన్ 73, బాబర్ 46, షాదాబ్ 30; షాక్విక్ 4/25).
అమెరికా: 20 ఓవర్లలో 158/8. (శుభమ్ 51, జహంగీర్ 49; ఉస్మాన్ తారిఖ్ 3/27, షాదాబ్ 2/26).

బాస్ ఆల్‌రౌండ్ షో

● నమీబియాపై నెదర్లాండ్స్ గెలుపు



బాస్ డి లీడ్స్ (72 నాటౌట్, 2/20)

న్యూఢిల్లీ: బాస్ డి లీడ్స్ (72 నాటౌట్, 2/20) ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టడంతో.. టీ20 వరల్డ్‌కప్‌లో నెదర్లాండ్స్ తొలి విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-ఎలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 7 వికెట్ల తేడాతో నమీబియాపై గెలిచింది. తొలుత నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 156/8 స్కోరు చేసింది. జాన్ నికోల్ (42), జాన్ ఫ్రైలింగ్ (30) టాప్ స్కోరర్లు. లోగన్ వాన్ బీక్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో నెదర్లాండ్స్ 18 ఓవర్లలో 159/3 స్కోరు చేసి గెలిచింది. కొలిన్ ఏకర్‌మన్ (32), మైకేల్ లెవిట్ (28) రాణించారు. ట్రంపెల్‌మన్, నికోల్ చెరో వికెట్ దక్కించుకొన్నారు. ఈ విజయంతో సూపర్-8 అవకాశాలను నెదర్లాండ్స్ సజీవంగా నిలబెట్టుకొంది.

రంజీ సెమీస్‌లో బెంగాల్

ఆంధ్ర ఇన్నింగ్స్ ఓటమి

కళ్యాణి (బెంగాల్): రంజీ ట్రోఫీ క్వార్టర్స్‌లో ఆంధ్ర జట్టు ఇన్నింగ్స్ 90 పరుగుల తేడాతో చిత్తయ్యింది. దీంతో బెంగాల్ జట్టు సెమీస్‌లో ప్రవేశించింది. ఓవర్‌నైట్ స్కోరు 64/3తో చివరి రోజైన మంగళవారం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్ర 244 రన్స్‌కే పరిమితమైంది. నితీశ్ (90) రాణించాడు. షాబాజ్ అహ్మద్ 4, సూరజ్ 2 వికెట్లు తీశారు. అంతకుముందు ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 295, బెంగాల్ 629 రన్స్ చేశాయి. సెమీస్‌లో జమ్మూ జట్టుతో బెంగాల్ తలపడనుంది.



మా అబ్బాయి పెళ్లికి రండి!

ప్రధాని మోదీ, రాహుల్‌ను ఆహ్వానించిన సచిన్

న్యూఢిల్లీ: తన కుమారుడు అర్జున్ టెండూల్కర్ వివాహానికి రావాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఆహ్వానించాడు. అతని స్నేహితురాలు సానియా చందోక్‌తో అర్జున్ పెళ్లి వచ్చేనెల 5న ముంబైలో జరగనుంది. సచిన్ తన కుటుంబసభ్యులతో మోదీని మంగళవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశాడు. ఇక.. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీని కూడా కలిసి తన కుమారుడి పెళ్లికి ఆహ్వానించాడు.



ప్రపంచకప్ నుంచి హసరంగ, బ్రేస్‌వెల్ అవుట్

కొలంబో: శ్రీలంక ఆటగాడు వనిందు హసరంగ ఎడమ తొడ కండరాల గాయం కారణంగా ప్రపంచ కప్‌నుంచి నిష్క్రమించాడు. హసరంగ స్థానంలో లెగ్ స్పిన్నర్ దుషన్ హేమంతను జట్టులోకి చేర్చారు. అలాగే న్యూజిలాండ్ ఆటగాడు మైకేల్ బ్రేస్‌వెల్ కూడా టోర్నీకి దూరమయ్యాడు.

ఆ రాయితీలు.. అప్పటిదాకా రహస్యంగానే!

ఐసీసీ, పాక్ బోర్డు మధ్య అవగాహన

న్యూఢిల్లీ: భారత్‌తో మ్యాచ్ బహిష్కరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొనేందుకు పాకిస్థాన్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కొన్ని రాయితీలు ఇచ్చేందుకు ఒప్పుకున్నట్టు తెలుస్తోంది. అయితే, ఆ రాయితీలేంటో మాత్రం టీ20 వరల్డ్‌కప్ ముగిసిన తర్వాతనే ప్రకటిస్తారని పాక్ క్రికెట్ వర్గాలు తెలిపాయి. భారత్‌లో ఆడేందుకు నిరాకరించిన బంగ్లాదేశ్‌పై ఎటువంటి చర్యలూ తీసుకోబోమని ఐసీసీ ఈపాటికే తెలియజేసింది. అంతేకాకుండా 2028-31 సైకిల్‌లో ఓ ఐసీసీ టోర్నీ (బహుశా అండర్-19 వరల్డ్ కప్) ఆతిథ్య హక్కులను కూడా బంగ్లాకు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసింది. శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిసనాయకే, బంగ్లా క్రికెట్ బోర్డు, ఈ పరిణామాల గురించి తెలిసిన కొందరు వ్యక్తులు నచ్చజెప్పడం వల్లే పాక్ తన నిర్ణయాన్ని మార్చుకొందని విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా సమస్యకు చక్కని పరిష్కారం వెదికిన ఐసీసీకి బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా కృతజ్ఞతలు తెలిపాడు.

తోక ముడిచింది: ఒమర్ అబ్దుల్లా

పాక్ భయపడిపోయిందని జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఎద్దేవా చేశారు. మాటపై నిలబడే ధైర్యం లేనప్పుడు.. అనవసర బెదిరింపులకు దిగొద్దని హితవు పలికారు. ఇకనైనా డ్రామాలు కట్టిపెట్టి గప్‌చుప్‌గా మ్యాచ్ ఆడితే మంచిదని ఒమర్ అన్నారు.

టికెట్ ధరలకు రెక్కలు..

ఇండో-పాక్ మ్యాచ్‌కు అడ్డంకులు తొలగడంతో.. కొలంబో విమాన టికెట్ ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. ముంబై నుంచి కొలంబో రౌండ్ ట్రిప్ టికెట్ ధర అమాంతంగా రూ. 10 వేలు పెరిగి రూ. 60 వేలు అయిందట.

మెగా టోర్నీకి 53% పెరిగిన వీక్షకులు

న్యూఢిల్లీ: తమ డిజిటల్ సాధనాల్లో టీ20 వరల్డ్‌కప్ వ్యూయర్‌షిప్ గత టోర్నీతో పోల్చుకొంటే.. 53 శాతం మేర పెరిగినట్టు ఐసీసీ తెలిపింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల్లో 64.7 కోట్ల వీడియో వ్యూస్ నమోదైనట్టు పేర్కొంది. ముఖ్యంగా అసోసియేట్ జట్లు పాల్గొంటున్న దేశాలు నేపాల్, యూఏఈ, అమెరికా నుంచి భారీగా వ్యూస్ వస్తున్నట్టు ఓ ప్రకటనలో తెలిపింది. '2024తో పోల్చుకొంటే ఐసీసీ యాప్‌లో యూజర్ల సంఖ్య 83 శాతం పెరిగింది. అదే సమయంలో 16 శాతం మంది ఐసీసీ వెబ్‌సైట్‌ను ఉపయోగిస్తున్నారు. నేపాల్ లాంటి దేశం నుంచి వ్యూయర్‌షిప్ 442 శాతం మేర హెచ్చింది. యూఏఈ, అమెరికాల నుంచి వీక్షకుల సంఖ్య 196 శాతం, 49 శాతం పెరిగాయి. క్రికెట్ పాపులారిటీ ప్రపంచమంతా విస్తరిస్తున్నదనడానికి ఇదే ఉదాహరణ' అని ఐసీసీ తెలిపింది. ఇంగ్లిష్‌లోనే కాకుండా నేపాలీ తదితర భాషల్లో వ్యాఖ్యానాలను ఏర్పాటుచేయడం వీక్షకుల సంఖ్య భారీగా పెరగడానికి ఒక కారణమని తెలుస్తోంది.

ఆకృతికి రజతం.. అంజుమ్‌కు కాంస్యం



ఆకృతి

న్యూఢిల్లీ: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. మంగళవారం ఇక్కడ జరిగిన సీనియర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో ఆకృతి దహియా రజతం, అంజుమ్ మోద్గిల్ కాంస్యం నెగ్గి పోడియం ఫినిష్ చేశారు. కజకిస్థాన్ షూటర్ షల్జెన్‌కో (358.2) వరల్డ్ రికార్డు ప్రదర్శనతో స్వర్ణం సాధించింది. ఇక, జూనియర్ మహిళల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో భారత్‌కు చెందిన ప్రచీ గైక్వాడ్ స్వర్ణం, అనుష్క ఠాకూర్ కాంస్యం గెలిచారు.

ఫ్యామిలీకి నో ఎంట్రీ!

ఆటగాళ్లకు దూరంగా ఉండాలన్న బీసీసీఐ

న్యూఢిల్లీ: మ్యాచ్‌లు జరిగే రోజుల్లో భారత ఆటగాళ్లు తమ కుటుంబ సభ్యులతో ఉండే విషయంపై బీసీసీఐ తమ పాత నిర్ణయానికే కట్టుబడివుంది. అయినా ప్రస్తుత ప్రపంచకప్ నేపథ్యంలో ఈ విషయమై మరోసారి స్పష్టతనివ్వాల్సిందిగా బీసీసీఐని భారత జట్టు మేనేజిమెంట్ కోరిందట. అయితే దాన్ని బీసీసీఐ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. కుటుంబ సభ్యులు ఆటగాళ్లతో కలిసివుండడానికి వీల్లేదని, కావాలంటే వారికి మరోచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని బోర్డు వర్గాలు తెలిపాయట. ఇదిలావుండగా, వాంఖడేలో అమెరికాతో జరిగిన మ్యాచ్‌కి ఉపయోగించిన పిచ్‌పై భారత మేనేజిమెంట్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం. ఆ మ్యాచ్‌లో భారత్ గెలిచింది.

బిజినెస్

అపోలో చేతికి బెంగళూరు హాస్పిటల్

డీల్ విలువ రూ.165 కోట్లు

అపోలో హాస్పిటల్స్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బెంగళూరు కేంద్రంగా పని చేసే బెలినెస్ ఛాంపియన్ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను అపోలో అనుబంధ సంస్థ ఇంపీరియర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ లిమిటెడ్ (ఐహెచ్‌ఆర్‌సీఎల్) కొనుగోలు చేసింది. ఆస్తులు, అప్పులతో కలిపి మొత్తం డీల్ విలువ రూ.165 కోట్లు. ప్రస్తుతం 125 పడకలతో పనిచేస్తున్న ఈ హాస్పిటల్‌ను ఈ ఏడాది జూన్‌కల్లా 175 పడకల హాస్పిటల్‌గా తీర్చిదిద్దనున్నట్టు అపోలో హాస్పిటల్స్ తెలిపింది.

క్యూ3 లాభం రూ.502 కోట్లు: అపోలో హాస్పిటల్స్ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో అనుబంధ కంపెనీలతో కలిసి (కన్సాలిడేటెడ్) రూ.6,477.4 కోట్ల ఆదాయంపై రూ.502 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ ఆదాయం 17%, నికరలాభం 35% పెరిగాయి. వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.10 మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. ఇందుకు ఈ నెల 16వ తేదీని రికార్డ్ తేదీగా నిర్ణయించింది.

23న ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు భేటీ

న్యూఢిల్లీ: ఈ నెల 23వ తేదీన జరుగనున్న ఆర్‌బీఐ కేంద్ర డైరెక్టర్ల బోర్డు ఈ సమావేశంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొననున్నారు. ఏటా బడ్జెట్ తర్వాత ఆర్‌బీఐ కేంద్ర బోర్డు సమావేశం అవుతూ ఉంటుంది. ద్రవ్యలోటును కట్టడి చేస్తూనే జీడీపీ వృద్ధిరేటును కొనసాగించేందుకు ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలను ఆర్థిక మంత్రి ఈ సమావేశంలో ఆర్‌బీఐ బోర్డు సభ్యులకు వివరిస్తారని భావిస్తున్నారు.

రూ.10 లక్షల కోట్ల క్లబ్‌లో ఎస్‌బీఐ

ఈ ఘనత సాధించిన ఆరో భారత కంపెనీ



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ మార్కెట్ విలువ తొలిసారిగా రూ.10 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఐసీఐసీఐ బ్యాంక్ తర్వాత ఈ స్థాయి మార్కెట్ విలువ సాధించిన ఆరో భారత లిస్టెడ్ కంపెనీ ఇదే. ప్రస్తుతం మార్కెట్లోని అత్యంత విలువైన కంపెనీల్లో ఆరో స్థానం కూడా ఎస్‌బీఐదే. అంతేకాదు, మార్కెట్ విలువపరంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తర్వాత రెండో అతి పెద్ద బ్యాంక్‌గానూ అవతరించింది. ఆరేళ్ల పైబడిన విరామం తర్వాత ఎస్‌బీఐ మళ్లీ ఐసీఐసీఐ బ్యాంక్‌ను మూడో స్థానానికి నెట్టింది.

సరికొత్త రికార్డు స్థాయికి షేరు ధర

బీఎస్ఈలో ఎస్‌బీఐ షేరు ధర మంగళవారం ఒకదశలో దాదాపు ఒక శాతం పెరిగి రూ.1,153.85 స్థాయి వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. రికార్డు గరిష్ఠాల వద్ద మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడటంతో చివరికి 0.16 శాతం నష్టంతో రూ.1,144.10 వద్ద ముగిసింది. దాంతో బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.10.56 లక్షల కోట్లుగా నమోదైంది. ఈ నెలలో ఇప్పటివరకు ఎస్‌బీఐ షేరు 6 శాతానికి పైగా వృద్ధి చెందగా.. జనవరిలోనూ 10 శాతం ఎగబాకింది. గడిచిన ఏడాది కాలంలో 67.5 శాతం పుంజుకుంది.

ఎల్ఐసీకి రూ.40,000 కోట్ల లాభం

దేశంలో అతిపెద్ద సంస్థాగత ఇన్వెస్టర్ (డీఐఐ) అయిన ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీకి ఎస్‌బీఐలో 9.23 శాతం వాటా ఉంది. గడిచిన ఏడాది కాలంలో ఎస్‌బీఐ షేరు వేగంగా పెరుగుతూ రావడంతో ఈ బ్యాంక్‌లోని ఎల్ఐసీ ఈక్విటీ వాటా విలువ కూడా దాదాపు రూ.40,000 కోట్ల మేర వృద్ధి చెంది మొత్తం రూ.98,353 కోట్లకు చేరుకుంది.

శ్రీ సిటీలో హైసెన్స్ తయారీ ప్లాంట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వినియోగ ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లయెన్స్‌ల రంగంలోని హైసెన్స్ శ్రీసిటీలో ఇప్యాక్ డ్యూరబుల్ (ఈడీఎల్) భాగస్వామ్యంలో ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించింది. ఇది దేశంలోనే ఆ కంపెనీకి తొలి తయారీ ప్లాంట్. శ్రీసిటీలోని ఈడీఎల్ ఇండస్ట్రియల్ పార్కులో 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.273 కోట్ల పెట్టుబడితో కొత్తగా ఈ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ నెలలోనే ఈ ప్లాంట్ వాణిజ్యపరమైన ఉత్పత్తిని ప్రారంభిస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. పూర్తి స్థాయిలో పని ప్రారంభించినట్టయితే ఈ ప్లాంట్ హైసెన్స్ కోసం రూమ్ ఎయిర్ కండిషనర్లు తయారుచేయనుంది. తొలి దశలో ఏసీల ఉత్పత్తిని ప్రారంభించామని, వచ్చే ఏడాది రెండో త్రైమాసికంలో ఉత్పత్తిని ప్రారంభించనున్న రెండో దశలో వాషింగ్ మెషీన్లు, మూడో దశలో ఎల్ఈడీ టీవీల తయారీని ఈ ప్లాంట్ చేపడుందని హైసెన్స్ సీఈఓ పంకజ్ రాణా తెలిపారు. ప్రస్తుతం ఈ ప్లాంట్‌లో 500 మంది పని చేస్తున్నారు. వచ్చే 12-24 నెలల కాలంలో 1,500 మందికి ఉపాధి కల్పించగలుగుతుందని పేర్కొన్నారు.

రిలయన్స్ చేతికి మన్నా హెల్త్ మిక్స్

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (ఆర్‌సీపీఎల్) కొనుగోళ్ల పర్వం కొనసాగుతోంది. తాజాగా మన్నా హెల్త్ ఫుడ్స్ పేరుతో ఆహార ఉత్పత్తులు విక్రయించే తమిళనాడు కంపెనీ సదరన్ హెల్త్ ఫుడ్స్‌ను కొనుగోలు చేసింది. అయితే ఎంత మొత్తానికి కొనుగోలు చేసిందీ ఆర్‌సీపీఎల్ వెల్లడించలేదు. రెండు దశాబ్దాలుగా ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల విభాగంలో మన్నా బ్రాండ్‌కు ప్రజల్లో ప్రత్యేక ఆదరణ ఉంది. ఈ బ్రాండ్ కింద చిరుధాన్యాల పిండి, ఓట్స్, మల్టీ గ్రెయిన్ మిక్స్, బేబీ ఫుడ్స్, మల్టీ గ్రెయిన్ డ్రింక్స్ బహుళ ప్రాచుర్యంలో ఉన్నాయి. ఈ కొనుగోలుతో ఆర్‌సీపీఎల్ హెల్త్ ఫుడ్స్ విభాగంలోకి కూడా విస్తరించినట్టవుతుంది. "అందుబాటు ధరల్లో ప్రపంచ నాణ్యత" గల ఉత్పత్తులు అందించాలన్న ఆర్‌సీపీఎల్ సిద్ధాంతానికి ఇది బలం చేకూరుస్తుందని కంపెనీ డైరెక్టర్ టీ కృష్ణకుమార్ అన్నారు. త్వరలో ఈ ఉత్పత్తులను ఆర్‌సీపీఎల్ దేశవ్యాప్తంగా విస్తరించనుంది. ప్రజల్లో మంచి పేరున్న ఆహార, పర్సనల్ కేర్ కంపెనీలను కొనుగోలు చేయడం ద్వారా ఎఫ్ఎంసీజీ మార్కెట్‌లో పట్టు పెంచుకోవాలని ఆర్‌సీపీఎల్ భావిస్తోంది.

గల్ఫ్ ఆయిల్ లాభాలకు గండి

న్యూఢిల్లీ: డిసెంబరు త్రైమాసికంలో హిందూజా గ్రూప్ కంపెనీ గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ లాభాలకు గండి పడింది. ఈ కాలానికి కంపెనీ అనుబంధ కంపెనీల ఆదాయాలను మినహాయించి (ఏకీకృత) రూ.999.92 కోట్ల ఆదాయంపై రూ.130.27 కోట్ల స్థూల లాభం, రూ.77.11 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 10.28%, స్థూల లాభం 6.6% పెరిగినా, నికర లాభాలకు మాత్రం 21.45% గండి పడింది.

సిటీ యూనియన్ బ్యాంక్ సీఈఓగా విజయ్ ఆనంద్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రైవేట్ రంగంలోని సిటీ యూనియన్ బ్యాంక్ (సీయూబీ) మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా ఆర్.విజయ్ ఆనంద్ నియామకానికి ఆర్‌బీఐ ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం ఆయన బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా (ఈడీ) పని చేస్తున్నారు. ఈ ఏడాది మే ఒకటో తేదీ నుంచి మూడు సంవత్సరాల పాటు ఆయన నియామకం అమలులో ఉంటుంది. ఈ నియామకం బ్యాంక్ షేర్ హోల్డర్ల అనుమతికి లోబడి ఉంటుంది.

నేడే బీహెచ్ఈఎల్ వాటాల విక్రయం

● ఒక్కో షేరు ధర రూ.254

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగానికి చెందిన భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌లో (బీహెచ్ఈఎల్) కేంద్రం 5 శాతం వరకు వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. ఒక్కో షేరు కనీస ధరను రూ.254గా నిర్ణయించారు. బీఎస్ఈలో మంగళవారం బీహెచ్ఈఎల్ షేరు ముగింపు ధర రూ.276.05తో పోలిస్తే ఈ ధర 8% తక్కువ. ఈ ఇష్యూ నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు బుధవారం నుంచి ప్రారంభం కానుంది. రిటైల్ ఇన్వెస్టర్లు గురువారం నుంచి బిడ్ చేయవచ్చని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) కార్యదర్శి అరుణిష్ చావ్లా మంగళవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ వాటా విక్రయం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ.4,422 కోట్ల వరకు ఆదాయం సమకూరనుంది. ప్రస్తుతం బీహెచ్ఈఎల్‌లో ప్రభుత్వం 63.17 శాతం వాటా కలిగి ఉంది. ఓఎఫ్ఎస్ అనంతరం 58.17 శాతానికి తగ్గే అవకాశం ఉంది. కాగా, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఈక్విటీ వాటాల విక్రయం ద్వారా మోదీ సర్కారు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.8,768 కోట్లు సమీకరించింది.

మూడో రోజూ ముందుకే..

● రూ.1.14 లక్షల కోట్లు పెరిగిన సంపద

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో పయనించాయి. మంగళవారం సెన్సెక్స్ 208.17 పాయింట్ల లాభంతో 84,273.92 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 67.85 పాయింట్ల వృద్ధితో 25,935.15 వద్ద ముగిసింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.1.14 లక్షల కోట్లు పెరిగి రూ. 474.48 లక్షల కోట్లకు చేరుకుంది.


ఆర్వీ ఇంజనీరింగ్ ఐపీఓకు సెబీ ఆమోదం

భిన్న రంగాలకు సాంకేతికత ఆధారిత కన్సల్టెన్సీ సేవలందించే హైదరాబాద్ కంపెనీ 'ఆర్వీ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ లిమిటెడ్' ఐపీఓకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.202.5 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్ల జారీతోపాటు ప్రమోటర్ వెంకటాచల చక్రపాణి రెడ్డి వాటాకు చెందిన 67.5 లక్షల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

రూ.2.64 లక్షలకు జారిన కిలో వెండి ధర: అంతర్జాతీయ మార్కెట్లో ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగానూ వెండి తీవ్ర ఒడుదుడుకులకు లోనవుతోంది. ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర.. మంగళవారం రూ.7,500 తగ్గి రూ.2,64,500కు జారుకుంది. 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం రేటు మాత్రం రూ.2,200 పెరిగి రూ.1,60,700కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్ విషయానికొస్తే, ఔన్స్ (31.10 గ్రాములు) వెండి 1.37 శాతం తగ్గి రూ.82.16 డాలర్లకు జారుకోగా.. గోల్డ్ రూ.5,052 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.


● గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలోకి ఈ జనవరిలో రూ.24,040 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 2025 డిసెంబరులో నమోదైన రూ.11,647 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే ఇది రెట్టింపు పై మాటే.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




11వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	515
వరంగల్	497	గోదావరి	485
చిత్తూరు	563	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	120
వరంగల్	125	గుంటూరు	120
కరీంనగర్	125	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	105
కర్నూలు	125	నెల్లూరు	110
విశాఖపట్నం	115	అనంతపురం	110
గోదావరి	120		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,57,910 ▼	1,44,750 ▼	2,90,000 ▼
విజయవాడ	1,60,800 ▲	1,49,000 ▲	2,74,800 ▲
విశాఖపట్నం	1,60,316 ▲	1,44,750 ▲	3,00,000 ▲
రాజమండ్రి	1,57,910 ▼	1,44,750 ▼	2,61,000 ▼
ప్రొద్దుటూరు	1,60,500 ▲	1,47,660 ▲	2,73,000 ▲
ముంబై	1,56,260 ▲	1,43,130 ▲	2,59,100 ▲



'వెట్టిచాకిరి రహిత ఏపీ' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, తదితరులు

వెట్టి రహిత రాష్ట్రంగా ఏపీ

» హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ ఆకాంక్ష

గుంటూరు లీగల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను వెట్టి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. వెట్టి చాకిరి నిర్మూలన చట్టం-1976 అమలులోకి వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అమరావతిలోని విట్(వీఐటీ) యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యశాలలో న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, పౌరస మాజ సంస్థలు, వెట్టి చాకిరి బాధితులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఏపీని వెట్టి చాకిరి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ఐక్యంగా పని చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి, మరో పూర్వ న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్, జీవన్ జ్వాల సంస్థ ప్రధాన కార్యదర్శి కె.తెన్మోజి, రాష్ట్ర భూపరిపాలన శాఖ ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి, రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ సభ్య కార్యదర్శి హిమబిందు, రాష్ట్ర న్యాయ సేవల సంస్థ డిప్యూటీ సెక్రటరీ హెచ్ అమరరంగేశ్వరరావు, వీఐటీ వీసీ, డీన్, రిజిస్ట్రార్ పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు రూ.1,198 కోట్లు విడుదల

» 2024-25 విద్యాసంవత్సరానికి చెల్లింపు

» నేడు ప్రైవేటు వర్సిటీలకు ప్రత్యేక జీవో?

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రభుత్వం ఉపశమనం కల్పించింది. 2024-25 విద్యా సంవత్సరానికి బకాయిలు ఉన్న రూ.1,198 కోట్ల విడుదలకు బడ్జెట్ రిలీజ్ ఆర్డర్లపై మంగళవారం వేర్వేరు జీవోలు జారీ చేసింది. బీసీ సంక్షేమ శాఖ నుంచి రూ.258 కోట్లు, రూ.477 కోట్లు, ఈడబ్ల్యూఎస్ శాఖ నుంచి రూ.365 కోట్లు, మైనారిటీ సంక్షేమశాఖ నుంచి రూ.98 కోట్ల విడుదలకు ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో గత సంవత్సర ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు మొత్తం క్లియర్ అవుతాయి. ఈ ఫీజులన్నీ నేరుగా కాలేజీల ఖాతాల్లో జమ అవుతాయి. ఇంకా 2023-24 విద్యా సంవత్సరంలో రూ.1,500 కోట్లు పెండింగ్ ఉన్నాయి. వాటిని ఎవరికి ఇవ్వాలనే దానిపై తుది నిర్ణయం తీసుకోలేదు. సూత్రప్రాయంగా తల్లుల ఖాతాల్లోనే జమ చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అలా అయితే కోర్సులు పూర్తిచేసుకుని వెళ్లిపోయిన వారినుంచి డబ్బులు ఎలా రాబట్టుకోవాలని యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి. కాగా, 2025-26లో మూడు త్రైమాసికాలకు రూ.1,800 కోట్లు ఫీజులు ఇవ్వాల్సి ఉంది. మరోవైపు ప్రైవేటు వర్సిటీల కన్వీనర్ కోటా విద్యార్థులకు ఫీజుల విడుదల కోసం ఉన్నత విద్యాశాఖ నేడు విడిగా జీవో జారీచేసే అవకాశం ఉంది.

గిరిజన రెవెన్యూ గ్రామాల వివరాలు వెబ్‌సైట్‌లో

» హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు

గిరిజన ప్రాంతాల్లోని 595 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 878 రెవెన్యూ గ్రామాల జాబితాను గిరిజన సంక్షేమ శాఖ వెబ్‌సైట్‌లో ఉంచేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు శివరామ్ పిల్ దాఖలు చేశారు. గ్రామాల వివరాలను బహిరంగంగా ప్రదర్శించని కారణంగా గిరిజన ప్రాంతాల సరిహద్దులపై స్పష్టత లేదన్నారు. గిరిజనేతరులు అటవీ ప్రాంతంలో సారవంతమైన భూములు ఆక్రమించి అక్రమ మైనింగ్‌కి పాల్పడుతున్నారని, వడ్డీ వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు.

ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాలాజీ మెడమల్లి

రాష్ట్రపతి ఆమోదం...
కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా న్యాయవాది బాలాజీ మెడమల్లి నియమితులయ్యారు. ఈ నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 32గా ఉంది. న్యాయమూర్తిగా బాలాజీ నియామకంతో ఈ సంఖ్య 33కు చేరనుంది. న్యాయవాదుల కోటాలో న్యాయవాది బాలాజీ మెడమల్లి పేరును హైకోర్టు న్యాయమూర్తిగా సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం ఇటీవల సమావేశమై బాలాజీ పేరుకు ఆమోదం తెలుపుతూ కేంద్రానికి సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. మెడమల్లి బాలాజీ గురు, శుక్రవారాల్లో హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా ప్రమాణం చేసే అవకాశం ఉంది.

నేపథ్యం ఇదీ...

మెడమల్లి బాలాజీది వ్యవసాయ నేపథ్య కుటుంబం. లక్ష్మీనరసమ్మ, సుబ్బయ్యనాయుడు దంపతులకు 1972 మే 29న జన్మించారు. ఆయన స్వస్థలం రాజంపేట మండలం, శేషన్నగారిపల్లి గ్రామం. తండ్రి సుబ్బయ్య నాయుడు కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్‌లో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. పాఠశాల విద్యను రాజంపేటలో పూర్తిచేసిన బాలాజీ... తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కాలేజీ నుండి డిగ్రీ పట్టా పొందారు. హైదరాబాద్‌లోని పడాల రామిరెడ్డి న్యాయ కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించారు. 1998 ఏప్రిల్ 9న న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు ఆఫీసులో చేరి ప్రాక్టీస్ ప్రారంభించారు. రాజ్యాంగ సంబంధ అంశాలతో పాటు సివిల్, క్రిమినల్, సర్వీసు, కమర్షియల్ కేసుల వాదించడంలో బాలాజీకి అపార అనుభవం ఉంది. 2004 నుండి 2006 వరకు ఏజీ కార్యాలయానికి అటాచ్ అయ్యి ఏజీపీగా సేవలు అందించారు. 2018-19 మధ్య విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా చేశారు. వివిధ ప్రతిష్ఠాత్మక సంస్థలు, బ్యాంకులకూ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలు అందించారు.



బాలాజీ మెడమల్లి

పాఠ్యపుస్తకాల్లో రూ.13.5 కోట్లు ఆదా!

» పేజీ ఆరు పైసలకే ముద్రించేలా టెండరు ఖరారు

» ఎల్ 1తో పాటు స్థానిక ప్రింటర్లకూ ముద్రణ వర్క్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పాఠశాల విద్యాశాఖ చర్యలతో పాఠ్యపుస్తకాల ముద్రణలో రూ.13.5 కోట్లు మిగిలాయి. 2026-27 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే పాఠ్యపుస్తకాల ముద్రణకు విద్యాశాఖ ఇటీవల టెండర్లు పిలిచింది. ఎనిమిది శ్లాబుల్లో వేర్వేరు పుస్తకాలకు టెండర్లు పిలిచారు. 128 కంటే ఎక్కువ పేజీలున్న పుస్తకాలే 95 శాతం వరకు ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన షఫ్రాన్ స్పెషాలిటీ పేపర్స్ కంపెనీ ఒక్కో పేజీ 6 పైసలకు ముద్రిస్తామని కోట్ చేసింది. రాష్ట్రానికి చెందిన స్థానిక ప్రింటర్లు పేజీ 6.6 పైసలకు కోట్ చేశారు. గతేడాది వరకు ప్రింటింగ్‌పై జీఎస్టీ 18 శాతం ఉండేది. ఇప్పుడు 5 శాతానికి తగ్గింది. షఫ్రాన్ గతేడాది జీఎస్టీ రేటునే టెండరులో పేర్కొన్నప్పటికీ నిబంధనల ప్రకారం పన్నేతర ధరను ప్రామాణికంగా తీసుకుంటారు. ఆ ప్రాతిపదికన తక్కువ ధరకు కోట్ చేసిన షఫ్రాన్ కంపెనీ ఎల్1గా ఎంపికైంది.

జీఎస్టీపై పొరపాటు సవరణ.. పాత జీఎస్టీ ధర పొరపాటున పేర్కొన్నామని, కొత్త రేటు ప్రకారమే ముద్రిస్తామని ఎల్1 కంపెనీ పాఠశాల విద్యాశాఖకు లేఖ రాసింది. దీంతో పన్నుతో కలిపి పేజీ 6.3 పైసలకే ముద్రించేందుకు టెండరు ఖరారైంది. గతేడాది పన్ను కాకుండా పేజీ 6.2 పైసలకు పుస్తకాలు ముద్రించగా, ఈ ఏడాది 6 పైసలకే టెండరు ఖరారైంది. ఫలితంగా రూ.6.5 కోట్ల వరకు నిధులు ఆదా అవుతున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. అలాగే పేపరు కొనుగోళ్లలోనూ రూ.7 కోట్లు ఆదా అయ్యింది. మొత్తంగా ఈ ఏడాది రూ.13.5కోట్లు ఆదా కానున్నాయి. సుమారు 3 కోట్లకు పైగా పాఠ్యపుస్తకాలను వచ్చే విద్యా సంవత్సరానికి ముద్రించనున్నారు. ఎల్1 ఖరారు తర్వాత స్థానిక ప్రింటర్లతో అధికారులు చర్చించారు. ఎవరూ నష్టపోకుండా అందరికీ ముద్రణ వర్క్ ఇస్తామని హామీ ఇచ్చారు. పుస్తకాల ముద్రణ టెండర్లలో స్థానిక ప్రింటర్లకూ వర్క్ ఇవ్వాలనే నిబంధనలు ఉన్నాయి. ఏటా ఎల్1గా ఎవరు వచ్చినా అదే ధరకు ఇక్కడి ప్రింటర్లకే ఎక్కువ శాతం వర్క్ ఇస్తారు. అదేవిధంగా ఈ ఏడాది కూడా దాదాపు 90శాతం పనులు స్థానిక ప్రింటర్లకు ఇచ్చేలా చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించే ఉద్దేశంతో అందరికీ కొంత భాగం పనులు ఇస్తున్నామని, అయితే ఎల్1 ధరకే చేయాలని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.



ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం

» బాధితుడి వాదనలు విన్న తర్వాతే నిర్ణయం

» విద్యార్థి నాయకుల కిడ్నాప్ కేసులో.. మోహన్‌బాబుకు హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు యూనివర్సిటీ చాన్సలర్, సినీనటుడు మోహన్‌బాబుకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. బాధితుడి వాదనలు విన్న తర్వాత తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. కేసు పూర్తి వివరాలను సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. వ్యాజ్యంపై తదుపరి విచారణను ఈ నెల 12కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. విద్యార్థి నాయకుల కిడ్నాప్‌కు సంబంధించి బాధితుడు రెడ్డి కుమార్ ఫిర్యాదు ఆధారంగా ఈనెల 3న తిరుపతి జిల్లా తిరుచానూరు పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ మోహన్‌బాబు పిటిషన్ వేశారు. మంగళవారం విచారణకు రాగా, మోహన్‌బాబు తరపున న్యాయవాది ఎన్.అశ్వనీకుమార్ వాదనలు వినిపించారు. కిడ్నాప్ ఘటనతో పిటిషనర్‌కు సంబంధం లేదని, ఆ సమయంలో ఆయన స్థానికంగా లేరన్నారు. వర్సిటీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. నోటీసులు ఇచ్చి వివరణ తీసుకొనేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. పిటిషనర్‌కు నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవచ్చు కదా? అని ప్రశ్నించారు. ఏపీపీ సందీప్ వాదనలు వినిపిస్తూ కిడ్నాప్ వ్యవహారంలో మోహన్‌బాబు పాత్రపై ఆధారాలు ఉన్నాయన్నారు. ఘటన సమయంలో ప్రధాన నిందితుడు వర్సిటీ పీఆర్‌వో సతీష్, మోహన్‌బాబు మధ్య ఫోన్, మెసేజ్ సంభాషణ జరిగిందన్నారు. దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని పోలీసులు మంచు విష్ణుకు(ఏ3) నోటీసులు ఇచ్చినా.. విచారణకు హాజరుకాలేదన్నారు. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని, అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని కోరారు. బాధితుడి తరపున న్యాయవాది మాధవరావు వాదనలు వినిపిస్తూ, అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నవారి గొంతు నొక్కేయాలనే ఉద్దేశంతోనే పిటిషనర్ ఈ చర్యలకు పాల్పడ్డారన్నారు.

భక్తులను అగౌరవపరచొద్దు

» శ్రీశైలంలో దీక్షాధారుల ఆందోళనపై సీఎం ఆరా

» ఢిల్లీ నుంచే ఆలయాల్లో ఏర్పాట్లపై సమీక్ష

» మంత్రులు ఆనం, అనితకు పర్యవేక్షణ బాధ్యతలు



శ్రీశైలంలో ఏర్పాట్లపై భక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

అమరావతి/శ్రీశైలం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): దీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి శ్రీశైలం ఆలయానికి చేరుకునే భక్తులకు ఇబ్బంది కలిగేలా, వారిని అగౌరవపరిచేలా ఎవరూ వ్యవహరించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన శ్రీశైలంలో సోమవారం సాయంత్రం దీక్షాధారుల దర్శనం విషయంలో జరిగిన గందరగోళం, ఆందోళన ఘటనపై ఆరా తీశారు. శ్రీశైలం సహా వివిధ శివాలయాల్లో రద్దీ, వసతుల కల్పనపై ఢిల్లీ నుంచే మంత్రులు, సీఎస్, డీజీపీలతో పాటు దేవదాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలంలో కల్పించిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. శివరాత్రి నాటికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం, హోం శాఖ మంత్రి అనిత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. భక్తులకు వసతి, త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా ఏర్పాట్లు చేయాలన్నారు. శివరాత్రి రోజున అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసేలా పర్యవేక్షించాలని సీఎస్‌కు సూచించారు. సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కూడా పాల్గొన్నారు.

శ్రీశైలంలో ప్రశాంతంగా దర్శనాలు: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీశైలంలో మంగళవారం భక్తులకు దర్శనాలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం దీక్షాధారుల దర్శనాల్లో జరిగిన గందరగోళంతో ఆలయ అధికారులు, జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్ పరిస్థితిని సమీక్షించి మరో 500 మంది పోలీస్ బలగాలను శ్రీశైలానికి తరలించారు. నంద్యాల కలెక్టర్ రాజకుమారి సైతం శ్రీశైలంలోనే భక్తులతో మాట్లాడి, ఏర్పాట్లు, సౌకర్యాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆలయ ఈఓ శ్రీనివాసరావు, ఛైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు కూడా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ సునీల్ షెరాన్ మాట్లాడుతూ.. సోమవారం భక్తుల రద్దీ నేపథ్యంలో ఏఎస్పీ యుగంధర్ లాఠీ చూపుతూ నిలువరించారే తప్ప ఎవరిపైనా దాడి చేయలేదన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★




చాయ్‌వాలా ఇప్పుడు నవాబ్ కేఫ్

శివ కందుకూరి, రాజీవ్ కనకాల, తేజు అశ్విని ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'నవాబ్ కేఫ్'. ప్రమోద్ హర్ష దర్శకత్వంలో రాధా వి పపుడిప్పు నిర్మించారు. తొలుత 'చాయ్‌వాలా' అనే టైటిల్‌తో ప్రచారం ప్రారంభించిన ఈ చిత్రం సెన్సార్ నిబంధనల కారణంగా 'నవాబ్ కేఫ్' పేరుతో ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శివ కందుకూరి మాట్లాడుతూ 'పేరు మారినా ఈ కథలోని ఆత్మ మాత్రం అలాగే ఉంది. భావోద్వేగభరితమైన చిత్రమిది' అని చెప్పారు. నేను స్వయంగా చూసిన అనుభవించిన కొన్ని సంఘటనల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను అని దర్శకుడు తెలిపారు. కంటెంట్ బావుంటే ఏ టైటిల్ ఉన్నా ప్రేక్షకులు ఆదరిస్తారు అని తేజు అశ్విని అన్నారు.

డబ్బులు చెల్లిస్తారా? లేక జైలు శిక్ష అనుభవిస్తారా?

● రజనీ మూవీ నిర్మాతకు మద్రాస్ హైకోర్టు అల్టిమేటం



చెక్ బౌన్స్ కేసులో తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'కొచ్చడియాన్' మూవీ నిర్మాతకు మద్రాస్ హైకోర్టు షాకిచ్చింది. ఈ కేసులో నాలుగు వారాల్లో రూ.2.5 కోట్లు చెల్లించాలని, లేనిపక్షంలో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది. రజనీకాంత్ హీరోగా ఆయన కుమార్తె సౌందర్య దర్శకత్వంలో 2014లో యానిమేషన్ మూవీ 'కొచ్చడియాన్' విడుదలైంది. ఇందులో దీపిక పదుకొణె హీరోయిన్. ఈ సినిమా నిర్మాణం కోసం బెంగుళూరుకు చెందిన యాడ్‌బ్యూరో అడ్వర్‌టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి మీడియా వన్ గ్లోబల్ ఎంటర్‌టైన్మెంట్ లిమిటెడ్ డైరెక్టర్లలో ఒకరైన మురళీమనోహర్ కొంత రుణం తీసుకున్నారు. ఈ రుణం తిరిగి చెల్లింపులో భాగంగా 2014లో యాడ్ బ్యూరో సంస్థ ఎండీ అబిర్ చంద్ సహర్‌కు రూ.5 కోట్లకు మురళీమనోహర్ చెక్ ఇవ్వగా అది బౌన్స్ అయింది. దీంతో యాడ్ బ్యూరో కోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు మురళీమనోహర్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును మురళీమనోహర్ మద్రాస్ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై తాజాగా మంగళవారం విచారణ జరిపిన కోర్టు.. నాలుగు వారాల్లో యాడ్ బ్యూరో సంస్థకు రూ.2.5 కోట్లు చెల్లించాలని లేనిపక్షంలో ఆరు నెలల జైలుశిక్ష విధించాలంటూ ఆదేశించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)



అల్లు అర్జున్‌పై వ్యాఖ్యలు.. ఖండించిన పీఆర్ టీమ్

హీరో అల్లు అర్జున్‌తో యాడ్ షూట్ చేయాలంటే ఎన్నో నిబంధనలు ఉంటాయంటూ బ్రాండ్ స్ట్రాటజర్ కావేరీ బారువా చేసిన వ్యాఖ్యలపై ఆయన పీఆర్ టీమ్ సీరియస్ అయ్యింది. ఆమె చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదని ఖండించింది. అల్లు అర్జున్ ఎప్పుడూ హుందాగా, గౌరవప్రదంగా ఉంటారని తెలిపింది. ఈ నిరాధార ఆరోపణలపై లీగల్ చర్యలకు తమ టీమ్ సిద్ధమైనట్లు సోషల్‌మీడియాలో ఓ నోట్ ద్వారా పేర్కొంది. ఇటీవలే ఓ పాడ్‌కాస్ట్‌లో సెలబ్రిటీలతో యాడ్స్ చేయడం గురించి కావేరి మాట్లాడారు. 'సెలబ్రిటీలు ఒక్కొక్కరికీ ఒక్కో రకమైన వ్యక్తిత్వం ఉంటుంది. వారితో పనిచేసేటప్పుడు భిన్నమైన అనుభవాలు ఎదుర్కొన్నా. దక్షిణాది హీరోలకు టీమ్ చాలా పెద్దగా ఉంటుంది. అల్లు అర్జున్‌తో యాడ్‌కు పని చేసేటప్పుడు కూడా విచిత్రమైన అనుభవం ఎదురైంది. యాడ్ షూట్‌కు ఆయనను కలిసినప్పుడు ఏమి చేయాలో.. ఏమి చేయకూడదో ఓ 42 నిబంధనలు ఉంటాయి. వీటి అమలు విషయంలో ఆయన మేనేజర్లు చాలా కఠినంగా ఉంటారు. 'హీరోకు కరచాలనం ఇవ్వకూడదు. తగిన దూరం పాటించాలి. ఆయన కళ్లలోకి చూస్తూ మాట్లాడకూడదు.. సార్ అని గౌరవంగా సంబోధించాలి. అల్లు అర్జున్ సెట్‌లో ఉండగా ఫోన్ వాడకూడదు' లాంటివి అందులో కొన్ని.. ఓ యాడ్ షూటింగ్ సమయంలో అల్లు అర్జున్ వస్తుండగా సెట్‌లో ఎక్కడో చివర కూర్చుని నా ఫోన్ చూసుకుంటున్నా. అంతే ఆయన బాడీగార్డ్ ఒక్కసారిగా నా చేతిలోని ఫోన్ లాగేసుకుని 'ఇక్కడ ఫోన్‌కు అనుమతి లేదు' అని అన్నారు. కానీ నా పని అదేగా! బహుశా హీరో ప్రైవసీకి భంగం కలగకూడదని అలా కఠినంగా ఉండవచ్చు' అని కావేరి బారువా పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యల్ని సీరియస్‌గా తీసుకున్న అల్లు అర్జున్ టీమ్ న్యాయపరమైన చర్యకు సిద్ధమవుతోంది.

వారణాసి కోసం ప్రియాంక అంకితభావానికి ఆశ్చర్యపోయా

నిక్ జోనస్





మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' చిత్రంతో ప్రియాంక చాలా కాలం తర్వాత భారతీయ సినిమాల్లో తిరిగి నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఆమె నటిస్తుండడంపై అమెరికన్ గాయకుడు, ప్రియాంక భర్త నిక్ జోనస్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ప్రియాంక 'వారణాసి' సినిమా కోసం 14 నెలలుగా కష్టపడుతోంది. ఆమె అంకితభావానికి ఆశ్చర్యపోయా. 'వారణాసి' అద్భుతంగా ఉండబోతోంది. ఈ చిత్రం కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నా. భారత్ ప్రయాణించిన తొలిసారే ఆ దేశంలోని సంస్కృతి, సంప్రదాయాలతో ప్రేమలో పడిపోయా. భారతీయ సినిమాలు, సంగీతం అంటే నాకెంతో ఇష్టం. నా కూతురు మాల్టీని హిందూత్వ విలువలతో పెంచుతున్నాం. నాకూ, ప్రియాంకకు ఉమ్మడి కుటుంబం అంటే ఇష్టం' అని చెప్పారు. కేఎల్ నారాయణ నిర్మిస్తున్న 'వారణాసి' వచ్చే ఏడాది ఉగాది సందర్భంగా ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది.

ఈసారి లాజిక్‌తో కూడిన మ్యాజిక్


- అనుదీప్



'జాతి రత్నాలు' చిత్రంతో బాక్సాఫీసు వద్ద నవ్వుల జాతర చేసిన దర్శకుడు కేవీ అనుదీప్ ఇప్పుడు 'ఫంకీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. విష్వక్సేన్, కయాదు లోహర్ జంటగా నటించిన ఈ చిత్రం ఈనెల 13న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా అనుదీప్ మీడియాతో ముచ్చటించారు.

- నా సినిమాల్లో లాజిక్ ఉండదు అనే విమర్శలు ఉన్నాయి. కామెడీ ఎక్కువగా ఉండడం వల్ల అనిపించి ఉండొచ్చు. కానీ 'ఫంకీ'లో లాజిక్‌తో కూడిన హాస్యం ఉంటుంది. సినిమా పరిశ్రమ నేపథ్యంలో సాగే ఈ కథలో దర్శకుల జీవితాల్లోని సరదా సంఘటనలను, కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలను జోడించి రూపొందించాం. ఈ చిత్రంలో హీరో విష్వక్‌సేన్ సినిమా దర్శకుడి పాత్రలో కనిపిస్తారు. ఈ సినిమాలో మరో విశేషం ఏమిటంటే ప్రముఖ దర్శకులు హరీశ్ శంకర్, కల్యాణ్ శంకర్, అగ్ర నిర్మాతలు దిల్‌రాజు, నాగవంశీ అతిథి పాత్రల్లో మెరవనున్నారు. కథలో భాగంగానే ఈ పాత్రలు వస్తాయి, సహజమైన హాస్యాన్ని పండిస్తాయి.
- ఇది పూర్తి స్థాయి రొమాంటిక్ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. దర్శకుడు త్రివిక్రమ్ ఈ సినిమా చూసి కొన్ని విలువైన సూచనలు ఇచ్చారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ చిత్రం మెప్పిస్తుందనే నమ్మకం ఉంది.

కొత్త తరహా కథతో..



నటుడు, దర్శకుడు రవిబాబు మరో కొత్త చిత్రంతో వస్తున్నారు. 'ఏనుగు తొండం ఘటికాచలం' వంటి వినోదభరిత చిత్రం తర్వాత ఆయన తీస్తున్న 'రేజర్' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుంది. సీనియర్ నిర్మాత సురేశ్‌బాబు సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో రవిబాబు హీరోగా నటిస్తుండడం విశేషం. టెన్షన్, వైలెన్స్ అంశాలతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా పోస్టర్‌ను, గ్లింప్స్‌ను మంగళవారం విడుదల చేశారు. తెలుగు సినిమాల్లో ఇంతవరకూ చూడని కథాంశంతో రూపుదిద్దుకుంటున్న 'రేజర్' చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. వేసవిలో విడుదల చేస్తామని రవిబాబు చెప్పారు.

'ఏ' సర్టిఫికెట్ వచ్చినా... ఇది పక్కా ఫ్యామిలీ మూవీ



'ప్రతి మనిషి జీవితంలో ఒక ప్రయాణం ఉంటుంది. కానీ శివ జీవితంలోకి మిత్ర అడుగుపెట్టాక మొదలైన ఆ ప్రయాణం మాత్రం చాలా స్పెషల్. ఆ జర్నీలోని ఎమోషన్స్ ప్రతి ప్రేక్షకుడికీ కనెక్ట్ అవుతాయి' అని సంతోష్ శోభన్ అన్నారు. ఆయన హీరోగా, మానస వారణాసి హీరోయిన్‌గా నటించిన 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రం ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం మంగళవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత ధీరజ్ మొగిలినేని సెన్సార్ వివాదంపై స్పష్టతనిచ్చారు. "కపుల్ ఫ్రెండ్లీ' టైటిల్ మార్చమని సెన్సార్ వారు అడిగారు. కానీ కథకు అదే ప్రాణం కాబట్టి మేము రాజీపడలేదు. దాంతో 'ఏ' సర్టిఫికెట్ వచ్చింది. అంతే తప్ప కథలో ఎలాంటి అసభ్యత లేదు. ఇది పక్కా ఫ్యామిలీ మూవీ. ప్రతి కుర్రాడు తనను తాను సంతోష్ పాత్రలో చూసుకుంటాడు' అని చెప్పారు. ఈ సినిమాలో ప్రతి ఫ్రేమ్ ఒక అద్భుతంలా ఉంటుంది, ట్రైలర్ చూసి అందరూ బావుందని మెచ్చుకుంటుంటే చాలా సంతోషంగా ఉందని మానస వారణాసి తెలిపారు.

216 పారా లీగల్ వలంటీర్ పోస్టులు మంజూరు

» గౌరవ వేతనంగా రూ.5.91 కోట్లు మంజూరు: మంత్రి ఫరూక్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా న్యాయశాఖలో 216 పారా లీగల్ వలంటీర్ పోస్టులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి పోలీస్ సర్కిల్‌కూ ఒక పోస్టు చొప్పున మొత్తం 216 పోస్టులు మంజూరైనట్లు వెల్లడించారు. పిల్లల అదృశ్యం కేసులు, వారిపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల్లో పోలీసులకు, న్యాయసేవా సంస్థలకు సహాయకులుగా పారా లీగల్ వలంటీర్లు ఉంటారని తెలిపారు. వీరికి రోజుకు రూ.750 చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తామని, ఈ మేరకు ప్రభుత్వం రూ.5.91 కోట్ల మొత్తాన్ని మంజూరు చేసిందని పేర్కొన్నారు.

రంజాన్ నెలలో గంట ముందే పనివేళల ముగింపు

» ముస్లిం ఉద్యోగులకు సర్కారు అనుమతి

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రంజాన్ పవిత్ర మాసంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో పని చేసే ముస్లిం ఉద్యోగులందరూ సాయంత్రం పని వేళల ముగింపు కంటే ఒక గంట సమయం ముందుగానే విధులు ముగించుకుని బయటకు వెళ్లేందుకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ వేరు వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, స్వర్ణ, గ్రామ, వార్డు సచివాలయాలతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే ముస్లిం ఉద్యోగులందరికీ ఇది వర్తిస్తుందని తెలిపారు.

రాజధానిలో ఇళ్ల స్థలాలు కేటాయించండి

» మంత్రి లోకేశ్‌కు 'అప్సా' విన్నపం

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం (అప్సా) అధ్యక్షుడు జి.రామకృష్ణ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయం, అసెంబ్లీ ఉద్యోగులకు ప్రజా రాజధాని అమరావతిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసినవారిలో సంఘం జనరల్ సెక్రటరీ నాపా ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ పవన్ కుమార్, లక్ష్మణకుమారి తదితరులు ఉన్నారు.

భూసేకరణపై అంజుమన్ కమిటీతో చర్చిస్తాం: అజీజ్

అమరావతి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చినకాకానిలోని అంజుమన్ ఏ ఇస్లామియా వక్ఫ్ సంస్థకు చెందిన భూముల సేకరణ విషయంలో అంజుమన్ కమిటీ సభ్యులతో సమావేశమై చర్చించాలని తీర్మానించినట్లు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు

» జిల్లాకు 8 కేంద్రాల్లో ఏర్పాటుకు చర్యలు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సమస్యాత్మక పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వ పరీక్షల విభాగం చర్యలు ప్రారంభించింది. మార్చి 16 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాకు ఎనిమిది చొప్పున సమస్యాత్మకంగా ఉండే పరీక్ష కేంద్రాల వివరాలు పంపాలని ఆ విభాగం డీఈవోలను ఆదేశించింది.

ఎంఎస్ఎంఈ యూనిట్లకు సత్వర అనుమతులివ్వాలి

» అధికారులకు మంత్రి కొండపల్లి ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఎంఎస్ఎంఈ యూనిట్ల స్థాపనకు అవసరమైన అనుమతులను వెంటనే మంజూరు చేసి, త్వరితగతిన ప్రాజెక్టులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. అనుమతులిచ్చే విషయంలో అవసరమైతే నిబంధనలను సరళతరం చేసి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను వేగవంతం చేయాలన్నారు.

స్థానిక ఎన్నికలపై ఎస్ఈసీ అవగాహన సదస్సు

» ఈఆర్ఎంఎస్‌పై రాజకీయ పార్టీ నేతలకు వివరించిన అధికారులు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఓటర్ల జాబితా కంప్యూటరీకరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించేందుకు రాష్ట ఎన్నికల కమిషన్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలంసాహ్ని, కార్యదర్శి డాక్టర్ ఎ.మల్లికార్జునలు రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ రోల్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఈఆర్ఎంఎస్)ద్వారా స్థానిక సంస్థల ఓటర్ల జాబితాల తయారీ, అసెంబ్లీ ఓటర్ల జాబితా నుంచి గ్రామ పంచాయతీ/మున్సిపల్ వార్డుల వారీగా ఓటర్ల మ్యాపింగ్, ధృవీకరణ, తుది ఆమోద విధానాలను వివరించారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి: గుమ్మిడి

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. మంగళవారం గిరిజన గురుకుల ప్రిన్సిపాళ్లు, సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు, సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్వో ప్లాంట్లు అన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయా? ఇంకా ఏమైనా అవసరమా? అన్నది తెలియజేయాలని కోరారు.

2027 జూలై నుంచి పోలవరంలో విద్యుదుత్పత్తి

» శరవేగంగా విద్యుత్తు ప్రాజెక్టు పనులు: సీఎస్ విజయానంద్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పోలవరం జల విద్యుత్తు ప్రాజెక్టు పనులను మరింత వేగవంతం చేసి, 2027 జూన్-జూలై నాటికి విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం విద్యుత్తు రంగంపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 960 మెగావాట్ల పోలవరం జల విద్యుత్తు ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయని, మొత్తం 12 యూనిట్లలో 6-7 యూనిట్లు 2027 జూలై నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని, మిగతా యూనిట్ల పనులు 2028 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

నెడ్‌క్యాప్ ఎండీగా కమలాకర్‌బాబు మరో ఏడాది

» పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఏపీ నూతన పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్ఆర్ఈడీసీఏపీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎం.కమలాకర్‌బాబును మరో ఏడాది పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన సేవలను పరిగణనలోకి తీసుకుని ఈ పొడిగింపు ఇస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం జీవో నంబరు 8 విడుదలైంది.

ఉగాది పురస్కార గ్రహీతల ఎంపికకు కమిటీ

» చైర్మన్‌గా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉగాది పురస్కారాలు, కళారత్న (హంస) పురస్కారాలకు ప్రతిభావంతులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు పర్యాటక సాంస్కృతి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనతో పాటు పది మందిని సభ్యులుగా నియమించింది.

సోషల్ మీడియాకు వయసు పరిమితి విధించండి

» కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఎంపీ లావు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చిన్నారుల భవిష్యత్తును చిదిమేస్తున్న సోషల్ మీడియాను నియంత్రించాల్సిన అవసరం ఉందని టీడీపీ లోక్‌సభ పక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సోషల్ మీడియా వినియోగంపై వయో పరిమితి నిబంధనలను తీసుకురావాలని కోరుతూ కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం, కేంద్ర మంత్రితో భేటీ అయిన ఎంపీ ఈ మేరకు వినతిపత్రం అందించారు. సోషల్ మీడియా వినియోగానికి కనీస వయస్సును నిర్ణయించాలని, వయస్సు ధృవీకరణ పద్ధతులను కఠినంగా అమలు చేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై భారీ జరిమానాలు విధించాలని కోరారు.

యాక్..ఛీ... విషపు రాతలు

'ఆంధ్రజ్యోతి' స్థలంపై మళ్లీమళ్లీ తప్పుడు వాదనలు

» జీవీఎంసీలో ఒక్కరు వ్యతిరేకిస్తే మొత్తంగా తిరస్కరించినట్లుగా అచ్చోసిన అబద్ధాలు

» 2024 నవంబరు 29న హైకోర్టు తీర్పు

» తీర్పు వచ్చిన 9 నెలలకు కౌన్సిల్‌లో తీర్మానం

» ఇందులో అధికార బలప్రదర్శన ఎక్కడిది?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నిఖార్సయిన నిజాన్ని దాచిపెట్టి, ఒక పచ్చి అబద్ధాన్ని పదేపదే ప్రచారం చేయడం జగన్ రోత పత్రిక యాక్..ఛీకి ఉన్న అతిపెద్ద ప్రత్యేకత అని మరోసారి నిరూపించుకుంది. 'ఆంధ్రజ్యోతి'కి భూ కేటాయింపులను రద్దుచేయాలన్న జగన్ సర్కారు నిర్ణయాన్ని తప్పుపడుతూ హైకోర్టు ఉతికి ఆరేసింది. బుర్రపెట్టి ఆలోచించకుండా, భూ కేటాయింపులను రద్దుచేశారని కర్రుకాల్చి వాతలుపెట్టినా ఆయన రోతపత్రిక బుద్ధి మారలేదు. 'ఆంధ్రజ్యోతి'కి ఏదో చంద్రబాబు ప్రభుత్వం అడ్డగోలు మేళ్లు చేసినట్లుగా, చివరకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) సర్వసభ్య సమావేశంలో భూ మార్పిడి ప్రతిపాదనను తిరస్కరించినా దొడ్డిదారిన ఆమోదించారంటూ కట్టుకథలను వండివారుస్తోంది. కౌన్సిల్ తీర్మానంతో గోల్‌మాల్ అంటూ కబోదిరాతలు అచ్చేసింది. కూటమి సర్కారు ఆయాచిత లబ్ధి చేకూరిస్తేనో, జీవీఎంసీలో అడ్డగోలు మేలు చేయడం వల్లనో 'ఆంధ్రజ్యోతి'కి మేలు జరగలేదు. జగన్ ప్రభుత్వం కుట్రపూరితంగా, ఉద్దేశ్యపూర్వకంగా 'ఆంధ్రజ్యోతి'ని దెబ్బతీయాలని భూ కేటాయింపులను రద్దుచేస్తూ తీసుకున్న నిర్ణయాల వల్ల న్యాయ పోరాటం చేయడం ద్వారానే ఆ స్థలం దక్కింది. ఇటు రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో, అటు జీవీఎంసీలోనూ నిబంధనల ప్రకారమే 'ఆంధ్రజ్యోతి'కి ఆమోదాలు, అనుమతులు లభించాయి. వాస్తవాలకు జగన్ మార్క్ అబద్ధాలతో మసిపూసి అడ్డగోలు లబ్ధి చేస్తున్నారని విషపురాతలతో ప్రచారం చేయడం ద్వారా తన నీచబుద్ధిని పదేపదే ప్రదర్శించుకుంటోంది రోతపత్రిక.

హైకోర్టు తీర్పును ఎందుకు ప్రస్తావించదు?

'ఆంధ్రజ్యోతి'కి ఎప్పుడో 1986లోనే విశాఖలోని పరదేశీపాలెంలో 1.5 ఎకరాల భూమిని నాడున్న మార్కెట్ రేటు(రిజిస్ట్రేషన్ బుక్ వాల్యూ)కు కేటాయించారు. ఆ భూ కేటాయింపును సమర్థిస్తూ 1991 సెప్టెంబరు 25న పరదేశీపాలెం గ్రామ పంచాయతీ తీర్మానం చేసింది. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం వచ్చాక ఆ భూమిని వెనక్కి తీసుకోవాలని కుట్రచేసింది. తొలుత నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని, ఆ భూమిని వెనక్కి తీసుకుంటామని 2019లో జగన్ సర్కారు వచ్చీరాగానే నోటీసులు ఇచ్చింది. 'ఆంధ్రజ్యోతి' హైకోర్టును ఆశ్రయించగా, నిబంధనల ప్రకారమే నడుచుకోవాలని సర్కారును ఆదేశించింది. చివరకు ప్రజాప్రయోజనాల ఉల్లంఘన జరుగుతోందంటూ భూ కేటాయింపును రద్దుచేస్తూ 2020 జనవరి 30న జగన్ సర్కారు ఉత్తర్వులు(జీఓ21) జారీ చేసింది. ఆ ఉత్తర్వులపై 'ఆంధ్రజ్యోతి' హైకోర్టును ఆశ్రయించింది. సర్కారు నోటీసులు, ఉత్తర్వులను పరిశీలించి 'ఆంధ్రజ్యోతి'కి భూమి కేటాయింపు ఉత్తర్వుల రద్దు విషయంలో ప్రభుత్వం బుర్రపెట్టి పనిచేయలేదని, ఇచ్చిన నోటీసులకు, రద్దు ఉత్తర్వులో పేర్కొన్న అంశాలకు ఏమాత్రం సంబంధం లేదంటూ సర్కారు చర్యను హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. భూ కేటాయింపు రద్దు ఉత్తర్వులను అంటే జీఓ 21 అమలును నిలిపివేసింది. హైకోర్టు తీర్పు 2024 నవంబరు 29న వచ్చింది. ఆ తీర్పు ఆధారంగానే తగిన చర్యలు తీసుకోవాలని నాటి రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నెల రోజుల తర్వాత అంటే, డిసెంబరులో విశాఖ కలెక్టర్‌కు లేఖ రాశారు. తదనంతర చర్యలు అంటే, చట్టబద్ధమైన చర్యలు తీసుకోమనే కదా! ఒకవేళ హైకోర్టు తీర్పును అమలు చేయకపోతే ఏమవుతుంది? అది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది. విశాఖ కలెక్టర్, రెవెన్యూ అధికారులు కోర్టుకు హాజరవ్వాల్సి ఉంటుంది. అయినా, హైకోర్టు తీర్పు అమలు వేగంగా జరగలేదు. తమకిచ్చినభూమి బఫర్ జోన్‌లో ఉంది కాబట్టి, దాని పక్కనే ఉన్న హౌసింగ్‌బోర్డు భూమిని ఇవ్వాలని 'ఆంధ్రజ్యోతి' 2024 డిసెంబరులోనే ప్రభుత్వాన్ని కోరింది. నిజంగా 'ఆంధ్రజ్యోతి' తన అధికారబలం ఉపయోగించి ఉంటే, అదే నెలలో జీవీఎంసీని అత్యవసరంగా సమావేశపరచి గుట్టుచప్పుడు కాకుండా ఆమోదం తీసుకునేది. కానీ, 'ఆంధ్రజ్యోతి' చట్టబద్ధంగా, నిబంధనల మేరకే నడుచుకుంది. అందుకే, 2025 ఆగస్టులో నాటి కలెక్టర్ ఆదేశాల మేరకు జీవీఎంసీలో తీర్మానం ప్రవేశపెట్టారు. హైకోర్టు తీర్పు అమలులో భాగంగానే, భూ మార్పిడి ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకొనే జీవీఎంసీ ఆమోదం కోసం ప్రతిపాదన చేశారు. జగన్ రోత పత్రిక వాటిని ప్రస్తావించదు. ఎందుకంటే, తనను పెంచిపోషించిన జగన్ సర్కారు బండారం బయటపడుతుంది. అందుకే, కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టి 'ఆంధ్రజ్యోతి'కి ప్రభుత్వం మేలుచేసిందన్న తప్పుడు రాతలను అచ్చేస్తోంది.

submitted its reply to allegations in the show cause notice. The final order passed under the show cause notice has referred to certain discrepancies alleged to have been occurred in the allotment, thus cancelled the allotment. It appears, in respect of the said discrepancies, mentioned in the impugned order, the petitioner was never put on notice. The order thus passed amounts to a violation of the earlier directions of this court and also renders the show cause notice a travesty. Therefore, it can safely be construed that the order passed is without notice to the petitioner, and is in violation of the principles of natural justice and suffers from non application of mind for taking into consideration irrelevant factors while passing order of resumption. For all the above stated reasons, the order impugned in the Writ Petition is liable to be set aside. Accordingly the proceedings of the 1st respondent in G.O.Ms.No.21, dated 30-01-2020, are set aside.

'ఆంధ్రజ్యోతి'కి భూకేటాయింపును రద్దు చేస్తూ జగన్ సర్కారు తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని పక్కన పెడుతూ హైకోర్టు జారీ చేసిన ఆదేశమిది! నాటి జగన్ ప్రభుత్వం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా, బుర్ర ఉపయోగించకుండా నిర్ణయం తీసుకుందంటూ హైకోర్టు చీవాట్లు పెట్టింది. చట్టప్రకారం ముందుకెళ్లాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 'కౌన్సిల్ ఆమోదం' పేరుతో రోతరాతలు రాస్తున్న 'యాక్ ఛీ' పత్రిక హైకోర్టు ఉత్తర్వుల గురించి మాత్రం కిమ్మనడంలేదు.

భిన్నాభిప్రాయానికి, తిరస్కరణకు తేడా తెలియదా!

హైకోర్టు 2024 నవంబరు 29న ఇచ్చిన ఆదేశాల మేరకు 'ఆంధ్రజ్యోతి' తిరిగి తన భూమిని దక్కించుకుంది. ఆ భూమిలో కొంత భాగం బఫర్ జోన్‌లో ఉంది కాబట్టి, దాన్ని వినియోగించుకోలేమని, దాని స్థానంలో తమ స్థలం వెనకే ఖాళీగా ఉన్న హౌసింగ్ బోర్డు భూమిని ఇవ్వాలని 2024లోనే 'ఆంధ్రజ్యోతి' ప్రభుత్వానికి దరఖాస్తు ఇచ్చింది. నిజంగా అధికారాన్ని అడ్డంపెట్టుకొని, ప్రభుత్వ పెద్దలను ఒత్తిడిచేసి ఉంటే 2024 డిసెంబరు, లేదా 2025 జనవరిలోనే 'ఆంధ్రజ్యోతి' కోరుకున్నట్లుగా భూమి మార్పిడి ఉత్తర్వులు వచ్చేవి. ఆఘమేఘాల మీద జీవీఎంసీ తీర్మానాలు దక్కేవి. కానీ, 'ఆంధ్రజ్యోతి' ఆ పని చేయలేదు. చట్టబద్ధంగా, నిబంధనల మేరకే నడుచుకుంది. దీంతో దరఖాస్తు పెట్టిన 9 నెలలకు, అంటే 2025 ఆగస్టు 22న భూమి మార్పిడి ప్రతిపాదనపై చర్చించేందుకు జీవీఎంసీలో చర్చకు పెట్టారు. 2025 ఆగస్టు 22న రాత్రి 9 గంటలకు సమావేశాన్ని వాయిదా వేద్దామనుకున్నారు. కానీ, హైకోర్టు తీర్పులతో ముడిపడిన రెండు అంశాలు అంటే 66, 67 అజెండాలు ఉన్నాయని, వాటిపై కూడా చర్చించాలని అధికారులు జీవీఎంసీ చైర్మన్‌కు సూచించారు. ఆ మేరకు ఆ రెండింటిపై కూడా చర్చ జరిగింది. 'ఆంధ్రజ్యోతి' భూమి ప్రతిపాదన అంశం చర్చకొచ్చినప్పుడు వైసీపీకి చెందిన సభ్యులు ఒకరు వ్యతిరేకించారు. అది భిన్నాభిప్రాయం మాత్రమే. మెజారిటీ సభ్యులు ఆ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. ఇదీ జరిగింది. కానీ, రోతపత్రిక మాత్రం 'ఆంధ్రజ్యోతి' భూమి మార్పిడి ప్రతిపాదనను కౌన్సిల్ తిరస్కరించిందంటూ విషం కక్కింది. జీవీఎంసీలో అధికారపక్షం టీడీపీ. వైసీపీ బలం స్వల్పం. ఆగస్టు 22 నాటి సమావేశంలో 'ఆంధ్రజ్యోతి' ప్రతిపాదనను వ్యతిరేకించిన సభ్యులు ఒక్కరే.

నిబంధనల ప్రకారం మెజారిటీ ఆమోదం ఉన్నదే చెల్లుబాటవుతుంది. ఆ మేరకే జీవీఎంసీ ప్రతిపాదనకు అనుకూల తీర్మానం చేసింది. రోతపత్రికకు తెలియని విషయమా ఇది. కానీ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు పిచ్చిరాతలు అచ్చేసింది. మెజారిటీ సభ్యులు ఆమోదించిన ప్రతిపాదనను తిరస్కరణకు గురయిందంటూ అచ్చోసిన అబద్ధాలను ప్రచారం చేయడం రోతపత్రికకే చెల్లింది.

గోల్‌మాల్ ఎవరిది?

'ఆంధ్రజ్యోతి' చట్టబద్ధంగా, నిబంధనల మేరకే భూమిని పొందింది. ఎక్కడా అధికార బలప్రదర్శనకుగానీ, రాజకీయ ఒత్తిళ్లకుగానీ దిగలేదు. అందుకే, హైకోర్టు తీర్పు వెలువడిన 13 నెలలకు భూమి మార్పిడి ఉత్తర్వులు దక్కించుకుంది. జగన్ ప్రభుత్వం చేసిన తప్పుడు పనులపై సుదీర్ఘ న్యాయపోరాటం చేసిన 'ఆంధ్రజ్యోతి' ధర్మం పక్కనే ఉంటుంది. కుట్రపూరితంగా, కనీసం నిబంధనలు పాటించకుండా గిట్టనివారిని దెబ్బతీసే నైజం జగన్‌ది. ఆయన భావజాలాన్ని పునికిపుచ్చుకొని అబద్ధాలనే అచ్చేసే రోతపత్రికది. చర్చ అనంతరమే భూమికేటాయింపు ప్రతిపాదనకు ఆమోదం లభించింది. అయినా, తిరస్కరించిన ప్రతిపాదన అంటూ కొత్త అబద్ధానికి రోతపత్రిక తెరలేపింది. హైకోర్టు ఆదేశాలతో ముడిపడిన ఈ ప్రతిపాదనను జీవీఎంసీ తిరస్కరించగలదా? ఒక సభ్యుడు వ్యతిరేకించారు కాబట్టి అది తిరస్కరణకు గురైందన్న భ్రమలో అబద్ధాలను అచ్చేయడం రోతపత్రికకే చెల్లింది. చట్టప్రకారం జరిగిన తీర్మానంలో గోల్‌మాల్ ఉందని అబద్ధాలను ప్రచారంచేయడం యాక్..ఛీ పత్రిక నైజం. హైకోర్టు తీర్పును దాచిపెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించడం కన్నా గోల్‌మాల్ మరొకటి ఉంటుందా?

అవును అది లాంఛనమే

'ఆంధ్రజ్యోతి'పై రోతపత్రిక మరో అబద్ధాన్ని, నిందను మోపింది. జీవీఎంసీ ఆమోదం లాంఛనమే అని చెప్పడం ద్వారా స్థానిక సంస్థలను చిన్నచూపు చూస్తోందని నిజాలకు మసిపూసే ప్రయత్నం చేసింది. హైకోర్టు తీర్పు తర్వాత 'ఆంధ్రజ్యోతి'కి భూ కేటాయింపును పునరుద్ధరించక తప్పదు. లేదంటే కోర్టు ధిక్కరణ అవుతుంది. ఉపయోగానికి వీలులేకుండా బఫర్ జోన్‌లో ఉన్న భూమిని తీసుకొని, కొత్తగా మరో చోట భూమి ఇవ్వాల్సింది ప్రభుత్వమే. ఎందుకంటే, 'ఆంధ్రజ్యోతి' ఆ భూమికి మార్కెట్ ధర చెల్లించింది. చట్టపరమైన, విధానపరమైన నిబంధనలను పాటించాల్సింది అధికారులే. హైకోర్టు తీర్పును సకాలంలో అమలు చేయాల్సింది రెవెన్యూ, జీవీఎంసీలే. తీర్పు వచ్చిన తర్వాత అంటే 9 నెలలకు కూడా కీలకమైన ప్రక్రియ ముందుకు సాగలేదు కాబట్టే అధికారులు 'ఆంధ్రజ్యోతి' ప్రతిపాదనకు ఆ సమావేశంలో తప్పనిసరిగా ఆమోదం తెలపాల్సి ఉంది. అందుకే, సమావేశాన్ని చివరలో వాయిదా వేద్దామనుకున్న తర్వాత అజెండాలోని రెండు అంశాలు ఇంకా ఉన్నాయని, వాటిపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఆ తర్వాతే, 66, 67 అజెండాలపై చర్చ జరిగింది. 67వ అంశంగా ఉన్న 'ఆంధ్రజ్యోతి' ప్రతిపాదనను ఆమోదించారు. అది లాంఛనంగానే జరగాల్సి ఉంది.



ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల ఫలితాలను ఆన్‌లైన్‌లో వెల్లడిస్తున్న రిటర్నింగ్ అధికారి డీఎస్ చక్రధరబాబు

ఏపీఎంసీ ఎన్నికల్లో టాపర్ కోల అలేఖ్య

» బొల్ల మౌనిక, మనీష్‌కు ద్వితీయ.. తృతీయ స్థానాలు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జరిగిన ఏపీ వైద్య మండలి (ఏపీఎంసీ) ఎన్నికల్లో కోల అలేఖ్య 10,293 ఓట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. 10,189 ఓట్లతో బొల్ల మౌనిక ద్వితీయ, 10,123 ఓట్లతో మనీశ్ మండల తృతీయ స్థానాల్లో నిలిచారు. మొత్తం 13 సభ్యులుగా ఎన్నికయ్యారని ఆరోగ్యశాఖ సెక్రటరీ సౌరబ్ గౌర్ తెలిపారు.

ఎన్నికైన సభ్యులు వీరే : కోల అలేఖ్య, బొల్ల మౌనిక, మనీష్ మండల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా.. మంతిని వినోద్‌కుమార్ (9,857), అరవ వెంకట సుబ్బారెడ్డి (9,174), ఓ.శివమౌర్య గుప్త (8,894), ఇసుకపల్లి వాణి (8,819), ఎం.వెంకటరమణ (8,632), మెట్ల జయచంద్రారెడ్డి (8,494), బొలెం తేజీ నవీన్ (7,820), గార్లపాటి నంద కిశోర్ (7,705), శ్రీహరి కరువ (7,553), కార్తీక్‌తుమ్మల (7,154) సభ్యులుగా ఎన్నికయ్యారని తెలిపారు.

1.11 కోట్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు

» డీ-వార్మింగ్ డే ఏఐ వీడియో విడుదల చేసిన మంత్రి సత్యకుమార్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1.11 కోట్ల మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు అందిస్తామని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకమార్ తెలిపారు. జాతీయ డీ వార్మింగ్ డే సందర్భంగా రూపొందించిన ఏఐ వీడియోను మంత్రి విడుదల చేశారు. పిల్లల ఆరోగ్యంపై పురుగుల ప్రభావం, పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా రూపొందించిన వీడియోను విడుదల చేశారు.

బోదకాలు నివారణకు చర్యలు

» మాత్రల పంపిణీని ప్రారంభించిన కేంద్ర మంత్రి నడ్డా

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): బోదకాలు (ఫైలేరియా) నివారణ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన జిల్లాల్లో ఉండే వారికి మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. వర్చువల్ విధానంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం నుంచి ప్రారంభించారు. రాష్ట్రంలోని ఉమ్మడి విజయనగరం జిల్లాలోని గుర్ల, బలిజపేట మండలాల్లో నివాసం ఉంటే 1,31,229 మందికి డీఈసీ, అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తారు. ఏడాదికి ఒకసారి మాత్రమే ఈ మాత్రలను అందిస్తారు.

యథావిధిగా ట్రస్ట్ ఉద్యోగుల సేవలు

» ప్రభుత్వం చెల్లిస్తున్నవిధంగానే జీతభత్యాలు

» యూనివర్సల్ హెల్త్ బిడ్డర్లకు అధికారుల సూచన

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ఆధ్వర్యంలో పని చేస్తున్న వైద్య మిత్రలు, ఇతర ఉద్యోగుల సేవలను యథావిధిగా కొనసాగించాలని 'యూనివర్సల్ హెల్త్' బిడ్డర్లకు ఆరోగ్యశాఖ అధికారులు స్పష్టం చేశారు. యూనివర్సల్ హెల్త్‌కు సంబంధించిన చివరి ప్రీ బిడ్ మీటింగ్ మంగళవారం.. మంగళగిరిలోని ఏపీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కంపెనీలకు అధికారులు కీలక సూచనలు చేశారు. ట్రస్ట్‌లో పని చేస్తున్న వారికి ప్రభుత్వం చెల్లిస్తున్నవిధంగానే జీత,భత్యాలు ఉండాలని ఎండీ వీరపాండియన్, ట్రస్ట్ సీఈవో దినేష్‌కుమార్ తేల్చి చెప్పారు. ట్రస్ట్ తరపున పనిచేసేవారందరి సేవలను యథావిధిగా టెండర్ల ద్వారా ఎంపికయ్యే బీమా కంపెనీలు కొనసాగించాలని స్పష్టం చేశారు.

ఆల్మట్టిపై ఇన్ని అబద్ధాలా?

» ఎత్తు పెంపును వ్యతిరేకిస్తూ టీడీపీ ప్రభుత్వాల పోరు

» కేంద్రానికి ఎన్టీఆర్,బాబు లేఖాస్త్రాలు

» 'సాక్షి'పై మంత్రి నిమ్మల ఆగ్రహం



అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటక తలపెట్టిన ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంపును వ్యతిరేకిస్తూ టీడీపీ ప్రభుత్వాలు చేసిన పోరాటాలకు చారిత్రక ఆధారాలున్నాయని రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అయినప్పటికీ వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం జగన్ రోతపత్రిక ఆల్మట్టి డ్యాంపై పూర్తి అసత్యాలను ప్రచురించిందని ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. '1963 నవంబరు 28వ తేదీన ప్రణాళికా సంఘం కర్ణాటకలో ఎగువ కృష్ణా ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చింది. ఇందులో ఆల్మట్టి, నారాయణపూర్ ప్రధాన డ్యాములు. వీటిని మూడు దశల్లో నిర్మించేందుకు కర్ణాటక ప్రతిపాదించింది. 1976లో కృష్ణా ట్రిబ్యునల్-1 ఎగువ కృష్ణా ప్రాజెక్టుల తొలిదశ కింద 155 టీఎంసీల వినియోగానికి అనుమతించింది. ఆ రాష్ట్రం తన మాస్టర్ ప్లాన్-2002 ప్రకారం అప్పర్ కృష్ణా రెండో దశలో 173 టీఎంసీలను కేటాయిస్తూ ఆల్మట్టి డ్యాం ఎత్తును 519.60 మీటర్లుగా నిర్ణయించింది. దీనిని వ్యతిరేకిస్తూ నాటి సీఎం ఎన్టీఆర్ 1987 జనవరి 29 నుంచి 1989 డిసెంబరు రెండో తేదీ మధ్య కేంద్రానికి ఐదు లేఖలు రాశారు. 1996 మార్చి 17 నుంచి 1997 మార్చి 21 మధ్య కాలంలో అప్పటి సీఎం చంద్రబాబు ఏకంగా 18 లేఖలు రాశారు. ఆల్మట్టి నిర్మాణంతో ఏపీకి జరిగే నష్టాన్ని వివరించారు. 1998 జూలై 21న టీడీపీ ఎంపీ ఎర్రన్నాయుడు.. ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంపుతో ఆంధ్రప్రదేశ్‌పై పడే ప్రతికూలతలను వివరిస్తూ ప్రధానికి లేఖ రాశారు. ఆల్మట్టి ఎత్తు 519.60 మీటర్లకు పెంచేందుకు ఏపీ అంగీకరించడం లేదని 1998 అక్టోబరు పదో తేదీన నాటి కేంద్ర విద్యుత్ మంత్రికి చంద్రబాబు లేఖ రాశారు. 1999 డిసెంబరు 3వ తేదీన ఢిల్లీలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి.. ఆల్మట్టి ఎత్తుకు అంగీకరించేది లేదని అదే రోజున ప్రధాని వాజపేయికి చంద్రబాబు లేఖ అందించారు. 2000 ఏప్రిల్ 25న ఆల్మట్టి డ్యాం ఎత్తును 519.60 మీటర్లకు ఆమోదిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. 524 మీటర్ల ఎత్తులో నిర్మించడంపై అభ్యంతరాలుంటే ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని ఆంధ్రప్రదేశ్‌కు సూచించింది. 2004ఏప్రిల్ 2న కృష్ణానదీ జలవివాద ట్రిబ్యునల్-2 ఏర్పాటైంది. 2010 డిసెంబరు 30న 524 మీటర్ల ఎత్తుకు అనుమతి ఇచ్చింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ ఏపీ 2011 మార్చి 28న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది. దీంతో గెజిట్‌ను ప్రచురించవద్దని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. 2013 నవంబరు 29న ట్రిబ్యునల్-2 డ్యాం ఎత్తు పెంచుకోవచ్చంటూ మరో తీర్పు ఇచ్చింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఏపీ 2014 జనవరి 16న సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేసింది. చంద్రబాబు 2024 నవంబరు 3న, 2025 నవంబరు 22న లేఖలు రాశారు. డిసెంబరు 18న మరో లేఖను రాశారు. అయినా జగన్ రోతపత్రిక అబద్ధాలతో బొంకుల కథనం అల్లింది'అని నిమ్మల ఆగ్ర హం వ్యక్తం చేశారు.



తండ్రి ద్రోహాన్ని కప్పేసి..

తన నిర్లక్ష్యానికి ముసుగేసి..!

(మొదటి పేజీ తరువాయి)

చుట్టేందుకు విషపూరిత కథనం ప్రచురించిందని ధ్వజమెత్తాయి. ఆల్మట్టి డ్యాం ఎత్తును 519.6 మీటర్ల నుంచి 525.256 మీటర్లకు పెంచాలని కర్ణాటక ప్రభుత్వం గతంలోనే ప్రతిపాదించింది. 2004 ఏప్రిల్ 2వ తేదీన జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ సారథ్యంలో కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 ఏర్పడింది. అప్పట్లోనే కర్ణాటక ఆల్మట్టి ఎత్తు పెంపును ప్రతిపాదిస్తే.. నాడు ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ట్రిబ్యునల్ ముందు సమర్థ వాదనలు వినిపించలేదు. ఆల్మట్టి ఎత్తు పెంపును నిరసిస్తూ సుప్రీంకోర్టులోనూ న్యాయపోరాటం చేయలేదు. తద్వారా రాష్ట్రాన్ని ముంచేశారంటూ అప్పట్లో ఆగ్రహావేశాలు వెల్లువెత్తాయి. 2004 నుంచి 2009 సెప్టెంబరు దాకా అధికారంలో ఉన్న రాజశేఖర్‌రెడ్డి ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంపును నిలువరించేందుకు ఒక్క ప్రయత్నమూ చేయలేదు. దీనిని నిరసిస్తూ రాష్ట్ర రైతాంగం మాత్రం పెద్ద ఎత్తున ధర్నాలు చేసింది.

నిద్రాణంగా ఉండిపోయి..: 2019లో జగన్ అధికారంలోకి వచ్చాక ఆల్మట్టి ఎత్తు పెంపును పట్టించుకోనేలేదని.. పైగా తెలంగాణ తలపెట్టిన జల దోపిడీని కూడా ఏనాడూ ప్రశ్నించలేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. 'ఇరుగు పొరుగు రాష్ట్రాల మధ్య సఖ్యత కావాలని.. నదీ జలాల విషయంలో ఇచ్చిపుచ్చుకునే ధోరణితో మెలగాలంటూ నాటి తెలంగాణ సీఎం కేసీఆర్‌తో కలిసి కలిసి మీడియా ఎదుట సుద్దులు చెప్పారు. ఆల్మట్టి ఎత్తు పెంచొద్దంటూ కర్ణాటక ప్రభుత్వానికి లేఖలు రాయలేదు. ఆ రాష్ట్ర సీఎంలతో సంప్రదింపులు కూడా జరుపకుండా రాష్ట్రానికి ద్రోహం చేశారు. ఏపీ పిటిషన్ సివిల్ దావాగా మారిన సందర్భంలోనూ న్యాయపోరాటం చేయకుండా నిద్రాణంగా ఉండిపోయారు. చంద్రబాబు మాత్రం అప్పుడు, ఇప్పుడూ దీనిపై న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు' అని పేర్కొన్నాయి. రాష్ట్ర ప్రయోజనాల కోసం చంద్రబాబు గట్టిగా పోరాడుతుంటే.. ప్రతిపక్ష నేతగానూ, ముఖ్యమంత్రిగానూ పదేళ్ల పాటు వీటిపై దృష్టి పెట్టని జగన్ తన విషపత్రికలో మాత్రం కర్ణాటక ఇప్పుడే ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచుతున్నట్లుగా.. కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందన్నట్లుగా విషం చిమ్ముతున్నారని టీడీపీ నేతలు కూడా మండిపడుతున్నారు. ఏమాత్రం వాస్తవం లేని తప్పుడు కథనాలతో రాష్ట్ర రైతాంగాన్ని రెచ్చగొట్టాలని చూస్తున్నారని.. కానీ అన్నదాతలు ఆయన మోసాన్ని ఇదివరకే గ్రహించారని అంటున్నారు. ఇటీవల రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసమంటూ వైసీపీ నేతలతో పోతిరెడ్డిపాడు వద్ద జగన్ జరిపించిన బహిరంగ సభ తుస్సుమందని.. దీనికి రైతులెవరూ రాకపోగా.. హాజరైన రైతు సంఘాల నేతలు రాయలసీమ ప్రాజెక్టులను జగన్ నిర్లక్ష్యం చేశారని విమర్శించారని చెబుతున్నారు. రైతులను నేరుగా రెచ్చగొట్టే ప్రయత్నాలు విఫలం కావడంతో.. ఇప్పుడు తన రోతపత్రికలో తప్పుడు కథనాలు వండి వారుస్తున్నారని మండిపడుతున్నారు. సీమ ప్రాజెక్టులపై జగన్ తీవ్ర నిర్లక్ష్యం.. ఇసుక దోపిడీకి అన్నమయ్య డ్యాంనే బలిగొన్న వైనాన్ని ప్రత్యక్షంగా చూసిన రైతాంగం 2024 ఎన్నికల్లో వైసీపీని చావుదెబ్బ కొట్టిందని గుర్తుచేస్తున్నారు. చేయని పనులు కూడా గొప్పగా చేసినట్లు భ్రమింపజేయడానికి ఇలాంటి విషపు కథనాలతో చేసే ప్రచారానికి ప్రజల మద్దతు దక్కదని టీడీపీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

నేడు క్యాబినెట్ సమావేశం

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి మండలి సమావేశం బుధవారం మధ్యాహ్నం జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో విశాఖపట్నం గూగుల్ డేటా సెంటర్‌కు సంబంధించిన కీలక అంశం చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈ నెల 3న జరిగిన క్యాబినెట్ సమావేశంలో అజెండా అంశాలను పక్కన పెట్టి తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపైనే చర్చించారు. ఆ అజెండా అంశాలనూ ఈ సమావేశంలో చర్చించనున్నారు.

ఉభయ సభలనుద్దేశించి సందేశమివ్వండి

- గవర్నర్‌ను కలిసి ఆహ్వానించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఉభయ సభలను ఉద్దేశించి సందేశం ఇవ్వాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కోరారు. మంగళవారం సాయంత్రం లోక్‌భవన్‌లో ఆయన, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్... గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్, గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం సమావేశాల నిర్వహణపై గవర్నర్‌కు వివరించారు.

అసెంబ్లీకి రాకపోవడం ప్రజలను అవమానించడమే: కాలువ

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో జరిగే చర్చలకు దూరంగా ఉండటం అంటే ప్రజలిచ్చిన అధికారాన్ని అవమానించినట్లేనని ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాలకు రాకుండా వైసీపీ ఎమ్మెల్యేలు ప్రజలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. 'వైసీపీ ఎమ్మెల్యేలు గత 4 అసెంబ్లీ సమావేశాలకూ డుమ్మా కొట్టారు. గవర్నర్ ప్రసంగం రోజు మొక్కుబడిగా రావడం, పేపర్లు చించేయడం, వెళ్లిపోవడం... లక్షల మంది ప్రజలు ఎన్నో ఆశలతో ఎన్నుకున్న ఎమ్మెల్యేల ప్రవర్తన ఉండాల్సిన తీరు ఇదేనా? ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, సమస్యలను ప్రస్తావించేందుకు అసెంబ్లీ అద్భుతమైన వేదిక. దాన్ని వైసీపీ సభ్యులు సద్వినియోగం చేసుకోకుండా అరాచక వైఖరిని చాటుకుంటున్నారు' అని విమర్శించారు.

'మన మిత్ర'లో మైక్రో ఇరిగేషన్ సేవలు: అచ్చెన్న

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): 'మన మిత్ర' వాట్సాప్ గ్రూప్ ద్వారా ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు సేవల్ని కూడా రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు తమ మొబైల్ ఫోన్ ద్వారా 9552300009 నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని పంపితే, వివిధ సేవల వివరాలు వస్తాయని, అందులో ఉద్యాన శాఖ పరిధిలోని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ)ని ఎంపిక చేసుకోవాలన్నారు. సబ్సిడీ కోసం నమోదు చేసుకుని, దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చన్నారు. గ్రీవెన్స్ నమోదు, నాన్-సబ్సిడీ చెల్లింపులు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ సిస్టమ్, సోలార్ పంపులు, వంటి బిందు, సూక్ష్మసేద్య పరికరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే సౌకర్యంతోపాటు నగదు చెల్లింపు సేవలు కూడా ఇంటి నుంచే పొందవచ్చన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సీసీ కెమెరాలు: మంత్రి

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలన్నింటిలోనూ ఏపీ ఫైబర్‌నెట్ సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఏపీ ఫైబర్‌నెట్ ఉన్నతాధికారులకు రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనాశాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి ఆదేశించారు. ఇటీవల సంక్షేమ వసతి గృహాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో బీసీ వసతి గృహాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరని చెప్పారు. మంగళవారం సచివాలయంలో ఫైబర్‌నెట్ ఎండీ గీతాంజలి శర్మ తదితర ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. రానున్న రోజుల్లో టెక్నాలజీని మరింతగా ఉపయోగించుకుని వినియోగదారులకు సేవలు అందించాలని ఎండీ గీతాంజలి శర్మకు సూచించారు. వచ్చే ఖరీఫ్ నుంచి డ్రోన్ సాంకేతికతను ఉపయోగించుకుని వ్యవసాయం చేసేలా చర్యలు చేపట్టాలని డ్రోన్ కార్పొరేషన్ ఎండీ శౌర్యమాన్‌ను మంత్రి ఆదేశించారు.

కల్తీ నెయ్యి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ప్రధాని, సీఎంకు యదుగిరి యతిరాజ మఠం లేఖ

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగినట్లు సిట్ తేల్చడం అత్యంత బాధాకరమని కర్ణాటకలోని ప్రతిష్ఠాత్మక యదుగిరి యతిరాజ మఠం ప్రధాన ఆచార్యులు శ్రీ యదుగిరి యతిరాజ నారాయణ రామానుజ జీయర్ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. 'కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీసి, ఇంత పెద్ద అపచారానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలి. తిరుమల వేంకటేశ్వరుడు వందల కోట్ల మందికి ఆరాధ్య దైవం. ఆగమ శాస్త్రాల ప్రకారం పూర్తి పరిశుద్ధంగా ఉండాల్సిన ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో తయారు చేసి సర్వలోకేశ్వరుడైన ఏడుకొండల దేవుడికి నివేదించడం మహాపాతకం. భవిష్యత్తులో ఇటువంటి ఘోరాలకు ఎవ్వరూ పాల్పడే ఆలోచన చేయకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి' జీయర్ స్వామి కోరారు.

నేటి నుంచే అసెంబ్లీ

- ఉ.11 గంటలకు ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం
- అనంతరం బీఏసీ సమావేశం

అమరావతి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఉదయం 10 గంటలకు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు మొదలవుతాయి. అనంతరం సభా వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) భేటీ అవుతుంది. సభ ఎన్ని రోజులు నిర్వహించాలో అక్కడ ఖరారుచేస్తారు. సమావేశాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. సమావేశాలు సజావుగా సాగేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధుల రాకపోకలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయం, అసెంబ్లీ చుట్టూ ఖాళీ ప్రాంతం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నాలుగు వైపులా పటిష్ఠ బందోబస్తుతోపాటు అధునాతన సమాచార, సాంకేతిక వ్యవస్థతో గట్టి నిఘా ఏర్పాట్లు చేయాలన్నారు. అసెంబ్లీలో సభ్యులు అడిగే ప్రశ్నలకు శాఖల అధికారులు సకాలంలో సమాధానాలు పంపాలని స్పీకర్ ఆదేశించారు. ముఖ్యంగా ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌లో అడిగే ప్రశ్నలకు సంబంధిత శాఖల నుంచి కచ్చితమైన సమాధానాలు సకాలంలో అందాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ స్పందిస్తూ.. సభ్యులు అడిగే ప్రశ్నలు నమోదు చేసుకుని వాటికి సకాలంలో సమాధానాలు పంపేందుకు ప్రతి శాఖకు ఒక నోడల్ అధికారిని నియమించామని తెలిపారు. గత సమావేశాల్లో శాసనసభకు సంబంధించి 283 ప్రశ్నలకు, శాసనమండలికి సంబంధించి 562 ప్రశ్నలకు ఇంకా వివిధ ప్రభుత్వ శాఖల నుంచి సమాధానాలు రావలసి ఉందని, దీనిపై వెంటనే సంబంధిత శాఖల కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. సభలో సభ్యులు అడిగే ప్రశ్నలను మానిటర్ చేసేందుకు వీలుగా జీఏడీలో ప్రత్యేకంగా పోర్టల్‌ను కూడా సిద్ధం చేశామని, దాని ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సకాలంలో సమాధానాలు పంపేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు వారం రోజుల్లో శాఖల నుంచి సమాధానాలు రావలసి ఉందని చెప్పారు. వచ్చే వర్షాకాల సమావేశాల్లో 'నేషనల్ ఈ-విధాన్' కింద డిజిటల్ విధానంలో సభ నిర్వహణ చేయాలని భావిస్తున్నామని స్పీకర్ తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను బడ్జెట్ సమావేశాల అనంతరం మొదలుపెట్టాలని సూచించారు. నిరంతరం రాజకీయ ఒత్తిడిలో గడిపే ప్రజాప్రతినిధులకు మానసిక ఉల్లాసాన్ని, కొత్త ఉత్సాహాన్ని ఇచ్చేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు స్పీకర్ తెలిపారు. మార్చి 5, 6, 7 తేదీల్లో క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. విజేతలకు బహుమతి ప్రదానం కూడా చేయనున్నట్లు స్పీకర్ చెప్పారు. క్రీడల నిర్వహణకు ఉభయసభల చీఫ్ విప్‌లు, విప్‌లతో కమిటీ వేయాలని నిర్ణయించారు. సమీక్ష సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, క్రీడలు-రవాణా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.




కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వేంకటేశ్వరుని ప్రతిమను అందజేస్తున్న చంద్రబాబు





కేంద్రమంత్రులు సీఆర్ పాటిల్, మనోహర్‌లాల్ ఖట్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు



పార్లమెంట్ భవనం వద్ద కేంద్రమంత్రులు, కూటమి ఎంపీలతో చంద్రబాబు

అమరావతికి చట్టబద్ధత!

(మొదటి పేజీ తరువాయి)

ఏడుగురు కేంద్ర మంత్రులను, నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బెర్రీని కలిశారు. అమిత్‌షాతో ఆయన నివాసంలో గంటపాటు చర్చించారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలను వివరించినట్లు తెలిసింది. జగన్ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వైనాన్ని తెలియజేశారు. అలాగే రాష్ట్రంలో శాంతి భద్రతలను భగ్నానికి వైసీపీ ప్రయత్నిస్తోందని చెప్పారు. ఏపీలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు తీసుకుంటున్న నిర్ణయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చే పలు నిర్ణయాలు తీసుకున్నప్పటికీ.. రెవెన్యూ లోటు భర్తీకి తలపెట్టిన ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసేందుకు కేంద్ర సహకారం అవసరమన్నారు. అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పార్లమెంటు భవనంలో భేటీ అయ్యారు. కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటు ఆమోదించేలోపు రాష్ట్రానికి మరిన్ని నిధులిచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బడ్జెట్‌కు ముందు తానిచ్చిన ప్రతిపాదనల్లో పలు అంశాలపై కేంద్రం స్పందించాల్సిందన్నారు.

కొబ్బరి సాగు అభివృద్ధికి 200 కోట్లివ్వండి..

రాష్ట్రంలో మఖానా అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను సీఎం కోరారు. కొల్లేరు సరస్సు ప్రాంతంలో 50 వేల ఎకరాల్లో మఖానా సాగుకు అనుకూల వాతావరణం ఉందని.. అవసరమైన ప్రోత్సాహకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. సేంద్రియ సాగుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. 'పీఎం ప్రణామ్ పథకం కింద ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్‌ను విస్తరించడానికి నిధులివ్వండి. రసాయన ఎరువుల వాడకం తగ్గించడం వల్ల ఇచ్చే పీఎం ప్రణామ్ ప్రోత్సాహకాలివ్వాలి. 2024-25కు సంబంధించిన రూ.216 కోట్లు ఇవ్వాలి. సాగులో రసాయనాల వినియోగం 2.28 శాతం మేర తగ్గించాం. రాష్ట్రవ్యాప్తంగా సేంద్రియ సాగును ప్రోత్సహిస్తున్నాం. ఇప్పటి వరకు 18 లక్షల మంది రైతులు 8 లక్షల హెక్టార్లల్లో సేంద్రియ సాగుకు సమ్మతి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కొబ్బరి సాగు అభివృద్ధి చేయడానికి రూ.200 కోట్లు సాయం చేయండి. కొబ్బరి ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు, కర్ణాటక తరహాలో మోడ్రన్ టెండర్ కోకోనట్ మార్కెట్ల ఏర్పాటు, కొబ్బరి రైతులకు ఆధునాతన పద్ధతులపై శిక్షణ, నర్సరీల విస్తరణకు సహకరించాలి. కొబ్బరి రైతులకు లాభం చేకూర్చేలా.. సుమారు 15 వేల మందికి ఉపాధి కలిగించేందుకు ప్రాసెసింగ్ పార్క్, మోడ్రన్ టెండర్ కోకోనట్ మార్కెట్లు పని చేస్తాయి. 'పర్ డ్రాప్.. మోర్ క్రాప్' పథకం కింద పెండింగ్‌లో ఉన్న రూ.695 కోట్లను విడుదల చేయండి. ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ సిస్టం కింద 2025-26 సీజన్‌లో తోతాపురి మామిడికి కేంద్ర వాటాగా ఇవ్వాల్సిన రూ.100 కోట్లు కూడా విడుదల చేయాలి. ధరలు పడిపోవడంతో ఇబ్బందులు పడ్డ తోతాపురి రైతులకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వాటాను కలిపి రూ.200 కోట్లు చెల్లించాం' అని చెప్పారు.

రైల్వే మంత్రికి వినతులు..

వైజాగ్-విజయవాడ మధ్య హైస్పీడ్ రైలు కారిడార్‌ను మంజూరు చేయాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం విన్నవించారు. 'విజయవాడ-కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతి-చిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్ మంజూరు చేయాలి. హైదరాబాద్-శ్రీశైలం-మార్కాపురం కొత్త రైల్వేలైన్ ద్వారా శ్రీశైల పుణ్యక్షేత్రానికి కనెక్టివిటీ పెంచాలి. తిరుపతి మీదుగా విజయవాడ-బెంగళూరు మధ్య వందేభారత్ సర్వీసు నడపాలి. వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వండి. అక్కడ రైలు బోగీల నిర్వహణ టెర్మినల్‌ను ఏర్పాటు చేయండి. బెంగళూరు-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్‌ను తిరుపతికి కనెక్ట్ చేసేలా చూడాలి. వైజాగ్ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యేలా గెజిట్ విడుదల చేయాలి. తాడిపత్రి నుంచి ముంబై జేఎన్ పీటీ పోర్టుకు అరటి ఎగుమతులకు వీలుగా 50 శాతం రాయితీపై ఖాళీ రీఫర్ కంటైనర్లు కేటాయించాలి. విజయవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిల్లో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలి. ఉత్తర-దక్షిణ భారతాలను కలుపుతూ ఇటార్సీ-విజయవాడ మధ్య ప్రత్యేక సరకు రవాణా కారిడార్ ఏర్పాటుకు సహకరించాలి. ఏపీలోని పోర్టులను అనుసంధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్‌పూర్-చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటు చేయాలి. రాయలసీమ సహా గిరిజన ప్రాంతాలను అనుసంధానించేలా పలు కొత్త రైల్వేమార్గాల ప్రతిపాదనలను ఆమోదించాలి' అని కోరారు. ఇటీవల బడ్జెట్‌లో ఏపీ గుండా వెళ్లేలా మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించడంపై మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.

లాభాలబాటలో స్టీల్‌ప్లాంట్..

కేంద్ర ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో పార్లమెంటులో భేటీ అయిన సీఎం.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ లాభాల బాట పట్టడానికి సహకరించినందుకు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం అందించిన ఆర్థిక సాయం, రాష్ట్ర ప్రభుత్వ మద్దతు, కార్మికులు- ఉద్యోగుల పట్టుదల, శ్రమతో లాభాలు సాధ్యమయ్యాయని వివరించారు. వైగా స్టీల్ ప్లాంట్ పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేస్తోందని చెప్పారు. భవిష్యత్‌లోనూ ఇదే విధమైన తోడ్పాటు, సహకారాన్ని అందించాలని కోరారు. ఆయా భేటీల్లో చంద్రబాబు వెంట కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, కూటమి ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, దగ్గుమళ్ల ప్రసాదరావు, కలిశెట్టి అప్పలనాయుడు, బైరెడ్డి శబరి, బస్తిపాటి నాగరాజు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కేశినేని చిన్ని, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీకే పార్థసారథి, తెన్నేటి కృష్ణప్రసాద్, అంబికా లక్ష్మీనారాయణ, జీఎం హరీశ్, శ్రీభరత్, వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ్ ఉన్నారు.

స్వచ్ఛభారత్ నిధులివ్వండి..

స్వచ్ఛ భారత్‌లో భాగంగా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం వివరించారు. వేస్ట్ మేనేజ్మెంట్, జీరో ల్యాండ్ ఫిల్ స్టేట్‌గా ఏపీని తీర్చిదిద్దేందుకు తీసుకున్న చర్యలను తెలియజేశారు. 'స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0' కింద రూ.276 కోట్ల ఖర్చుతో జీరో ల్యాండ్ ఫిల్ స్టేట్‌కు కార్యాచరణ రూపొందించాం. స్వచ్ఛ భారత్ మిషన్-2.0లో భాగంగా కేంద్ర వాటా కింద రూ. 105 కోట్లు మంజూరు చేయాలి' అని కోరారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో ప్రాజెక్టుల గురించి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన విశాఖ మెట్రోకు సానుకూలంగా స్పందించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. కాగా విశాఖ మెట్రో నిర్మాణానికి చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని.. వాటిని త్వరగా పరిష్కరించాలని కోరినట్లు సీఎం మీడియాకు చెప్పారు.

ఢిల్లీకి మంత్రి లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ మంగళవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యేందుకు హుటాహుటిన వెళ్లారు. ఢిల్లీలో ఆయన పలువురు కేంద్ర మంత్రులను కూడా కలిసే అవకాశం ఉంది. బుధవారం తిరిగి అమరావతి చేరుకుంటారు.



కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వేంకటేశ్వరుని ప్రతిమ అందజేస్తున్న సీఎం

ఏపీకి కేంద్రం అండ

చంద్రబాబు డైనమిక్, విజనరీ లీడర్: చౌహాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయాభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను మరింత మెరుగుపరిచేందుకు కేంద్రం అన్ని విధాలా సహకరిస్తుందని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సీఎం చంద్రబాబును డైనమిక్, విజనరీ లీడర్‌గా అభివర్ణించారు. ఢిల్లీలోని కృషిభవన్‌లో సీఎం ఆయనతో సమావేశమయ్యారు. అనంతరం ఇద్దరూ మీడియాతో మాట్లాడారు. కేంద్ర పథకాలు, సాంకేతికత విషయంలో రాష్ట్రానికి అండగా నిలుస్తామని చౌహాన్ చెప్పారు. 'జీడిపప్పు, కాఫీ, కోకో, కొబ్బరి రైతులకు మద్దతు ధర దక్కేలా చూస్తాం. మత్స్య, పశుపోషణ అభివృద్ధికి సహకారం అందిస్తాం' అని తెలిపారు. కాగా.. వ్యవసాయ రంగంలో రాష్ట్రం అగ్రగామిగా మారుతుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. ఈ ఏడాది దేశ జీడీపీలో ఏపీ వాటా 9.9% ఉండడం విశేషమన్నారు. ఉద్యాన పంటలు, ఆక్వాకల్చర్, కొబ్బరి, జీడిమామిడి, కాఫీ, కోకో వంటి పంటలకు ఆధునిక సాంకేతికతను జోడించి తర్వాతి స్థాయికి తీసుకెళ్లేందుకు కేంద్ర మార్గదర్శకత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. 50 లక్షల మంది రైతులతో కలిసి 50 లక్షల ఎకరాలలో ప్రకృతి సేద్యం చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

3 కన్నడ జిల్లాలకు హంద్రీ-నీవా జలాలివ్వండి

చంద్రబాబుకు కేంద్రమంత్రి కుమారస్వామి వినతి



ఢిల్లీలో కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామితో చర్చిస్తున్న చంద్రబాబు

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కరువు ప్రభావిత జిల్లాలైన కోలారు, చిక్కబళ్ళాపుర, బెంగళూరు గ్రామీణ జిల్లాలకు హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) పథకం ద్వారా నీరు ఇవ్వాలని కేంద్ర ఉక్కు మంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఏపీ సీఎం చంద్రబాబును కోరారు. ఢిల్లీలో మంగళవారం పార్లమెంటు భవనంలో కేంద్ర మంత్రితో చంద్రబాబు భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కోలార్ జేడీఎస్ ఎంపీ మల్లేశ్‌బాబు సీఎంకు వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే సరిహద్దు ప్రాంతాల్లో ఏపీ ప్రభుత్వం హంద్రీ-నీవా పథకం కింద నీరు సరఫరా చేస్తోందని, వాటిని కోలారు, చిక్కబళ్ళాపుర, బెంగళూరు గ్రామీణ జిల్లాలకూ మళ్లించాలని కోరారు. అనంతరం కుమారస్వామి మాట్లాడుతూ.. ఎంపీ వినతిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారని, దీనిపై తమ అధికారులతో కూలంకషంగా చర్చిస్తానని ఆయన చెప్పారని వెల్లడించారు.

పోలవరం రెండో దశకు 32 వేల కోట్లివ్వండి

నల్లమలసాగర్‌కు అనుమతులివ్వండి.. జలశక్తి మంత్రికి చంద్రబాబు అభ్యర్థన

అమరావతి/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రాధాన్య నీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఆర్థికంగా సాయపడాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈమేరకు ఆయనకు వినతిపత్రం అందించారు. ఢిల్లీ పర్యటనలో తొలుత ఆయనతోనే సమావేశమయ్యారు. పోలవరం రెండో దశ నిర్మాణ, భూసేకరణ, సహాయ పునరావాసానికి రూ.32 వేల కోట్లు ఇవ్వాలని అభ్యర్థించారు. పోలవరం ప్రాజెక్టుకు అటవీ, పర్యావరణ అనుమతుల్లేవంటూ ఇచ్చిన స్టాప్‌వర్క్ ఆర్డర్‌కు ఏడాదికో.. రెండేళ్లకో మినహాయింపులు ఇవ్వడం మామూలైపోయిందని.. ఇలా కాదని.. శాశ్వతంగా నిషేధాన్ని ఎత్తివేయాలని కోరారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు తొలి దశ పనులు పూర్తయి రెండో దశలోకి రానున్న తరుణంలో.. శాశ్వతంగా స్టాప్‌వర్క్ ఆర్డర్‌ను ఎత్తివేయడం వల్ల పోలవరం ప్రాజెక్టు ఫలాలు రైతాంగానికి, రాష్ట్ర ప్రజలకు అందుతాయని వివరించారు. అలాగే పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంచడం కారణంగా అయిన అదనపు వ్యయాన్ని రాష్ట్రానికి రీయింబర్స్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎత్తు పెంపుతో ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాల ప్రవాహంపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య గోదావరి జలాలపై వివాదం నెలకొన్న నేపథ్యంలో వివాద పరిష్కారానికి ప్రత్యేకంగా ట్రైబ్యునల్‌ను నియమించాలని కోరారు. నదుల అనుసంధాన విధానంలో భాగంగా.. వృథాగా కడలిపాలవుతున్న గోదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించేందుకు తలపెట్టిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టు పనులకు సాంకేతిక, పర్యావరణ అనుమతులు మంజూరు చేయడంతో పాటు ఆర్థిక సహకారం కూడా అందించాలని పాటిల్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదానికి సంబంధించి సంబంధిత ట్రైబ్యునల్ జారీచేసిన తుది ఆదేశాలను గెజిట్‌లో ప్రకటించాలని విజ్ఞప్తిచేశారు. దీనివల్ల వంశధార నదిపై నిర్మాణాలు పూర్తవుతాయని పేర్కొన్నారు.

సభకు వచ్చి

సీట్లో కూర్చుంటేనే హాజరు

నేటి నుంచే అమలు

- ఇకపై పట్టికలో సంతకం అక్కర్లేదు.. సభలో కుర్చీలో ఆశీనులైతేనే హాజరు
- సభకు రాకుండానే రిజిస్టర్‌లో వైసీపీ ఎమ్మెల్యేల సంతకాలు
- గైర్హాజరవుతూ జీతభత్యాలు తీసుకుంటున్న వైనం.. కొత్త విధానంతో చెక్
- స్పీకర్ ఇష్టమొచ్చినట్లు చేస్తున్నారని వైసీపీ ఆరోపణ .. టీడీపీ ఖండన

అమరావతి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభలో బడ్జెట్ సమావేశాల నుంచి కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత డిజిటల్ విధానంలో సభ్యుల హాజరు నమోదు చేయనున్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు సమావేశాలు ప్రారంభమయ్యే బుధవారం నుంచే ఈ విధానం అమల్లోకి తెస్తున్నట్లు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ తెలిపారు. డిజిటల్ విధానం అమలు చేస్తున్న నేపథ్యంలో ఇకపై సభ్యులు హాజరు పట్టికలో సంతకం చేయనవసరం లేదని, దానిని తొలగిస్తున్నామని స్పష్టం చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రాకుండా బయట రిజిస్టర్‌లో సంతకాలు చేసి జీతభత్యాలు తీసుకుంటుండడంపై గత కొన్నాళ్లుగా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగిన శాసనసభ స్పీకర్ల 86వ అఖిల భారత మహాసభలోనూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు దీనిని ప్రస్తావించారు. అసెంబ్లీకి రాని సభ్యులకు 'నో వర్క్.. నో పే' విధానం అమలు చేయాలని, అవసరమైతే రైటు టు రీకాల్ విధానాన్ని తీసుకురావాలని గట్టిగా సూచించారు. ఈ నేపథ్యంలో తాజాగా అమలు చేయనున్న డిజిటల్ విధానంతో వైసీపీ ఎమ్మెల్యేలకు చెక్ పెట్టినట్లు అవుతుంది. ఈ నేపథ్యంలో.. సభ అనుమతి లేకుండా స్పీకర్ ఇష్టమొచ్చినట్లు కొత్త విధానాలను అమలు చేస్తున్నారని వైసీపీ ఎమ్మెల్యేలు ఆరోపణలు మొదలుపెట్టారు. ఈ ఆరోపణలను టీడీపీ వర్గాలు ఖండించాయి. అసెంబ్లీ నిబంధనావళిలోని రూల్ 362.. అసెంబ్లీలో ఎలాంటి కొత్త విధానాలు అమలు చేయడానికైనా స్పీకర్‌కు సర్వాధికారాలు ఉన్నాయని స్పష్టం చేస్తోందని పేర్కొన్నాయి.

కుర్చీలో కూర్చుంటేనే హాజరు..

శాసనసభలో ఏఐ ఆధారిత హాజరు నమోదుకు ఏడాదిగా కసరత్తు జరుగుతోంది. సభ్యులు సభలో తమకు కేటాయించిన కుర్చీలో కూర్చున్న తర్వాతే.. ఏఐ ఆధారిత డిజిటల్ విధానం సంబంధిత సభ్యుడి హాజరును నమోదు చేస్తుంది. ఈ కారణంగా గతంలో మాదిరి సభకు ఆలస్యంగా వచ్చి సమావేశాలు ముగియకముందే వెళ్లిపోవడానికి ఆస్కారం ఉండదు. సభ్యులు సభలో ఎంత సమయం ఉన్నారనే విషయాన్నీ తెలుసుకోవచ్చు. ఏఐ ఆధారిత హాజరు విధానంలో అత్యాధునిక ఫేస్ రికగ్నైజేషన్ టెక్నాలజీని వినియోగిస్తారు. సభ్యుడు తనకు నిర్దేశించిన సీటులో కాకుండా వేరే సీటులో కూర్చుంటే అది కూడా గుర్తించి, అప్రమత్తం చేయవచ్చు. ఇప్పటికే ప్రతి సభ్యుడి ఫొటోలను వెక్టరైజేషన్ ద్వారా సేకరించారు. వెక్టరైజేషన్ అంటే ఆయా సభ్యుల రూపురేఖలను గుర్తించేందుకు అవసరమైన కొలతలు తీసుకోవడమన్నమాట. ఒక్కో ఫొటోను 175 వెక్టర్ పాయింట్స్‌గా తీసుకుని సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తారు. ఈ ప్రక్రియను ఇప్పటికే పూర్తిచేశారు. సభలో పీటీజెడ్(పాన్.. టిల్ట్.. జూమ్) కెమెరాలను ఏర్పాటు చేశారు. సభ్యుల హాజరు నమోదులో మానవ ప్రమేయం లేకుండా ఎకాయెకిన డ్యాష్‌బోర్డుకు సమాచారం చేరిపోతుంది.

నెయ్యి కల్తీలో వైసీపీ దుష్ప్రచారం

- ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలతో ఏకీభవించం: మాధవ్
- మోదీ, బాబు కృషితో ఏపీలో పెట్టుబడులు: బీజేఎల్‌పీ

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నెయ్యి కల్తీ వ్యవహారంలో వైసీపీ అబద్ధాలు ప్రచారం చేస్తోందని బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని తప్పుదారి పట్టించేందుకు బూతులతో రాజకీయం చేస్తోందని బీజేపీ లెజిస్లేటివ్ సమావేశం విమర్శించింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా విజయవాడలో బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి నివాసంలో మంగళవారం బీజేఎల్‌పీ సమావేశం జరిగింది. మంత్రి సత్యకుమార్, పార్టీ ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, సుజనా చౌదరి, పార్థసారథి, నల్లమిల్లి రామక్రిష్ణారెడ్డి, ఎన్. ఈశ్వరరావు, కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, పోతుల సునీత పాల్గొన్నారు. అసెంబ్లీ, మండలిలో ప్రస్తావించాల్సిన అంశాలపై బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలసి కార్యాచరణ రూపొందించారు. సమావేశం అనంతరం మాధవ్ విలేకరులతో మాట్లాడుతూ... 'జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం. పార్టీతో వాటికి ఎలాంటి సంబంధం లేదు. వివాదాస్పద వ్యాఖ్యలపై ఎమ్మెల్యేని వివరణ కోరాం' అని చెప్పారు.

ప్రాస కోసమే ఆ వ్యాఖ్య: ఆదినారాయణరెడ్డి

సాయంత్రం మాధవ్‌ను కలిసిన అనంతరం ఆదినారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'కమల వికాసంపై ప్రాస కోసమే కమ్మగా ఉందనే వ్యాఖ్యలు చేశా. కూటమి బలంగా ఉండాలని, వైసీపీ కొవ్వు కరిగించాలని కోరుకునే వ్యక్తిగా కులాలకు సంబంధించిన వ్యాఖ్యలు చేయబోను. జగన్ నుంచి నాకు, వివేకా కుమార్తె సునీతకు ప్రాణహాని ఉంది. నా వ్యాఖ్యలతో ఎవరైనా బాధపడి ఉంటే క్షమాపణ చెబుతున్నా' అని వివరణ ఇచ్చారు.



బండ్ల గణేష్‌కు స్వాగతం పలుకుతున్న సురేష్ కాకర్ల, సతీష్ వేమన

ముగిసిన బండ్ల గణేష్ పాదయాత్ర

▸▸ శ్రీవారిని దర్శించుకుని సీఎంను కలుస్తానన్న గణేష్

తిరుమల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): 'తిరుమలకు పాదయాత్రగా రావడం ఈ జన్మలో అద్భుతమైన ఘట్టంగా భావిస్తున్నా' అంటూ సినీ నిర్మాత బండ్ల గణేష్ భావోద్వేగానికి గురయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబును అరెస్ట్ చేసి జైలుకు పంపిన నేపథ్యంలో.. ఆయన జైలు నుంచి సురక్షితంగా బయటకు వస్తే హైదరాబాద్ నుంచి తిరుమల నడిచి వచ్చి దర్శనం చేసుకుంటానని ఆయన మొక్కుకున్నారు. ఈ క్రమంలో సంకల్పయాత్ర పేరుతో గత నెల హైదరాబాద్ నుంచి పాదయాత్ర చేపట్టి, మంగళవారం మధ్యాహ్నం అలిపిరి మెట్లమార్గం ద్వారా తిరుమల చేరుకుని పాదయాత్రను పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే సురేష్ కాకర్ల, తానా మాజీ అధ్యక్షుడు, టీడీపీ స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ వేమన సతీష్ ఆయనకు స్వాగతం పలికారు. బుధవారం స్వామివారి దర్శనం తర్వాత సీఎంను కలుస్తానని గణేష్ చెప్పారు. తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఏపీ జేఏసీ చైర్మన్‌గా విద్యాసాగర్

▸▸ ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులు



విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

విజయవాడ(గాంధీనగర్), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఏపీ జేఏసీ చైర్మన్‌గా ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్‌ను జేఏసీ సమావేశంలో సభ్యులందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలోని ఎన్జీవో హోంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యలపై చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ, అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా పీఆర్సీ చైర్మన్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 33 ఏళ్ల సర్వీస్ నిబంధనపై ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవగాహన లేని కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రసాద్, జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ డీవీ రమణ, నేతలు ఎం.రఘునాథరెడ్డి, జి.హృదయరాజు, బి.సాంబశివరావు పాల్గొన్నారు.

'33 ఏళ్లకు తప్పనిసరి రిటైర్మెంట్'కు నో

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలను కేంద్ర నిబంధనలకు అనుగుణంగా మార్చాల్సి ఉంటుంది. కానీ, ఎన్నికలు దగ్గర పడడంతో ఉద్యోగ సంఘాల అభిప్రాయం కోరలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ నిబంధన పట్ల సానుకూలంగా లేదు. ఈ ముసాయిదాపై ఉద్యోగ సంఘాలు కచ్చితంగా అసంతృప్తి వ్యక్తం చేస్తాయి. అందుకే ఈ నిబంధనను తొలగించాలన్న ఉద్దేశంతో ఉంది. 33 ఏళ్ల సర్వీసు తర్వాత తప్పనిసరి రిటైర్మెంట్ అనే నిబంధన 1980 పెన్షన్ నిబంధనల్లో ఉంది. ఆ నిబంధనల్లో మొదటిది అన్ని అర్హతల ప్రకారం 33 ఏళ్ల సర్వీసు తర్వాత ఉద్యోగులు స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయడం. రెండోది ప్రజాప్రయోజనాల కోణంలో నియామక అధికారి నోటీసు ఇచ్చి రిటైర్ చేయించడం కానీ, ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వమూ ఈ నిబంధన అమలు చేయలేదు. ప్రస్తుతం ఏపీ సివిల్ సర్వీసెస్ (పెన్షన్) రూల్స్ - 2026లోని నాలుగో నిబంధన ప్రకారం, ప్రజాప్రయోజనాల కోణంలో 33 ఏళ్ల సర్వీస్ పూర్తయిన ఉద్యోగిని తప్పనిసరిగా రిటైర్ చేయించొచ్చు. స్వచ్ఛందంగా రిటైర్ అయ్యే అంశం గురించిన ప్రస్తావన అందులో లేదు. ఎందుకంటే 2026 పెన్షన్ నిబంధనల్లోని రూల్ 13 ప్రకారం 20 ఏళ్ల సర్వీసు పూర్తయిన వెంటనే ఉద్యోగి స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయొచ్చు.

శ్రీవారి నైవేద్య దినుసులూ

నాసిరకమే!



- వైసీపీ హయాంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల పేరుతో వినియోగం
- నాణ్యతపై పోటు సిబ్బంది చెప్పినా.. పట్టించుకోని నాటి పాలకులు, అధికారులు
- కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సరఫరాదారుల సమక్షంలో పరీక్షలు
- ఆయా పదార్థాల్లో మలినాలు ఉన్నాయని నివేదికలో నిర్ధారణ

తిరుపతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగమే కాదు.. చివరకు శ్రీవారికి సమర్పించే నైవేద్యం తయారీలోనూ నాసిరకం దినుసులు ఉపయోగించారు. సేంద్రియ పంట ఉత్పత్తుల పేరుతో నాణ్యత లేని దినుసులు, పదార్థాలను అన్నప్రసాదాల తయారీలో వాడారు. అయితే వాటితో ప్రసాదాల తయారీ వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అదో రకమైన వాసన వస్తోందని పోటు సిబ్బంది అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఓ కమిటీ వేసి, సరఫరాదారుల సమక్షంలో పరీక్షలు నిర్వహించారు. ఆయా పదార్థాలు నాసిరకంగా ఉన్నట్లు గుర్తించి.. 2024 సెప్టెంబరు నుంచి తిరిగి సాధారణ పదార్థాల ద్వారానే శ్రీవారికి నైవేద్యం తయారు చేస్తున్నారు.

2021 ముందు వరకు సాధారణంగానే..

శ్రీవారికి నిత్యం వివిధ రకాల అన్నప్రసాదాలు నైవేద్యంగా సమర్పిస్తారు. 2021 ముందు వరకు రైతులు సాధారణంగా పండించే పదార్థాలనే వినియోగిస్తూ వచ్చారు. అయితే యుగ తులసి గోసేవా ఫౌండేషన్ చైర్మన్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు శివకుమార్ విజ్ఞప్తి మేరకు సేంద్రియ ఉత్పత్తులను ప్రసాదంగా నివేదించేందుకు అప్పటి అధికారులు నిర్ణయించారు. రైతుల నుంచి సేకరించేందుకు కమిటీ వేయాలని 2021 జూన్ 19న పాలకమండలిలో నిర్ణయించారు. యుగ తులసి గో సేవా ఫౌండేషన్ తొలుత ఒక నెల బియ్యం, నెయ్యి, బెల్లం సరఫరా చేసింది. ఆ తర్వాత సేవా (సొసైటీ ఫర్ అవేర్‌నెస్ అండ్ విజన్ ఆన్ ఎన్విరాన్‌మెంట్) సంస్థ ద్వారా దినుసులు, పదార్థాలు సేకరించి టీటీడీకి అందించారు. ప్రసాదాల తయారీకి అవసరమైన వస్తువులను ఇచ్చేందుకు సిద్ధమని అమలాపురం ప్రాంతానికి చెందిన శ్రీ శ్రీనివాస సేవా ట్రస్టు సంస్థ 2021 అక్టోబరు 29న టీటీడీకి లేఖ రాసింది. ఇందుకు బదులుగా రూ.10 లక్షలు విరాళంగా చెల్లించిన దాతలకు ఇచ్చే ప్రత్యేక సౌకర్యాలు తమకు కల్పించాలని ట్రస్టు ప్రతినిధులు కోరారు. దీనిపై చర్చించిన నాటి బోర్డు సానుకూల నిర్ణయం తీసుకుంది. అయితే ఆయా సేంద్రియ ఉత్పత్తుల నాణ్యతపై ఫిర్యాదులు వచ్చినా పక్కనబెట్టింది.

వండుతున్నప్పుడు అదో వాసన

సేంద్రియ పదార్థాల ద్వారా ప్రసాదం తయారీలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాసన అదో రకంగా వస్తోందని పోటు సిబ్బంది చెప్పినా నాటి పాలకమండలి, అధికారులు పట్టించుకోలేదు. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 ఆగస్టు 22న అధికారులకు ఒక వినతిపత్రం అందించారు. సేంద్రియ ఉత్పత్తుల నాణ్యత బాగా లేదని పేర్కొన్నారు. ఈ ఉత్పత్తుల ద్వారా ప్రసాదం తయారు చేయడం వల్ల టీటీడీకి అప్రతిష్ఠ వస్తుందని స్పష్టం చేశారు. సేంద్రియ పదార్థాల ద్వారా ప్రసాదాల తయారీ సరికాదని ఆలయ ప్రధాన అర్చకుడిగా పనిచేసిన రమణదీక్షితులు ఆక్షేపించారు.

ఆరోపణలపై కమిటీ.. పరీక్షలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యతపై సమగ్ర విచారణకు టీటీడీ ఉన్నతాధికారులు 2024 సెప్టెంబరు 5న కమిటీని నియమించారు. ప్రసాదాల తయారీకి నెయ్యి, బియ్యం, బెల్లం ఇతర సరుకులకు సరఫరాదారుల సమక్షంలోనే 2024 సెప్టెంబరు 6న ఎస్వీ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ సైన్స్‌లో ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. ఈ పదార్థాల్లో గణనీయమైన శాతంలో మలినాలున్నట్లు 2024 సెప్టెంబరు 17న ఇచ్చిన నివేదికలో స్పష్టం చేశారు. దీంతో 2024 సెప్టెంబరు నుంచి తిరిగి సాధారణ పదార్థాల ద్వారానే శ్రీవారికి నైవేద్యం తయారు చేస్తూ వచ్చారు.

నాడు భక్తులకు సరిగా అందని నైవేద్యం

వైసీపీ హయాంలో సేంద్రియ పదార్థాలు సరిపడా అందుబాటులో లేకపోవడంతో నాడు నిత్యకట్ల ప్రసాదాలు మాత్రమే తయారు చేశారు. రోజూ 29 నుంచి 32 అర సోల గంగాళాలు, గురువారం మాత్రం 91 సోలాల గంగాళాల్లో ప్రసాదాలను తయారు చేశారు. వీటి వల్ల గురువారం 25,250, ఇతర రోజుల్లో 7,250 మంది భక్తులకు మాత్రమే ఆలయం లోపల ప్రసాదాలందేవి. ఇప్పుడు అదనంగా 64 అర సోల గంగాళాల్లో ప్రసాదం తయారీ వల్ల గురువారం 42,500, ఇతర రోజుల్లో 24,750 మంది భక్తులకు ప్రసాదాలు అందిస్తున్నారు.

నెయ్యి ట్యాంకర్ల నుంచి లంచాలు..

▸▸ తిరుచానూరు మార్కెట్ కమిటీ ఉద్యోగిపై వేటు

▸▸ వైష్ణవి డెయిరీ లావాదేవీలపై లోతైన విచారణ

తిరుపతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కాంట్రాక్టు ఉద్యోగి తంబూరు రాధాకృష్ణపై వేటు పడింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీకి వెళ్లే నెయ్యి ట్యాంకర్ల నుంచి లంచాలు తీసుకున్న వ్యవహారంలో ఆయన్ను ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ మేరకు తిరుచానూరు మార్కెట్ కమిటీ కార్యదర్శి హరికిషోర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాధాకృష్ణ వైసీపీ హయాంలో ఆరు నెలల వ్యవధిలోనే టీటీడీకి భోలేబాబా డెయిరీ సరఫరా చేసిన నెయ్యి ట్యాంకర్ల నుంచి రూ.3.68 లక్షలు లంచంగా వసూలు చేశాడు. తిరుపతిలోని అలిపిరి చెక్ పాయింట్ వద్ద మాటు వేసి ఈ దందా నడిపాడు. అసలుకు అలిపిరి చెక్ పాయింట్ వద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెక్ పోస్టు లేదు. అయినా రూ.లక్షలు వసూలు చేసిన రాధాకృష్ణ ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వాచ్‌మెన్‌గా నియమితుడైన ఓ చిరుద్యోగి. భోలేబాబా డెయిరీ కమీషన్ ఏజెంట్ పీపీ శ్రీనివాసన్ డెయిరీలో రాధాకృష్ణకు ఇచ్చిన లంచాల వివరాలు సిట్ కంటబడ్డాయి. సిట్ నివేదిక నేపథ్యంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఇప్పటికే తిరుచానూరు మార్కెట్ కమిటీ కార్యదర్శి జానకిరామ్‌ను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

వైష్ణవి డెయిరీపై విచారణకు ఆదేశం

మరోవైపు తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పునబాక వద్ద ఉన్న వైష్ణవి డెయిరీ ఉత్పత్తుల రవాణాకు సంబంధించిన లావాదేవీలపై వ్యవసాయ మార్కెటింగ్ శాఖ లోతైన విచారణకు ఆదేశించింది. సిట్ నివేదికతో ఇప్పటికే ప్రాథమిక విచారణ చేపట్టిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. 2023 నవంబరు 21 నుంచి 2024 జూలై 3 వరకు వైష్ణవి డెయిరీ నుంచి వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు సెస్ తదితర పన్నుల కింద రూ.57.38 లక్షలు చెల్లింపులు జరిగినట్టు పేర్కొన్నారు.

ఆ ఐదేళ్లలో నెయ్యి కొనుగోళ్ల వివరాల కోసం లేఖ

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు టీటీడీకి నెయ్యి సరఫరా చేసిన డెయిరీలు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు సక్రమంగా సెస్ చెల్లించాయా? లేదా అన్నదానిపై తాజాగా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ దృష్టి సారించింది. ఆ క్రమంలో 2019-2024 మధ్య చేపట్టిన నెయ్యి కొనుగోళ్ల వివరాలు కోరుతూ టీటీడీకి లేఖ రాసింది.

మీ పోలీస్... మీ ఫ్రెండ్..!

- ▸▸ కియోస్కుల ద్వారా పోలీస్ సేవలు ప్రజలకు చేరువ
- ▸▸ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండానే ఫిర్యాదుకు అవకాశం
- ▸▸ విశాఖ నగర పోలీస్ కమిషనర్ కొత్త ప్రయోగం
- ▸▸ రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు
- ▸▸ ఫిర్యాదు చేసినవారికి అక్కడికక్కడే రశీదు జారీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఏదైనా అన్యాయం జరిగినప్పుడు.. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలంటే కొందరు వెనుకాడుతుంటారు..! జరిగిందేదో జరిగిపోయింది... అనే భావనతో బాధను దిగమింగుకుని మిన్నకుండిపోతారు. ముఖ్యంగా మహిళలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి భయపడుతుంటారు. ఈ సమస్యకు పరిష్కారం చూపే దిశగా విశాఖ నగర కమిషనర్ శంఖబ్రతబాగ్చీ 'మీ పోలీస్... మీ ఫ్రెండ్' పేరిట కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టనున్నారు. అలాంటివారి కోసం కియోస్కులను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. బాధితులు కియోస్క్ వద్ద తమ సమస్య చెబితే ఆటోమేటిక్‌గా ఫిర్యాదును స్వీకరించి సంబంధిత పోలీస్ స్టేషన్‌కు చేరవేస్తుంది. దానికి సంబంధించిన రశీదును కూడా జారీచేస్తుంది.

స్టేషన్ వరకూ రాని కేసులు ఎన్నో..

విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏటా దాదాపు 10 వేల కేసులు నమోదవుతుంటాయి. అనేక రకాల కారణాలతో స్టేషన్ వరకూ రాకుండా ఆగిపోయే కేసులు కూడా అంతే సంఖ్యలో ఉంటాయని అంచనా..! కొంతమంది విద్యార్థులు, మహిళలు తమకు అన్యాయం జరిగినా...పోలీసులకు ఫిర్యాదు చేయడానికి భయపడతారు. ఆర్థికంగా సంపన్నులు, సమాజంలో పలుకుబడి ఉన్న కుటుంబాలకు చెందిన మహిళలు కూడా ఫిర్యాదు చేసేందుకు మందుకురారు. దీన్ని ఆసరాగా తీసుకుని పోకిరీలు, దొంగలు, మోసగాళ్లు పెచ్చుమీరిపోతున్నారు. ఈ నేపథ్యంలో కియోస్కులను అందుబాటులోకి తీసుకొస్తే.. స్టేషన్ మెట్లు ఎక్కాల్సిన అవసరం లేకుండానే పోలీస్ సేవలను ప్రజలకు చేరువచేసే అవకాశం ఉంటుందని పోలీస్ కమిషనర్ గుర్తించారు. నగరంలో ఎక్కువగా మహిళలపై వేధింపులు, చోరీలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఈ కియోస్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కియోస్క్‌లో తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలను అర్థం చేసుకునే సదుపాయం ఉంటుంది. ఒకవేళ ఫిర్యాదును కాగితంపై రాసి కియోస్క్ వద్ద ఉన్న స్కానర్‌లో పెడితే స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో పోలీస్ స్టేషన్‌కు చేరవేసేస్తుంది. ఈ తరహా కియోస్కులను రైల్వేస్టేషన్, ద్వారకా బస్‌స్టేషన్, రద్దీగా ఉండే ఇతర బజార్లు, విద్యాసంస్థల వద్ద ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి 'మీ పోలీస్... మీ ఫ్రెండ్' అని నామకరణం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే దీనిపై సమగ్ర సమాచారం అందజేశారు. అక్కడి నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే కియోస్కులను అందుబాటులోకి తేవాలని సీపీ భావిస్తున్నారు. కియోస్క్ ఏర్పాటైతే దేశంలోనే ఈ తరహా ఫిర్యాదులు స్వీకరిస్తున్న మొదటి నగరంగా విశాఖకు గుర్తింపు లభిస్తుందని సీపీ బాగ్చి వివరించారు.

ప్రాణం తీసిన కేబుల్

▸▸ రోడ్డుకు అడ్డంగా వేలాడిన కేబుల్ మెడకు తగిలి.. బైక్ నుంచి కిందపడి ప్రధానోపాధ్యాయుడు మృతి.. బాపట్ల జిల్లాలో దుర్ఘటన



ప్రమాదానికి కారణమైన కేబుల్, శ్రీనివాసరావు (ఇన్‌సెట్)

గవినివారిపాలెం (చీరాల), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కేబుల్ సిబ్బంది నిర్లక్ష్యం.. ఓ ప్రాధానోపాధ్యాయుడి ప్రాణాలను బలి తీసుకుంది. రోడ్డుకు అడ్డంగా వేలాడిన కేబుల్ బైక్‌పై వెళ్తున్న ఆయన మెడకు చుట్టుకోవడంతో కిందపడి ప్రాణాలు కోల్పోయారు. బాపట్ల జిల్లా, చీరాల మండలం గవినివారిపాలెం సమీపంలో మంగళవారం దుర్ఘటన చోటుచేసుకొంది. పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన అంగిరేకుల శ్రీనివాసరావు (58) గవినివారిపాలెం జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. బాపట్లలో స్థిరపడిన ఆయన నిత్యం ద్విచక్రవాహనంపై గవినివానిపాలేనికి వచ్చి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు బయలుదేరారు. 8:45 సమయంలో దేవినూతల-గవినివారిపాలెం మధ్య రోడ్డుకు అడ్డంగా గాలిలో వేలాడుతున్న ఏపీ ఫైబర్ కేబుల్ ఆయన మెడకు చుట్టుకుంది. దీంతో ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న ఈపూరుపాలెం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. బాధ్యులపై కేసు నమోదు చేశారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆకస్మిక మరణంతో చిన్నారులు, ఉపాధ్యాయులు విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనపై ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. గ్రామాల్లో అనేకచోట్ల కేబుల్స్ రోడ్లకు అడ్డంగా వేలాడుతున్నాయని, వాటిని పర్యవేక్షించాల్సిన నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డాయి.

బైక్‌పై తండ్రి మృతదేహాన్ని కూర్చోబెట్టి.. బాధను దిగమింగుతూ 11 కి.మీ ప్రయాణం

కర్లపాలెం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తండ్రి మరణించాడన్న బాధ ఓ వైపు.. కనీసం ఆ మృతదేహాన్ని తరలించేందుకు కూడా డబ్బుల్లేని దైన్యం మరోవైపు... దుఃఖంతో నిండిన ఆ పసి మనసుని మెలిపెడుతుండగా తన తండ్రి అంతిమ పయనానికి ద్విచక్ర వాహనమే దిక్కయింది. ఆస్పత్రి వద్ద మహాప్రస్థానం వాహనం అందుబాటులో లేని దౌర్భాగ్య స్థితిలో... ఆ యువకుడు తండ్రి మృతదేహాన్ని బైక్‌పై కూర్చోబెట్టుకుని తీసుకెళ్తున్న దృశ్యం మనసులను కలచివేసింది. భుజానికి ఆనుకుని నిర్జీవంగా పడిఉన్న తండ్రి మృతదేహాన్ని 11 కిలోమీటర్లపాటు తీసుకెళ్తూ ఆ కుమారుడు పడిన మానసిక వేదన వర్ణనాతీతం..! బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం చింతాయపాలెం గ్రామ పరిధిలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది.

ఆటో బాడుగ కట్టలేక..

కర్లపాలెం మండలం చింతాయపాలెం గ్రామంలోని రాళ్ల చెరువు కట్టపైన నివాసముండే నక్కా నాగేసు మంగళవారం ఉదయం గుండెపోటుతో కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన బైక్‌పైనే బాపట్లలోని ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు మహాప్రస్థానం సేవలు ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో.. ఆటో కోసం ప్రయత్నించారు. అయితే ఆటోకు రూ.3,000 అడగడం, జేబులో చిల్లిగవ్వ లేకపోవడంతో చేసేది లేక నాగేసు కుమారుడు తన సోదరుడి సాయంతో తండ్రి మృతదేహాన్ని బైక్‌పై కూర్చోబెట్టుకుని స్వగ్రామానికి తీసుకెళ్లాడు. యానాది కుటుంబానికి చెందిన నక్కా నాగేసు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, బాపట్ల ఏరియా ఆస్పత్రిలో మహాప్రస్థానం వాహనం అందుబాటులో లేదని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మహాప్రస్థానం వాహనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు వివరించారు. అయితే నక్కా నాగేసు కుటుంబ దీన స్థితి తమ దృష్టికి తీసుకువస్తే మృతదేహం తీసుకెళ్లడానికి ఏర్పాట్లు చేసేవారమని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. కానీ.. ఆ సమయంలో అక్కడ కనీస స్థాయిలో కూడా సిబ్బంది పట్టించుకోలేదని తెలుస్తోంది.

బులియన్‌కు 'లిక్కర్' కిక్

- ▸▸ ఈ వ్యవహారంలో అనిల్‌చోక్రా సూత్రధారి
- ▸▸ ఆయనపై ఆర్థిక నేరాల కేసులు ఉన్నాయి
- ▸▸ నాలుగు షెల్ కంపెనీలకు నిధులు చేర్చాడు
- ▸▸ అనిల్‌చోక్రా పై చార్జిషీటు దాఖలు చేసిన సిట్



విజయవాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ఏ49గా ఉన్న అనిల్‌చోక్రాపై సిట్ అధికారులు ఏసీబీ కోర్టులో మంగళవారం చార్జిషీటు దాఖలు చేశారు. చోక్రాను అరెస్టు చేసి 90 రోజులు కావడంతో అధికారులు ఛార్జిషీటును కోర్టులో సమర్పించారు. ఇందులో అనిల్‌చోక్రా పాత్రను ఆధారాలతో సహా వివరించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. మద్యం కుంభకోణంలో నిధులను ఇక్కడి నిందితులు అనిల్‌చోక్రా ద్వారా బులియన్ మార్కెట్‌లోకి మళ్లించినట్టు వివరించారు. మనీ లాండరింగ్‌లో అనుభవం ఉన్న అనిల్‌ను మద్యం కుంభకోణంలోని నిందితులు ఉపయోగించుకున్నారని పేర్కొన్నారు. రాజస్థాన్‌కు చెందిన అనిల్‌చోక్రా నవీ ముంబైలో స్థిరపడ్డాడు. రాష్ట్రంలో మద్యం కంపెనీల ద్వారా వచ్చిన ముడుపులను మళ్లించడానికి కేసులోని ప్రధాన నిందితులు ఆయనను సంప్రదించారు. అనిల్ సృష్టించిన నాలుగు సూట్‌కేస్ కంపెనీలకు రూ.77.55 కోట్లు మళ్లించారు. ఆదాన్ డిస్టలరీ నుంచి రూ.18 కోట్లు, లీలా డిస్టిలరీస్ ఉంచి రూ.20 కోట్లు, స్పై ఆగ్రో డిస్టిలరీస్ నుంచి రూ.39 కోట్లు ఈ కంపెనీలకు వెళ్లినట్టు సిట్ గుర్తించింది. ఈ నాలుగు కంపెనీలకు వెళ్లిన డబ్బులు తర్వాత మరో 32 షెల్ కంపెనీలకు వెళ్లాయి. అక్కడి నుంచి ప్రధాన నిందితుల చేతుల్లోకి వెళ్లినట్టు సిట్ తేల్చింది. చోక్రాపై ముంబైలో ఆర్థిక నేరాలకు సంబంధించి కేసులు ఉన్నాయని అధికారులు ఛార్జిషీటులో పేర్కొన్నారు. రూ.304 కోట్లకు ఓ బ్యాంకును, జీఎస్టీ అధికారులను మోసం చేశాడు. దీనిపై ముంబైలోని ఆర్థిక నేరాల విభాగం కేసు నమోదు చేసింది. మనీలాండరింగ్‌కు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నాలుగు కేసులు నమోదు చేసిందని స్పష్టం చేశారు.

ఎడాపెడా దోచేశారు

(మొదటి పేజీ తరువాయి)

అవినీతి తీరుపై విజిలెన్స్ ఇప్పటికే ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించింది. అక్రమాలకు పాల్పడిన అధికారుల జాబితాను రూపొందించి, వారిపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. హౌసింగ్ అధికారుల సహకారంతో భారీ మొత్తాల్లో ముందుగానే బిల్లులు తీసేసుకుని పేదలకు ఇళ్లు కట్టి ఇవ్వని కాంట్రాక్టర్ల నుంచి అదనపు మొత్తాలను రికవరీ చేయాలని కూడా విజిలెన్స్ సిఫారసు చేసింది. అక్రమాలకు పాల్పడిన హౌసింగ్ ఏఈలు, డీఈలు, డీఈఈలు, ఈఈలు, డీహెచ్‌హెచ్‌లతో పాటు పదవీ విరమణ చేసిన అధికారులపై క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధం చేస్తూ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ అరుణ్‌బాబు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పలు జిల్లాలో 300 నుంచి 400 మందికి పైగా హౌసింగ్ ఇంజినీర్లు, వార్డు ఎమినిటీస్ సెక్రటరీలకు ఈ షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఇళ్లు నిర్మించని కాంట్రాక్టర్లతో వెంటనే వాటిని పూర్తి చేయించాలని లేదా వారికి అదనంగా చెల్లించిన ప్రభుత్వ ధనాన్ని కాంట్రాక్టర్ల నుంచి రికవరీ చేయాలని ఆ షోకాజ్ నోటీసుల్లో పేర్కొన్నారు. లేకపోతే సంబంధిత ఇంజినీర్ల జీతాల నుంచి లేదా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ నుంచి రికవరీ చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. షోకాజ్ నోటీసులకు ఏడు రోజుల్లోగా తగిన వివరణ ఇవ్వకపోతే.. వెంటనే చార్జిమెమోలు జారీ చేసి ఉద్యోగాల నుంచి తొలగించడానికి కూడా వెనకాడబోమంటూ రాష్ట్ర గృహనిర్మాణశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ ఇటీవల జూమ్ మీటింగ్ పెట్టి క్షేత్రస్థాయి అధికారులకు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అడ్వాన్స్ తీసుకుని ఇళ్లు కట్టకుండా పోయిన కాంట్రాక్టర్లపై కూడా ఎక్కడికక్కడ పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టాలంటూ మౌఖిక ఆదేశాలు జారీచేశారు.

కాంట్రాక్టర్లంతా వైసీపీ వాళ్లే

ఇళ్లు కట్టుకోలేని పేదలకు ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇస్తుందని నాడు జగన్ ఇచ్చిన హామీతో రాష్ట్రవ్యాప్తంగా 3.51 లక్షల మంది నిరుపేద లబ్ధిదారులు ఆప్షన్-3ని ఎంపిక చేసుకున్నారు. ఈ ఇళ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్ల ముసుగులో ఉన్న వైసీపీ నేతలకు అప్పగించారు. ప్రభుత్వ పెద్దలు చెప్పారని హౌసింగ్ అధికారులు నిబంధనలను పక్కన బెట్టి టెండర్లు, అగ్రిమెంట్లు, పూచీకత్తులు (ఈఎండీ) ఏమీ లేకుండానే రూ.వేల కోట్ల విలువైన పనులను వైసీపీ కాంట్రాక్టర్లకు కట్టబెట్టేశారు. కాంట్రాక్టర్లకు ముందుగానే ఒక్కో ఇంటికి బేస్‌మెంట్ నిర్మాణానికే రూ.70 వేలు చొప్పున అడ్వాన్సులు చెల్లించారు. ఆపై అత్యంత నాసిరకంగా బేస్‌మెంట్లు నిర్మించి, వాటిలో మట్టి కూడా నింపకుండా వదిలేశారు. ఈ అక్రమాలన్నీ కళ్ల ముందు కనబడుతున్నా హౌసింగ్ అధికారులు తర్వాతి దశల (బీమ్, లింటెల్) కోసం మళ్లీ ఒక్కో ఇంటికి రూ.20వేలు చొప్పున మరోసారి కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్సులు చెల్లించారు. పేదలకు నిర్మించే ఒక్కో ఇంటి యూనిట్ విలువ రూ.1.80 లక్షలు కాగా.. వాటి పనులు జరగకుండానే హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు అడ్వాన్సుల కింద ఒక్కో ఇంటికి రూ.90 వేలు చొప్పున కాంట్రాక్టర్లకు చెల్లించేశారు. సగం డబ్బులు అడ్వాన్సుల కింద తీసేసుకున్న కాంట్రాక్టర్లు తర్వాత తూతూ మంత్రంగా గోడలు కట్టేసి వెళ్లిపోయారు. దాంతో ఆప్షన్-3 ఇళ్లు దాదాపుగా పునాదులకే పరిమితమయ్యాయి.

తప్పులన్నీ కిందిస్థాయి అధికారులవేనా?

వైసీపీ నాయకులతో కుమ్మక్కై అడ్డగోలు కార్యకలాపాల ద్వారా మొత్తం గృహ నిర్మాణ పథకాన్ని పక్కదారి పట్టించడానికి పూర్తిగా అప్పటి హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ బాధ్యుడని, ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ విభాగం ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ అక్రమాలు జరిగినప్పుడు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా ఐఏఎస్ అధికారి భరత్ గుప్తా ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలన్నీ అప్పుడు, ఇప్పుడూ కూడా గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అజయ్ జైన్ నోటీసులో ఉన్నాయని విజిలెన్స్ నివేదికలో పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత విజిలెన్స్ రిపోర్టు ఆధారంగా అక్రమార్కులపై చర్యలకు ఆదేశించడంతో.. మొత్తం తప్పులన్నింటినీ క్షేత్రస్థాయిలోని హౌసింగ్ అధికారులపైకి నెట్టేసి ఉన్నతాధికారులు తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని జిల్లాల్లో షోకాజ్ నోటీసులు అందుకున్న ఇంజినీర్లు ఆరోపిస్తున్నారు. ఉన్నత స్థాయి నుంచి ఎప్పటికప్పుడు జారీ చేసిన ఆదేశాలనే తాము అనుసరించామని, కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేసే అధికారం తమకు లేదని వారు స్పష్టం చేస్తున్నారు. తమకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకునేలా ఆదేశాలు ఇవ్వాలని వారంతా ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఒక్క రాక్రీట్ సంస్థకు దోచిపెట్టిందే 80 కోట్లు

అనంతపురం జిల్లాకు చెందిన వైసీపీ నేత, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి బంధువులకు చెందిన రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఏడు జిల్లాల్లో ఏకంగా 51,633 ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును కట్టబెట్టారు. ఈ సంస్థ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయకపోయినా హౌసింగ్ అధికారులు ఏకంగా రూ.80.53 కోట్లకుపైగా ప్రభుత్వ ధనాన్ని అదనంగా చెల్లించారు. ఈ డబ్బును రికవరీ చేయాలని ప్రభుత్వానికి విజిలెన్స్ సిఫారసు చేసింది. అలాగే నెల్లూరు జిల్లాలో ఇళ్లు నిర్మించకుండానే 178 మంది కాంట్రాక్టర్లకు రూ.63 కోట్లు అదనంగా చెల్లించారు. ఇది కాకుండా గతంలో కట్టుకున్న పాత ఇళ్లకు కూడా హౌసింగ్ అధికారులు రూ.36 కోట్లకు పైగా బిల్లులు మంజూరు చేసినట్లు విజిలెన్స్ గుర్తించింది. నెల్లూరు జిల్లాకు చెందిన జేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు 10 జిల్లాల్లో 75 వేలకు పైగా ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును అప్పగించారు. అజాయా వెంచర్స్‌కు పలు జిల్లాల్లో 23వేలకు పైగా ఇళ్ల కాంట్రాక్టును కట్టబెట్టారు. పలు జిల్లాల్లో వైసీపీ వ్యక్తులకు కాంట్రాక్టులు ఇచ్చారు. గత ప్రభుత్వ పెద్దల సిఫార్సులతో కాంట్రాక్టులు పొందిన వీరంతా రూ.వందల కోట్లలో అడ్వాన్సులు, మెటీరియల్స్ తీసేసుకుని ఇళ్లు నిర్మించకుండా చేతులెత్తేశారు. అలాంటి కాంట్రాక్టర్లందరిపై కేసులు పెట్టాలని జిల్లా అధికారులకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏలూరు జిల్లా హౌసింగ్ అధికారులు అజాయా వెంచర్స్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిగిలిన కాంట్రాక్టర్లపైనా కేసులు పెట్టేందుకు ఆయా జిల్లాల హౌసింగ్ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇక హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో దాదాపు 30వేల టన్నుల స్టీలు, భారీ మొత్తంలో సిమెంట్ ఒకేసారి కొనుగోలు చేసేశారు. కమీషన్ల కోసం దాదాపు రూ.25 వేల కోట్లకుపైగా విలువైన మెటీరియల్‌ను గొడౌన్లలో డంప్ చేశారు. ఇప్పుడదంతా తుప్పుబట్టి ఎందుకూ కాకుండా పోతోంది. ఈ మెటీరియల్ దాచడానికి తీసుకున్న గొడౌన్లకు హౌసింగ్ కార్పొరేషన్ నుంచి ప్రతి నెలా రూ.10 కోట్ల చొప్పున అద్దె చెల్లిస్తూ వస్తున్నారు.

కట్టినవి 5 లక్షల ఇళ్లే

జగన్ ప్రభుత్వ హయాంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్, గ్రామీణ్) పథకం కింద రాష్ట్రానికి 23 లక్షల ఇళ్లు మంజూరయ్యాయి. వైసీపీ దిగిపోయే నాటికి కేవలం 5 లక్షల ఇళ్లను మాత్రమే పూర్తి చేసింది. మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ఆ ఇళ్లన్నీ నిరుపయోగంగా పడిఉన్నాయి. మిగిలిన 18 లక్షల ఇళ్ల నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయినప్పటికీ ఆ ఇళ్లను పూర్తి చేస్తున్నట్లుగా హౌసింగ్ అధికారులు ఆన్‌లైన్‌లో స్టేజ్ అప్‌డేషన్ చేసేస్తూ.. వాటికి నిధులను డ్రా చేసేసుకున్నారు. పేదల ఇళ్లకు కేంద్రం ఇచ్చే సబ్సిడీ నిధులు లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తుండటంతో.. ఆ నిధులను ఎప్పటికప్పుడు కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి బదిలీ చేసుకునేలా బ్యాంకుతో మాట్లాడి ఏర్పాట్లు చేశారు. ఈ విధంగా రూ. వేల కోట్లను అక్రమ పద్ధతుల్లో కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు. తర్వాత కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ల రూపంలో రూ. కోట్లలో కూడబెట్టుకున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.